ఆంధ్ర మహిళ



ANDHRA MAHILA

PUBLISHED BY


ANDHRA MAHILA SABHA

MYLAPORE, MADRAS 4.

AUGUST '56 ANNAS 8



ఆంధ్ర మహిళా ముద్రణాలయమునకు శ్రీ దేశ్‌ముఖ్ దంపతులు విచ్చేసినప్పుడు తీసిన ఫొటో. ఇందు ఆంధ్ర మహిళాసభ సంయుక్త కార్యదర్శినులు, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, శ్రీ చింతామణి దేశ్‌ముఖ్, శ్రీమతి చెన్నమంబమ్మ, ముద్రణాలయ పరివారమూ కలరు.


దిగ్విజయముగా
నడుచుచున్నది !
జూపిటర్ వారి
ఉమాసుందరి
N.T.రామారావు • శ్రీరంజని • నాగయ్య • కన్నాంబ • రేలంగి • సురభిబాలసరస్వతి
నటించిన కరుణరసమయకథ
దర్శకుడు...
పి.పుల్లయ్య
సహాదర్శకుడు...
లంకసత్యం

ఆంధ్ర మహిళ

సంపుటి 13 :. ఆగస్టు '56 :: సంచిక 8

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్

ఆ॥ సేవజేయునట్టి, సిద్ధహస్తమునీవె
దిక్కులేని జనుల, దీప్తివిగద
ఆంధ్ర మహిళ తల్లి, యానందదాయివై
అన్నిదిశలనభయ హస్తమిడుమ॥

ఎల్. కె. దుర్గాచార్యులు.

విషయ సూచిక

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: ఆగస్టు 56 :: సంచిక 8

లోకమాన్యుడు

భారత దేశమంతటా లోకమాన్య బాలగంగాధరతిలక్ శతజయంతి ఉత్సవము మొన్న జరుపుకున్నాము. భారత ప్రజలకు పరమపవిత్రమైన స్వారాజ్య మహామంత్రం ఉపదేశించినది ఆయనే ననీ, "స్వారాజ్యము నాజన్మ హక్కు" అని భారతీయులకు అందచేసిన స్వాతంత్ర్య యోధుడనీ, ధర్మమూ, విజ్ఞానమూ తన రాజకీయ జీవితములో మేళవించిన ధీరుడు అనీ, గీతారహస్యము ఆర్కిటిక్ హోమ్ ఆఫ్‌దివేదాస్, అనే ఉద్గంగ్రంధాలురచించిన మహాపండితుడనీ ఆయనకు జోహార్లు చేయుచు ఆ కర్మయోగి జీవితము ఆదర్శవంతమని ఆయన జన్మించిన గృహము జాతీయ చిహ్నంగా కాపాడాలని నేడు మనము నిశ్చయించు కోవడము ముదావహామే. ఆయనకు ఈ జోహార్లు ఈ శ్రద్ధాంజలులు శత వార్షికోత్సవము నాటికైన చేయవలయునని బుద్ధి పుట్టుట మన యదృష్టమే.

మన దేశ చరిత్ర (ఈ వందసంవత్సరాలది మాత్రమే) తిరగవేస్తూ వుంటే కొన్ని కొన్ని విషయాలు మనకు చాలా చిత్రంగా కనపడుతవి. తిలక్ గణపతి పూజలు చేయుటకు నిశ్చయించు కొనటమేమిటి, ఆయన అది చేయకుండా గతించటమేమిటి ! అది గాంధీ మహాత్ముడే జరిపించడము చిత్రము. గాంధీ మహాత్ముని ప్రియశిష్యుడు, రాజకీయవారసు డగు పండిట్ నెహ్రూ 'కర్మ' సిద్ధాంతములో నమ్మినా, ఇటువంటి గణపతి పూజలూ, వుత్సవాలలో వుత్సాహము చూపలేకపోవటము విచిత్రము. మన దేశములో ప్రజా ప్రభుత్వమే వున్నది. Dictatorship లేదు. రష్యావలె వీరపూజా లేదు. కాని మనకిప్పుడు మహాత్మా గాంధీ సిద్ధాంతాలు కొన్నిటిని గాని శ్రీ నెహ్రూ సిద్ధాంతాలు కొన్నింటిని గాని ఎదిరించే శక్తిసామర్థ్యాలు సాహసోత్సాహాలు కూడ నాయకులన బడేవారిలో ఎంతమందికి వున్నవి. అట్లా ఎదిరించి చెప్పగల శక్తిసామర్థ్యములు గల వ్యక్తుల వాదములకు మన మెంత శ్రద్ధ చూపుచున్నాము?

ఖద్దరు విషయములో గాంధీ మహాత్ముని ఎదిరించి చెప్పగల వ్యక్తి ఒక రవీంద్రబాబే చరిత్రలో కనబడ్డాడు. ఈ నాడు నెహ్రూ గారికి భాషా రాష్ట్ర సిద్ధాంతాలు దేశాభ్యుదయమునకు మొదటి మెట్టనని ఘట్టిగా చెప్పగల వారి (మననాయకుల) భాష్యాలెవరికి వినబడు చున్నవి. అట్లే మన మత సిద్ధాంతాలు మన దేశముతో పాటు సంరక్షింప వలయునని చెప్పేవారి మాటలు కొందరికి ఛాందసముగానే నేడు కన్పడవచ్చు. నేడు చెప్పేవారికి శతవార్షికోత్సవములు జరుపు కొనవలసి వచ్చినప్పుడు కాని ఆ మాటల సత్యాసత్యములు మనకు తోపక పోవచ్చును—

లోకమాన్య బాల గంగాధర తిలక్ గారికి జోహార్లనొనర్చి ఏమి లాభము. ముఖ్యంగా మన దేశ నాయకులు ఒకసారి చేతులు జోడించితే వచ్చేలాభ మేమీ లేదు. చరిత్రనుండైనా పాఠములు నేర్చుకొని ఈనాటి విషయములు తాముగాక, తమంతటి ధీమతులకు తోచినవిషయములను సాకల్యంగా ఆలోచించి గౌరవించుటే శ్రీ లోకమాన్యునికి నిజమైన శ్రద్ధాంజలి. అదే ఆయనకు మనము నిర్మించగల జాతీయ స్థిరచిహ్నము. మరికొంతమంది దేశనాయకులు 'కర్మయోగులు'గా, తయారగుటయే మన తిలక్ శ్రద్ధాంజలి ఫలితము.

కీ॥ శే॥ జిల్లేళ్ళ తిరుమల వెంకట లక్ష్మిబాయమ్మగారు

తూర్పు గోదావరి జిల్లా పేరూరు వాస్తవ్యులు కీ॥ శే॥ జిల్లేళ్ల తిరుమల వెంకట లక్ష్మి బాయమ్మగారు ది 6—6—56 తేదీని, వారి 74 వ యేట స్వర్గస్థులైనారని వినుటకెంతయు చింతించు చున్నాము.

వారు తమ జీవితకాలంలో అనేక సత్కార్యములను ఆచరించి దేశాభ్యున్నతికి చాలా పాటుపడినవారు. అమలాపురంలోని రామర్సు కాలేజీ స్థాపన వీరి ఔదార్యము వలననే జరిగినది. వారి కుటుంబము వారికి సంతాపము తెలియజేయుచు వారి ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్థించుచున్నాము.

ఆం. మ. స. కార్యదర్శినులు.

ఆంధ్ర మహిళాసభ

మైలాపూరు — మద్రాసు 4.

పాల పంపకం

ఆం. మ. సభ ఆవరణలో ప్రతి రోజుబీద - బాల బాలికలకు పాలు, మల్టీపర్ పస్‌ఫుడ్ పంపకము వివరములు.

1956	— మార్చి	నెలలో	— 174	మందికి
,,	— ఏప్రిల్	,,	— 158	,,
,,	— మే	,,	— 621	,,
,,	— జూన్	,,	— 435	,,

ఈ పంపకములు చేయు చుంటిమి. ప్రతీ ఆదివారం ఉదయం శిశువిహార్ బిల్డింగు వద్ద నాగేశ్వరపురంలో కూడా ఈ పంపకములు చేయు చుంటిమి.

ఆ. మ. స.
22. 7. 56.

ఆంధ్ర మహిళా సభ కార్యకలాపాలు


నర్సింగ్ హోమ్

జూలై 4 వ తేది బుధవారం సాయంత్రం 4-30 కు అడయారులోని ఆంధ్ర మహిళాసభ నర్సింగ్‌హోం భవనము ఆవరణలో క్రొత్త అవుట్‌పేషెంటు వార్డు భవనపు ప్రారంభోత్సవము జరిగెను. ప్రారంభకులు మద్రాసు ఆర్థికమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంగారు. ఆనాటి సభకు శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్ అధ్యక్షత వహించిరి.

నర్సింగ్‌హోం సూపరింటెండెంటు డాక్టరు పావనా బాయి ప్రసంగిస్తూ ఇలా అన్నారు. "ప్రముఖులగు మీ అందరి ఎదుట ప్రసంగించేభాగ్యము కలుగుట నేనెంతో శుభకరముగా భావిస్తున్నాను. ఆంధ్ర మహిళాసభా నర్సింగ్‌హోం ఇంత స్వల్ప వ్యవధిలో ఇంత ఉన్నత స్థితికి వచ్చుట మద్రాసు ఆంధ్ర ప్రభుత్వములు, మద్రాసు పురపాలక సంఘము, కేంద్ర సాంఘిక సంక్షేమసంస్థల సహాయము వల్లనూ, మద్రాసు ప్రజల ఆదరాభిమానముల వల్లనూ కలిగినదని చెప్పుటకెంతో సంతోషించుచున్నాను.

ఇందు ఔట్ పేషెంటు డిపార్ట్‌మెంట్‌వారు దాదాపు 20 వేలమందికి ఉచితముగా పాలుపంచి పెట్టుతున్నారు. ప్రస్తుతము మా నర్సింగ్‌హోంలో నున్న 32 మంచాలు చాలడంలేదు. వరండాలమీదకూడ ఉంచవలసిన అవసరం కలుగుతూంది.

1955 వ సం॥ లో 2246 పురుళ్ళుపోశాము శిశువుల వార్డులో పదిమంచములు కలవు. దానిని ఇంకా పదితో



ఆం. మ. స. నర్సింగ్ హోమ అవుట్ పేషంట్ వార్డు ప్రారంభోత్సవ సందర్భంలో శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అధ్యక్షోపన్యాసం చేస్తున్నప్పటి దృశ్యము. ఇందు ప్రారంభకులు, మద్రాసు ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంగారిని చూడనగును.

హెచ్చించ వలెననే కోరికతో ఉన్నాము. ప్రాథమిక-దాది మంత్రసానులుగా 4 జట్లుగా శిక్షణ ఇచ్చు చున్నాము. మొదటిజట్టులోని అందరు విద్యార్థినులూ ఉత్తీర్ణులైనారని తెలుపుటకు ఎంతో సంతోషించుచున్నాము. ఇచ్చటశిక్షణ పొందిన అందరు విద్యార్థినులకు ఆంధ్ర ప్రభుత్వము ఉద్యోగములు ఇచ్చినది.

స్కూలుఫైనలు వరకు చదివి నర్సులుగా శిక్షణ పొందిన నలుగురిని ఆంధ్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖ లోనికి తీసుకున్నది. రెండవజట్టునకు శిక్షణ జూలై నెలా ఖరుకు పూర్తి అగును.

ముప్పదిమంది ప్రాథమిక దాది మంత్రసానులకు శిక్షణ కేంద్రసాంఘిక సంక్షేమసంస్థ ప్రోత్సాహమువలన జరుగు చున్నది ఈ సంవత్సరం ఇంకొక 30 మందిని అయిద వజట్టుగా తీసికొనుటకు ఏర్పాట్లు చేయుచున్నాము. శిక్షణ కాలంలో వీరితర్ఫీదునిమిత్తం పట్నంలోని గవర్న మెంటు ఆసుపత్రులకు పంపుచున్నాము. ఇంకనూ నగ రంలోనూ, నెల్లూరు మొదలైన పరిసర ప్రాంతముల లోను బాధిత ప్రజల ఉపయోగార్థం మంత్రసానులు వారి ఇళ్ళకువెళ్ళి పురుళ్ళు పోయడమేగాక, ఆరోగ్యమునకు సలహాలు ఇచ్చుటకు జట్టుజట్లుగా ఈ సంస్థనుండి పంప బడుచున్నారు.

రెసిడెంటు మెడికల్ ఆఫీసరుకూ, శిక్షితులకూ, నర్సు లకూ. ఇతర సిబ్బందికీ నివాసం నిమిత్తం పక్కనే యున్న బంగళాకొని దానికి తగు మార్పులు చేసి వాడుకొను చున్నాము.

మాకు ధనసహాయము చేస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితములను పొందుటకు సలహాలనిస్తూ అనేక విధములఈసంస్థ పురోభివృద్ధికి పాటుపడుతున్న శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ శ్రీ చింతామణి దేశ్‌ముఖ్‌లకు మా ధన్యవాదములు.

సకల పరికరాలతో నొక ఆపరేషన్ థియేటరున్నూ, పిల్లల వినోద క్రీడలకు ఒక పార్కున్నూ మేము ప్రస్తు తము ఆశించుచున్నాము. ప్రముఖుల ఆదరముతో మాకు అవికూడ సమకూడగలవని ప్రార్థిస్తున్నాము.

తరువాత అధ్యక్షురాలు తమ ప్రసంగమున. కేవలము ప్రజలేకాక, మద్రాసు ప్రభుత్వము కూడ సహాయము నొసగిననే తాము నిర్వహించే ఈ గురుతర బాధ్యతను నిర్వర్తించ గలమనీ అందుకై స్థానిక మద్రాసు ప్రభు త్వమును తాము అర్థిస్తున్నామనీ ఈ విషయమున మద్రాసు ప్రభుత్వము తప్పకచేదోడై తమ ఉద్యమమును విజయవంతము చేసేతీరుమనని తమ దృఢనమ్మక మని పేర్కొన్నారు.

తదుపరి మద్రాసు అర్థికమంత్రి శ్రీ సి. సుబ్రహ్మ ణ్యము ప్రసంగించిరి. శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ గత పలుసంవత్సరములుగా ఎంతో మహిళా సేవచేస్తూన్నది మనకందరకూ తెలిసినదే. ఇందులో వారెంతో శ్రమ దమాలకోర్చి పాటుపడుచున్నారు ఇందువారికి కలిగినదల్లా తోటి సోదరీతతులకు సహాయపడ గల్గామనే తృప్తి తప్పి తే వేరేదీలేదు. చరిత్ర ప్రసిద్ధ నారీమణుల జాబితాలో చేర్చతగిన ఆదర్శనారీమణి శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ గారు. వారన్నట్లు ప్రజాసహకారమునకు తోడు ప్రభుత్వ సహకారము కూడ ఎంతో అవసరము. తప్పక ఈ విష యములో మాకు చేతనైన సహాయము చేయ నుత్స హించు చున్నాము. అని వారి ప్రసంగ సారాంశము.

అఖరున శ్రీమతి లక్ష్మీరఘురాంగారు (సంయుక్త కార్యదర్శిని) వందన సమర్పణ చేసిరి.

కండ్లజోళ్ల బ్యాంకు

కండ్ల జబ్బులుకల బీదవారి సహాయంనిమిత్తం ఇటీవల బొంబాయి నగరంలో ఒక కళ్లజోళ్ల బ్యాంకు స్థాపించ బడినది.

ఇతరులకు అవసరము లేని కళ్లజోళ్ళను సేకరించుటకు గాను నగరములో పలుచోట్ల పెట్టెలను పెట్టి సేకరించి నిపుణులచేత పరీక్ష చేయించి అవి సరిపోవు బీదవారికి ఉచితముగా ఇచ్చుటయే ఈ సంస్థయొక్క ప్రధాన ఆశయము.

బొంబాయి రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ శాంతి లాల్ షా ఈ సంస్థకు ప్రారంభోత్సవం చేస్తూ ఇలా అన్నారు. "ఈ కార్యం చాలా స్వల్పమైనదీ, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనదిన్నీ అయినా ఇది నాకు స్ఫురించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. నావద్ద కూడా తీసి వేసినవీ, నాకు నిరుపయోగంగా ఉన్నవీ కళ్లఅద్దాలజతలు చాలా ఉన్నాయి. ఇంకా ఎందరి వద్దనో నాలాగే ఉండ వచ్చును. అవి ఇతరులకు ఉపయోగించవచ్చును. కదా!"

"లయన్సు ఇంటర్ నేషనల్ క్లబ్" బొంబాయి శాఖ వారు దీనిని ప్రారంభించారు. ఇండియాలో ఇలాంటిది మొట్ట మొదటిది. ఈ క్లబ్ వారిచే అనేక బ్యాంకులు ఇలాంటివి నడుప బడుచున్నవి.

ఆంధ్ర మహిళాసభ

నాగేశ్వర శిశు విహార్

జూలై 6 వ తేది శుక్రవారం సాయంత్రం నాగేశ్వర పురంలోని నాగేశ్వర శిశువిహార్ భవనప్రారంభోత్సవము వైభవముగా జరిగింది. శ్రీ సర్. సి. అళగప్పచెట్టియార్ కుమార్తె శ్రీమతి ఉమయాళ్ రామనాథన్ ఈ ప్రారంభోత్సవము జరిపిరి. శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ సభకు అధ్యక్షత వహించిరి.

శ్రీమతి రామనాథన్ "నాకీ గౌరవ పురస్సర మగు ఆహ్వానము ఎంతో ఆశ్చర్యము కలిగించినది. ఎందరో ప్రముఖులుండగా నన్ను పెద్ద చేసిన శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గారికి. నేనెంతయు కృతజ్ఞురాలను. వారందరి ముందు నేను వయస్సులోనూ, అనుభవంలోనూ కూడ చిన్నదాననే అయినా వారందరిలోనుండి నన్నే ఎంచి ఈ మహత్కార్యమునకు ప్రోత్స హించుట ఎంతయు ముదావహము.

నేను ముగ్గురు పిల్లల తల్లినైనా ఇట్టి శిశువిహార్ యొక్క ఆవశ్యకతను ఇన్ని నాళ్ళుగా గుర్తించలేకపోయి నందు కెంతో చింతిల్లు చున్నాను. అస్వస్థులైన మా తండ్రిగారి కుశలము విచారించవచ్చి దయతో దేశ్‌ముఖ్ దంపతులు ఆ ప్రక్కనే యున్న నన్నుచూచి తమ మనస్సులోని ఉద్దేశమును వెలిబుచ్చి నాచే ఈ ప్రారంభోత్సవము చేయించ వలసినదిగా మా తండ్రిగారిని కోరివారి అంగీకారమును తీసుకొని వెళ్ళిరి. నాబదులు మా తండ్రిగారు సరే అనటం ఆశ్చర్యకరముగాభావించి ఆ మహత్కార్యమును నిర్వహించుటకు సమర్థురాలనాయనియోచించవలసియుండెను.

ఆంధ్రమహిళాసభ సంస్థద్వారా ఇంతవరకు శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఎంతో ప్రజా (మహిళా) సేవచేస్తూనే యున్నారు. ఆంధ్రమహిళా సభ శాఖలు, నర్సింగ్‌హోం ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్ మున్నగు వాని వలెనే ఈ శిశువిహార్ కూడ అభివృద్ధి చెందుతుందని నాదృఢ విశ్వాసము. ఈ శిశు విహార్ స్థాపించుటకు సహాయపడిన వారందరు అభినందనీయులు. వారిలో ముఖ్యులు ఈ విహార్ భవన నిర్మాణమునకై స్థలము ధనము హృదయ పూర్వకముగా విరాళమిచ్చిన శ్రీ దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి సతీమణి శ్రీమతి రామాయమ్మ గారు మిక్కిలి అభినందనీయురాలు. విశ్వదాతగా ప్రఖ్యాతి గాంచిన భర్తయొక్క అడుగుజాడల్లో నడిచే ఈ ఆదర్శ



శిశువిహార్ ప్రారంభోత్సవ సమయంలో శ్రీమతి ఉమయాళ్ రామనాథన్ ప్రసంగిస్తున్నారు.



నాగేశ్వర శిశువిహార్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న శ్రీమతి శివలెంక కామాక్షమ్మగారు, శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి శ్రీమతి ఉమయాళ్ రామనాథన్; శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్, శ్రీమతి లక్ష్మీపార్వతి, చెట్టినాడ్ రాణీగార్లు.

పత్ని ప్రతిఒక భారతమహిళకు ఆదర్శప్రాయమే. జీవుల సేవ చేయుటయే మృతులను పూజించుట అనే పరమ సత్యాన్ని ఈమె ఇవ్విధమున లోకానికి చాటి ధన్యత గాంచెను." అని తమ ఉపన్యాసములో నుడివిరి. ఆమె సభా సంయుక్త కార్యదర్శినులకు అభివందనములర్పిస్తూ తమ ఉపన్యాసమును ముగించిరి.

తరువాత శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ ప్రసంగిస్తూ, సరిగ్గా ఆరుమాసాల క్రితం ఇక్కడ శ్రీ బి. పట్టాభిసీతారామయ్య గారు శంఖుస్థాపన చేసిరి. ఆనాడే క్రింది మధ్యతరగతి కుటుంబీకుల కుపయోగించే ఒక శిశువిహార్ (క్రీచ్)ను నెలకొల్పాలనే మాచిరవాంఛిత ఆశా సౌధానికి కూడా శంఖుస్థాపన జరిగింది. ఈ శిశువిహార్ దేశోద్ధారకుని సతి శ్రీమతి రామాయమ్మగారి భూరి విరాళముననే రూపొందినదని మీరెరుగుదురు. సుమారు 1½ఎ॥ స్థలము రూ 5000 లు వారొసగిరి. కేంద్ర సంక్షేమ సంస్థ రూ 10,000 లు ఇచ్చిరి. మొత్తము శిశువిహార్ భవన నిర్మాణమునకు ఇంతవరకు రూ 12,000 ఖర్చయినది. ఇంకా రూ 5,000 ఆంధ్రమహిళాసభ విరాళములద్వారా సేకరించాలని మాఅంచనా. ఈ విషయమై అందరి సహకారము ఎంతో అవసరము. విశాల హృదయులు శ్రీ అళగప్ప చెట్టియార్‌గారు తాముగా ధనవిరాళమొసగి మేము కోరినదే తడవుగా తమ కుమార్తె ఈ శిశువిహార్‌ను ప్రారంభించుట కంగీకరించి సహాయము చేసిరి. ఈవిధముగానే ఈ మహా నగరపు ప్రముఖవ్యక్తులందరూ కూడ మాకు తమకుచేతనైన సహాయము చేసి ఈ ఆరే నెలల శిశువు (శిశువిహార్)ను వినూత్న శోభలతో పెంచి పెద్ద చేసెదరని ఆశిస్తున్నాము.

నెలఆదాయము నూరు అంతకు తక్కువకల వారి పిల్లలకు ఇది ఎంతో ఉపయోగప కరము, అనాగరికుల చేతులలో పాపను వదలుట శ్రేయస్కరము కాదు. ఈ

తరగతికి చెందినవారు ట్రెయిన్డ్ ఆయాను నియమించు కొనజాలరు. ఈ శిశువిహార్‌లో ఒక ట్రెయిన్డ్ టీచరు, ఒక ఆయా ఉంటారు, ఇప్పటికి 18 మందిపిల్లలున్నారు ఇంకా ఆరుగురిని చేర్చుకోగలము. ఇచ్చటి పిల్లలకు మధ్యాహ్నపు ఆహారము ఉచితముగా ఈయబడును. ముఖ్యముగా $2\frac{1}{2}$–$5\frac{1}{2}$ మధ్య వయస్సుపిల్లలకీ శిశువిహార్ ఎంతో సౌకర్యము. వస్తువుల ధరలధికముగా పెరిగిన ఈ రోజులలో స్వల్పఆదాయముతోమేము పై సౌకర్యము లొసగుట కష్టసాధ్యమే. కాని కష్టేఫలేఅన్నారు, ఇక్కడ కొంతవరకు పిల్లలకు ఆటల సౌకర్యములుకూడ ఉన్నవి ఆరోగ్య వాతావరణమునకై భవనపు ఆవరణలో తోటను పెంచుచున్నాము. ఆదర్శ గృహిణి, పితృ విధేయురాలు అయిన శ్రీ అళగప్ప చెట్టియార్‌గారి కుమార్తె శ్రీమతి ఉమయాళ్ రామనాథన్ ఈ ప్రారంభోత్సవము చేయుట మనకెంతయు అదృష్టము. నగరప్రముఖులు ప్రజలుకూడ మాకు ఇతోధిక మనఃపూర్వక సహకారముతో చేయూత నొసగి ఈ నాగేశ్వర శిశువిహార్ వృద్ధిపరచ వలెనని తిరిగి కోరుతూ నా ప్రసంగము ముగిస్తున్నాను.

సంయుక్త కార్యదర్శిని శ్రీమతి లక్ష్మీరఘురాంగారి వందన సమర్పణతో ఆనాటి సభ జయప్రదముగా ముగిసినది.

లోకమాన్యుని శతవార్షికోత్సవము

ది 23-7-1956 తేదీ ఉదయం గం 10 లకు ఆంధ్ర మహిళా సభా భవనంలో శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ జన్మదిన శత వార్షికోత్సవ సందర్భమున సభ జరుపబడెను. శ్రీమతి కె. లక్ష్మీ రఘురామ్‌గారు సభకు అధ్యక్షత వహించారు. శ్రీ పందిరి మల్లికార్జున రావుగారు లోకమాన్యుని గురించి ప్రసంగించారు. ఆంధ్ర మహిళా సభా విద్యాలయ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, కొందరు సభ్యులూ పాల్గొన్నారు.

వక్తలు తమ ఉపన్యాసంలో, లోకమాన్య బాలగంగాధర తిలక్ జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను విశదీకరించారు. భారత దేశంలో ప్రథమ స్వాతంత్ర్య సమరం లగాయతు నేటివరకు దేశచరిత్రనూ హోమ్‌రూల్ ఉద్యమాన్ని గురించీ, కాంగ్రెసు సంస్థ లోకమాన్యుని కృషివలన పొందిన పరిణామముగురించీ, లోకమాన్యుడు సంకల్పించిన స్వాతంత్ర్య సమరం గాంధిమహాత్ముడు ఏరీతిగా కొనసాగించినదీ విపులముగా ముచ్చటించారు.



లోకమాన్య బాలగంగాధర్ తిలక్ (౧౮౫౬-౧౯౫౬) శత జయంత్యుత్సవ సందర్భాన జులై ౨౩ న అన్ని తపాలా కార్యాలయాలలోనూ విడుదల చేయబడే రెండుఅణాల ప్రత్యేక తపాలా బిళ్ళ.

శ్రీమతి లక్ష్మీరఘురామ్‌గారు తెలుగురాని విద్యార్థినుల నిమిత్తం శ్రీ మల్లికార్జునరావుగారి ప్రసంగం సారాంశాన్ని ఇంగ్లీషులో విశదీకరించారు. మన పూర్వుల చరిత్రలు మనం తెలుసుకుని వారి జీవితములలోని మంచిని గ్రహించి ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించవలసినదని విద్యార్థినులను ఉద్బోధించారు.

వందనసమర్పణతో సభ ముగిసినది.



మనలో మనమాట..

ఇది నిజమే!

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

కొన్ని విషయాలు నిజమేనని శంఖం పూది చెవులో చెప్పుచున్నా, నిజమేనని నమ్మలేము. సరిగ్గా అటువంటిదే ఈ విషయము. నెల్లూరు జిల్లాలో వవ్వేరు గ్రామములో ఆ పంచాయితీ బోర్డు ఎన్నికలో సభ్యులందరూ స్త్రీలే నట. శ్రీమతులు వవ్వేటి విమలాదేవి, కంచెర్ల రుక్మిణమ్మ, పోలిచర్ల కామాక్షమ్మ, తోలేటి రమణమ్మ, అల్లాడి నారాయణమ్మ, కనిగిరి శేషమ్మ, చక్కా లక్ష్మమ్మ, రావూరి ఆదెమ్మగార్లనబడే ఎనమండుగురు మహిళామణులు ఆ పంచాయితీబోర్డు సభ్యులుగా ఎన్నుకోబడినారట.

చాల చిత్రంగావుంది. నిజంగానే రోజులు మారి నట్లుంది. అన లీలా ఎట్లా పరిణామం పొందినదని అందరికీ ఆశ్చర్యం కలిగించక మానదు. బోర్డు అభ్యర్థుల నెంచుకొనుటలో మగవారి మధ్య అంగీకారము కుదర నందున అన్ని స్థానాలు స్త్రీలకే వదలివేయ బడ్డాయని పత్రికలు తెలియజేస్తున్నాయి. పిల్లులూ, కోతి కథలోలాగ పరిణామం పొందిందన్నమాట.

కాని ఇదీ నమ్మవీలు లేకుండావుంది. పురుషులు తగాదా పడటమేమిటి, అందుకని స్త్రీలకు ఆ స్థానాలు వదిలివేయట మేమిటి? కని విని ఎరుగని సంగతే. ఏనాడూ ఈవిధంగా జరగలేదే! పురుషులలో తగాదా వచ్చినంత మాత్రాన చేతుల మీదుగా స్త్రీలకు అధికార స్థానాలు వదలుకోవటము అసలు ఆంధ్ర పురుష లక్షణమే కాదే. ఎంత తగాదా వస్తేమటుకు పిరికిపందల వలే తమ హక్కులను, అధికార స్థానాలను వదలు కుంటారా! (అలనాడు రుద్రమ దేవికి నమస్కరించ వలసి వచ్చినప్పుడు అడ్డు వచ్చిన పౌరుషము జాతీయ ఉద్యమములో వ్యయమైపోయినది కాబోలు.) క్రిందో, మీదోవారిలో వారేపడి, కుస్తీపట్టో, పోట్లాడో, కొట్లాడో, ఓ చిన్న భారతయుద్ధం జరిపో, లేక కోర్టుల పాలు కావలసినవారు తెలివిమాలి బేలలై స్త్రీలకు ధారాదత్తము చేసేశారే! నాలుగు కొప్పులు కూడితే తగాదా తప్ప దంటారే, అయితే ఎనిమిది కొప్పులు కూడితే— రామ రావణ యుద్ధము శటస్థపడవచ్చు. రామ! రామ! పాపము శమించుగాక!

వవ్వేరు పంచాయితీ వోటర్లను —ముఖ్యంగా పురుష వోటర్లను— ఇట్టి త్యాగానికి సముచిత నిర్ణయానికి అభినందించవలయునా? లేక చేతగాక స్త్రీలకు వదలి వేశారని హేళన చేయవలయునా? ఏమో, ఏది ఎక్కువ ప్రమాదమో చెప్పలేను.

ఇంతకీ ఈ ఎనమండుగురు స్త్రీలకీ ఒక అపూర్వ అవకాశము లభించింది. తమ విధ్యుక్త ధర్మము ఎట్లా నిష్పాక్షికంగా నిర్వహించగలరో, ఎవరికీ భయపడకుండా ధైర్యసాహసాలతో, న్యాయబద్ధంగా, పరిపాలన ఎట్లా నిర్వహించగలరో, కులమత భేదములు, నీ నా మనస్తత్వ ములు లేక దక్షతతో ఎట్లా సక్రమముగా పంచాయితీ బోర్డు వ్యవహారాలన్నీ చక్కబెట్టనున్నారో వీరు ప్రపం చానికి ప్రదర్శింపగలరు ఏరి స్త్రీలు? బాధ్యతగల అధికారాన్ని నిర్వహించగలవారేరని నిత్యమూ సోదరులు చేయు సవాలుకు ప్రత్యక్ష నిదర్శనముగా స్త్రీల శక్తి ఋజువు చేయగలదని మహిళాప్రపంచము వీరి మీద కొండంత ఆశపెట్టుకొని వీరిని నిత్యమూ అవలో కిస్తూనే వుంటుంది.

అప్పుడే - ఆంధ్రనారీప్రజ్ఞాప్రదర్శనానికొక మహ దవకాశమనీ, ఈ వవ్వేరు పంచాయితీ బోర్డులో ఈ మహిళా మణులు విజయాన్ని సాధిస్తే— వాడ వాడలా వారికి అయాచిత ఆహ్వానాలుండుననీ పత్రికలలో పురుషులు ప్రకటించారు.


ప్రకటించటము సులభము. కాని పోట్లాడుకోకుండా నిజంగా ఈ మహిళామణులు విజయవంతంగా వారి ధర్మాలు నిర్వహిస్తే.... .. నమ్మలేము. అయినా చెప్ప లేము. రోజులు మారినట్టున్నాయి.

ఈ పంచాయితీ బోర్డుకు మరియొక స్థానానికి ఒక సభ్యునిగాని, సభ్యురాలనుగాని కో-అప్ట చేసుకొనవలయు

నట. ఇప్పుడు సమస్య ఈనవ....గ్ర....హ ...ము స్త్రీగా, యుండవలయునా పురుషుడుగా యుండవలయునా అసట. ఈ నవగ్రహము శనిగ్రహము కాకుండావుండాలంటే స్త్రీని కో-ఆప్ట చేసుకోటమే ఉత్తమమేమో !

అసలు —మనలో మనమాట— ఈ పురుషుల్లో తగాదా నిజమైన తగాదానా లేక స్త్రీలపేర్లు మనస్ఫూర్తిగా చెప్పే సాహసము లేక ఈ తగాదాను సృష్టించారా ? ఏది నిజమో : అస లిది నిజమేనా ? ! ?

—



కృతజ్ఞత

ఆంధ్ర మహిళా సభా నర్సింగ్ హోమ్‌కు రాజా సర్ ముత్తయ్యా చెట్టియార్ రు 5000 లును శ్రీమతి నారాయణి వైద్య సుబ్రహ్మణ్య అయ్యరుగారు రు 150 ను విరాళమిచ్చినారు. వారికి మా కృతజ్ఞత.

యక్షగాన నాటకములు

శ్రీ కొత్త భావయ్యచౌదరి

ఆంధ్ర మహిళ గత సంవత్సరాది సంచికలో యక్షగానములను గురించిన యొక వ్యాసము జూచితిని. అందుజేర్చబడని మరి కొన్ని యక్షగాన నాటకములీ యాంధ్ర ప్రాంతీయ రచనలను చదువరుల యుపయోగార్థము క్రింద వివరించెదను. ఇవి 1890–1920 సం॥ల మధ్యకాలములో బహుళ ప్రచారమునకువచ్చినట్లు కనబడుచున్నది - సంగీతాభిలాషులకీ గ్రంథములు మిక్కిలి హర్షదాయకము లనవచ్చును —

(1) దేవయాన చరిత్ర - యక్షగానము - యాదవదాసుచే రచితము. 1897 సం॥లో మద్రాసులోని యాజ్ఞవల్క్యముద్రాక్షరశాలలో ముద్రితము - కవి గజవెల్లి సీమయందలి కంజీపుర వాస్తవ్యుడు. సీతారామాఖ్యునికి పుత్రుడునై యుండెను. ఈతడీ గ్రంథమును చిత్రాభాను సం॥లో రచించినట్లు వ్రాసుకొనెను. అందుచే 1882 లో జరిగినట్లు చెప్పవచ్చును. ఇతడు భద్రాద్రి శ్రీరామచంద్ర భక్తుడుగానున్నాడు. ఈ గ్రంథమున యయాతి దేవయానుల చరిత్ర చెప్పబడినది. దీనిలో కీర్తనలు, కందములు, గీతములు, పంచచామరాలుమున్నగు వృత్తములు, వచనములు, సీసములు, వాదములు, ద్విపదలు మొదలైనవి వ్రాయబడినవి. కీర్తనలకు రాగ, లయ, తాళములు చెప్పబడలేదు - కాని వీనిలో పలురకముల రాగములకు జెందినవి కనబడుచున్నవి. వీధి నాటకముగా నాడుటకొరకిది వ్రాయబడినట్లు చెప్పవచ్చును. ఇట్టివి కొన్ని హరికథా గానములకొరకే ఉద్దేశింపబడుచున్నవి కలవు.

(2) శతకంఠ రామాయణము. యక్షగానము - ఇదికాశ్యపగోత్రోద్భవుడగు కాశీపత్యాచార్య రచితము - ఈ కవి విశ్వకర్మవంశజుడు - మద్దాలశాస్త్రి తనూభవుడు - సికిందరాబాదు వాస్తవ్యుడు, మిథునకులగోత్రీకుడైన వైశ్యశిఖామణియొకడు మద్రాసులోని జీవరత్నాకరముద్రాక్షరశాలలో దీనిని ముద్రింపజేసెను. శ్రీగిరి మల్లేశ్వరస్వామికీ గ్రంథ మంకితము కావింపబడినది. ఈ గ్రంథము రాజాబాపనయ్య పుత్రుడు సంగయ యను వారి ప్రోత్సాహమున రచింపబడినట్లు కవి వ్రాసియున్నాడు. ఇది 1865 లేక 1905 లో ప్రకటింపబడినది. ఇందులో దర్వులు, వాని రాగ, తాళములు, కందములు, ద్విపదలు, వచనములు, కందార్థములు, సీసములు రచించబడినవి.

పై రెండు గ్రంథములందు చిత్రపటములు గలవు. రెండవదానిలో చాల హెచ్చుగా జేర్చబడియున్నవి.

(3) శారద త్రిపురసంహార కథ - కరీమాబాద్ నివాసి సుంకరనేని రాజమౌళి రచితము - 1890 సం॥లో మద్రాసు శ్రీరంగవిలాస ముద్రాక్షరశాలలో ముద్రితము - దీనిలో కందములు, కందార్థములు, గీత, సీస, వచనములు, దర్వులు, చూర్ణికలు, పంచచామరాలు, ద్విపదలు, భుజంగ ప్రయాతం, సుగంధివృత్తాలు, మంగళహారతులు వ్రాయబడినవి. భక్తగాయక జన మనోల్లాసకరముగా దీనిని కవి రచించెనట - ఇందులో పద్యములకు, దర్వులకు, చూర్ణికలు మొదలైనవాని కన్నిటికిని రాగములు చెప్పబడెను. కీర్తనలకు తాళములు గూడ వ్రాయబడినవి. కవి సంగీత సాహిత్య విద్యా ప్రవీణుడట. మనురాజవంశజుడట - పాల్కురికి సోమేశ్వరభక్తుడట.

(4) గజేంద్రాశ్వాసుని హరికథ - 1890 ప్రాంతమున ముద్రింపబడినది. ఆదివెలమ వంశీకుడగు కోకా వెంకట్రామానుజదాసు దీనిని రచించెను. ఇతని తండ్రి సీతయ్య - ఇది హరికథగా చెప్పబడినది. ఇందులో కీర్తనలు, సీస, గీత, మత్తేభ, కందాది పద్యములు, వచనములు, తోహరాలు, తెవారములు, భుజంగప్రయాతములు, జాతిస్వరమెట్లు మొదలైనవి కలవు - కీర్తనలకు రాగ తాళములున్నవి.

"తేవారము"న కుదాహరణము -

"యేలరావయ్యాయిందు - యెపుడు నే నిన్నుగందు।
తాళనింక నేమనందు, తనువిదే దీనబంధు"—

"తోహరా" కుదాహరణము - రగడకు దీనికి భేదమున్నట్లు కనబడదు.

"ఈ విధముననతివేగంబున హరి- యేగుచునుండగను
గోవిందునిచెయి జిక్కినబంగరు-కోకతన్నివ్వగను."

ఈ తోహరా తేవారములలో యతిప్రాసములు వాడబడినవి — గజేంద్రమోక్ష కథయె యీ కథ. గజేంద్రుని ఆళ్వారునిగా చిత్రించినాడీ కవి.

(5) సీతాస్వయంవరము. యక్షగానము - 1887 లో వాణీ వినోదముద్రాక్షరశాల, మద్రాసులో ముద్రితము. రా. గోపాలరామదాస కవి ప్రణీతము ఇందులో తోహరా లేక దోహరా దరువులు, కందములు, వచనములు గీతములు, పాటలు, మంగళములు కలవు. కీర్తనలకు రాగ తాళములు వ్రాయబడినవి. చివరి మంగళహారతిలో శ్రీరామర వెంకటసుబ్రహ్మణ్య పోషణాయ'' అని కవి వ్రాసినాడు. ఆతనికిని కవికిని గల సంబంధము తెలియుట లేదు.

(6) పసలబాలరాజు కథ - ఇది ఆధునికమైనది. కిన్నెర నాగయ్య కొడుకు వీరాస్వామి రచితము - 1931 లో శ్రీ వేణుగాన ముద్రాక్షరశాలలో ముద్రితము. దీనిలో కందములు, ఉత్పలమాలలు, వచనములు, తోహరాలు, పదములు, ద్విపదలు వ్రాయబడినవి. రాగ తాళము లేమియు నిందు వ్రాయబడలేదు. ఇందలి పదములు, తోహరాలు, ద్విపదలు పాటలవలె చదువదగిన విగానున్నవి. దీనిలోగూడ కథా ప్రతిమలు ముద్రింపబడినవి.

(7) సావిత్రీ చరిత్ర. రెంటాల సుబ్రహ్మణ్య కవి రచితము - 1908 లో కంతేరులోని దేశోపకారి ముద్రణాలయమున ముద్రితము - ఈ కవికి కస్తూరి వెంకటశివశర్మగారు కొన్ని వృత్తలక్షణాలు నేర్పగా కవితా ధోరణి నదివరకే పొందియున్నందున రచించెనట. తణుకు తాలూకా, కృష్ణాజిల్లాలోనిది కంతేరు గ్రామము - ఇందులో నాటకురంజి, మత్తకోకిల, మాలిని, వచనములు, ఉత్పల, చంపకమాలలు, సీస, కందగీతములు, కీర్తనలు, తోహెరాలు వాడబడినది. మందాక్రాంత వృత్తముగూడనున్నది. కీర్తనలు రాగ, తాళ యుక్తముగ జెప్పబడినవి. ఇది హరికథా కాలక్షేపమున కనువుగానుండునట్లుగా వ్రాయబడినది -

(8) శృంగార జావళ్ళు — నాయక, నాయకీ సంవాద రూపముగా రచింపబడినవి. కవి పేరు తెలియదు - రత్నగిరియందలి (రత్నగిరీశుడు) పార్థసారథిస్వామి పేరిట రచింపబడినవి. ఇందు కీర్తనలు మాత్రమే రాగ, తాళములతో కలవు. సంవాద రూపకమైనవగుటచే నివి యక్షగానకోటిలో జేరుచున్నవి. ఈ గ్రంథము 1890 సం॥లో సుమనోమనోల్లాసినీ ముద్రాక్షరశాలయందు ముద్రితమైన చిన్ని గ్రంథము -

ఇవిగాక యింకను ఆంధ్రదేశములో పలుతావుల అనేక యక్షగాన నాటకాలు ప్రచారములోనున్నవి. అట్టి వానిలో మట్టిగుంట శశిరేఖా నాటకము, పూసపాటి శశిరేఖా నాటకము, బెడుదూరు కళాపూర్ణోదయ నాటకం, వేములపల్లి విరాటపర్వ నాటకం, యిగుడూరు కంసవధ, తిరువళ్ళూరు హరిశ్చంద్ర, సుబ్బకవి ప్రహ్లాద, వేములపల్లి ద్రౌపదీకల్యాణం, చింతగుంట గయోపాఖ్యానం, చుక్కలూరు రామనాటకం, వేములపల్లి ఉషా పరిణయము, సంతదేలూరు రామనాటకం, నేలటూరు మైరావణ నాటకం, వెంకటంపల్లి గయోపాఖ్యానం, పోతులూరి వీరబ్రహ్మ నాటకము, యింకను చిత్రాంగి, ద్రౌపదీ వస్త్రాపహరణం, వీరభద్ర నాటకము, ధర్మాంగద, గరుడాచల, సారంగధర, సైంధవపరాభవ, మైరావణ, నాటకాయిత్యాది యక్షగానములుగా వ్రాసినవికలవు. కూచిపూడిభాగవతులు, తమ్మారపు వెంకటస్వామి బృందం పూర్వము ఆడే వీధినాటకాలు యిందులో జేరలేదు - ఈ యక్షగానాల శాఖకే చెందిన హరికథ లెన్నియోనున్నవి. ఆంధ్ర దేశములోని యీ రచనల నన్నిటి నొకచోట జేర్చి వాని వివరములను ముద్రించుటయు, నందుత్తమమైనవి యిపుడు ప్రచురణకానివి ప్రకటించుటయు ఆవశ్యకము.

తిరుమ లేశ?

చదలవాడ కోటినరసింహము

ఱేని వైరమునకుఁ బూనుకొనుచు నుండు
కాల మెఱుక పఱుపఁగలుగు చుండు
కొమరుసామి కేతనమునందుఁ గూర్చుండు
దీని భావ మేమి? తిరుమ లేశ !

వన్య మృగము గాదు, పద చతుష్కమ్ముండు
నరుఁడు గాఁడు, రెండు కరము లుండు
పైనఁ గూరుచున్న భారమ్మనక యుండు
దీని భావ మేమి? తిరుమ లేశ !

చెవినిఁ బట్టి త్రిప్ప చిట చిట మనుచుండు
కూడు గోడు లేక గోడ నుండు
ప్రొద్దుఁ దెల్పుచుండు, పుం జది గాకుండు
దీని భావ మేమి? తిరుమ లేశ !

ఐకమత్యమునకు నాదర్శ మగుచుండు
ఒంటి కంటి చూపె యొప్పుచుండు
గాగుణింతమందుఁ గల్గు నామమ్ముండు
దీని భావ మేమి? తిరుమ లేశ !

వాల ముండుఁ, గాని వానరమ్మును గాదు
పూలు గల్గుఁ, గాని పొదయుఁ గాదు
ఆఁడుదాని శిరమునందునఁ జెన్నొందు
దీని భావ మేమి? తిరుమ లేశ !

ఎండ వానలందు నుండఁగా నలయదు
ముసుఁగు వేసికొనుచు, బూబుగాదు
వలువ చినిఁగెనేని వెలుపలికిన్ రాదు
దీని భావ మేమి? తిరుమ లేశ !

తిన్న యింటివాని మన్ననకై తన
ప్రాణ మొసఁగ సిద్ధ పడుచునుండు
జన్మతోడఁ దనకు జ్ఞాతివైరమ్ముండు
దీని భావ మేమి? తిరుమ లేశ !

పుట్టినపుడు శృంగములు రెండు గల్గును
పెరిఁగి, బోడి దగుచు వెలుఁగుచుండు
మచ్చ యున్న,నేమి? మెచ్చు కొనం దగు
దీని భావ మేమి? తిరుమ లేశ !

ప్రేమ మింత లేక క్రిమి కీటకమ్ములఁ
బిలుకుమార్చుచుండు వలను బన్ని
తుదకు దాను నందె వదలదె ప్రాణమ్ము?
దీని భావ మేమి? తిరుమ లేశ !

మేనునిండ నుండు మిట్ట—పల్లమ్ములు
బొడ్డు నోటియందుఁ బొదలుచుండు
తినిన తిండి నంత తినిపించు నితరుల
దీని భావ మేమి? తిరుమ లేశ !

దీని భావ మేమి తిరుమలేశ ? జవాబులు

(1) కోడిపుంజు (2) కుర్చీ (3) గోడగడియారము (4) కాకి (5) జడ
(6) గొడుగు (7) కుక్క (8) చందమామ (9) సాలీడు (10) తిరుగలి

ఇటీవలి బాస్లే ప్రదర్శన మందలి 1956 వ సం॥ గడియార నమూనాలలో

స్విస్సులు ప్రవేశపెట్టిన అద్భుత మార్పులు

బాస్లేలో ఏప్రిల్ 14 మొదలు 24-వ తేదీవరకు జరిగిన 26-వ గడియార ప్రదర్శన సందర్భంలో, యాంత్రికంగానూ, స్టైళ్ళ విషయంలోనూ స్విస్సులు వందలాది కొత్త మార్పులను తొట్టతొలిసారిగా ప్రవేశపెట్టిరి.

దుస్తుల విషయంలో ప్యారిస్ పట్టణంలాగానే జ్యూయలరీ సందర్భంలో ఖ్యాతిచెందిన బాస్లే ప్రదర్శనంలో రమారమి 600 మంద స్విస్ గడియార నిర్మాతలు తయారుచేసిన ప్రదర్శన విశేషాలు జనసామాన్య దృష్టిని అత్యంతంగా ఆకర్షించుటయేగాక, ప్రపంచముయొక్క నానా ప్రదేశాలలోగల కొనుగోలు దార్లవద్దనుండి కనివిని యెరుగనన్ని గిరాకీలను సయితం సంపాదింపగలిగినవి.

కాలమును సక్రమంగా చూపుకొరకు పురుషుల గడియారాలకే ఇదివరకటికంటె ఎక్కువగా క్రోనోమెట్రిక్ ఉపకరణాలు అమర్చబడ్డవి. ల్యాటరల్ పుషరు లేని స్టాపువాచీ అట్టివానిలో ఒకటి. దానిలో సెకెండు ముల్లును బీగమునిచ్చు తిరుపును ప్రత్యేక పద్ధతిని తిప్పుట వల్ల చుట్టునట్లు చేయవచ్చు. మరొక నమూనా, స్విస్ ప్రభుత్వం యొక్క కంట్రోల్ ఆఫీసు రేటింగ్ సర్టిఫికేటు పొందినది. ఇది సెకెండుకు 5 సార్లకు మారుగా ఒకేసారి జరుగును. ఇందువల్ల ఈ గడియారంలో కాలం చూపుటలోనూ, సెట్టింగులోనూ ఇతోధిక క్రమబద్ధతా, సౌలభ్యమూ ఏర్పడినది. మూడవ నమూనాతో, మిగత ముల్లులు నడుస్తూవున్నా, సెకెండు ముల్లును మాత్రం ఆపివేయవచ్చు. వైద్యులు, ఇంజినీర్లు, ఆటగాండ్రు, ఫోటోగ్రాఫర్లు, ఇంకనూ ఇతరుల వృద్ధి సౌకర్యాన్ని బట్టి, కొత్త రకపు క్రోనోమీటర్లు గడియారాలు తయారుచేయబడ్డవి. ఎందువల్లనంటే, ఆయా వృత్తులు, ఆటలనుబట్టి, వారికి క్షణాంశాలు సయితం విలువగలవి.

నావికులు, ఆటగాండ్ర యొక్క సౌకర్యాన్ని బట్టి, రెండు రకాల కాంపస్ చేతిగడియారాలు తయారుచేయబడినవి. వానికి బిగువైన తడిచొరని కేసులేగాక, కాంతివంతమైన డయాళ్ళు ఒకవైపునా, సక్రమంగా నడచు నావిక దిక్సూచీ మరొకవైపునాగలదు. కేసును ఇరుసు మీదుగా తిప్పిన, దానిని ధరించునతడు సరైన కాలమునే గాక, దిక్సూచీ స్థితిగతులనుకూడా తెలుసుకోగలుగుతాడు. దిక్సూచీ నిర్మాణంలో చూపియున్న యుక్తి విశేషాలమూలాన, కాంతము యొక్క చలనవలనములను సరిపెట్టుకొనగలుగుటతో, భూమిపై దృశ్యముల సైతం కనుగొనవచ్చు.

అనేక కొత్త రకాల అలారం చేతిగడియారాలున్నూ ప్రవేశపెట్టబడ్డవి. వానిలో ఎన్నో ఉపయోగాలకు సరిపడునట్టి నమూనాలు, సవరించుకొనుటకు అనుకూలించు క్లిప్పులు గలవు. ఈ గడియారమును చేతిలోనైనా ధరించవచ్చు. లేక మేజీమీద నేరుగానైనా ఉంచుకోవచ్చు. మరొకటి జేబు గడియారము. ఇది పొద్దు చూచుకొరకు కేసును తెరుచుటతో, తనంతటతానుగా బీగం ఇచ్చుకుంటుంది. ఇంకొక రకం గడియారమును ఏదైనా ఆటోమోబైల్ ఇన్‌స్ట్రుమెంటు బోర్డు స్విచ్చికి తగిలించవచ్చు. ఇంకా ఒకటి రెండు రకాల నాదముతో, బాగా వినగలుగునట్టి ప్రత్యేక ధ్వనిగలది.

కొత్తరకం క్యాలెండరు గడియారములు

క్యాలెండరు గడియారాలలోనూ ఎన్నో ప్రధాన మార్పులున్నవి. వానిలో ఒకటి, సాధారణ రకాలవలె చుట్టుతూ .24 గంటలకొకసారి తేదీలు మార్చక, మధ్యరాత్రికి సరిగా, గబుక్కున మరుసటి తేదీకి మారుతుంది. క్యాలెండరు గడియారాలు తొట్టతొలిసారిగా కనిపెట్టబడినప్పటినుంచి, గడియార వ్యాపారస్తులందరూ వేచియున్నది ఈలాటిదానికొరకనే.

ఈయేడు ప్రదర్శించిన స్త్రీల గడియారాలలో మహాసున్నితమైన యంత్ర నిర్మాణంగల నిరుపమైన సెల్ఫ్-వైండింగ్ యంత్ర విశేషాలూ ఇదివరకటికంటె మరీ చిన్న కేసులలో అమర్చబడ్డవి. సాదా రకాలలో అన్నిటికంటే చిన్నది .455 అం॥ వ్యాసం గలది.

నవనాగరిక రకాల్ని గురించి ఎంతో గోప్యంగావున్న స్విస్ నిర్మాతలు, అత్యద్భుత నిర్మాణ విశేషాలను ప్రదర్శింప గలిగిరి. వారిలోనైతే స్పర్ధలు బహు తీవ్రంగానే యుండెను. మొత్తంమీద స్టైయిళ్ళను గురించి ప్యారిస్‌వారి అభిరుచుల చొప్పున, ఒక ప్రక్కన అతి నిరాడంబరంవైపూ, మరోప్రక్క అత్యంత డాంబికంవైపూ మొగ్గుచుండెను. 1956 వ సం॥ ఆటగాండ్ర రకాలు, సాదారకాలు, బహుమతాన్ని బట్టి, సున్నితంగానూ, చదునుగానూ, అలంకారాలేవీలేని డయాళ్ళు, ముల్లులు గలవిగానూ ఉండినవి. బహుజనాభిరుచులనను సరించి, నిర్మాతలు ఎక్కువ రవలుగల్లవానినీ అందచందాలుగా అలంకరింపబడ్డవానినే అధికంగా తయారుచేసియుండిరి. అట్టివానిలో కొన్ని, అతిసున్నితమైన పదకాలు, క్లిప్పులు, నవనాగరిక అలంకరణ విశేషాలూ గలవి.

నిగమశర్మ అక్క

'సుభాషిణి'

[ఇందలి ఇతివృత్తాన్ని తెలుగు ప్రజలకు చెప్పింది తెనాలి రామకృష్ణకవి. ఈ కథ ఆయన రచించిన పాండురంగ మాహాత్మ్యము లోనిది. ఇది జరిగిన చోటు కళింగ దేశాభరణంబగు పిఠికాపురం. ఇందు రెండే రెండు పాత్రలు. ఒకడు నిగమశర్మ. రెండవది అతని అక్క. ఆమె పేరు తెలియదు. కాని అచ్చమైన ఆంధ్ర మహిళ. ఆమె గుణగణాలూ, సౌశీల్యమూ, ప్రజ్ఞా విశేషాలు ఆదర్శప్రాయములు. —సం.]

;o:

ఆహితాగ్ని అయిన సభాపతి నివాసస్థలం కళింగ దేశానికి ఆభరణమైన పిఠాపురం. సభాపతి సద్బ్రాహ్మణ వంశంలో జన్మించాడు. ఆయన్ని వేదాలు దాచుకునే గాదె అనీ, శాస్త్రాలకి పుట్టినిల్లు అనీ, సకలమైన కళా కలాపాలకీ రచ్చపట్టు అని ప్రజలంతా కీర్తిస్తూ ఉంటే అత్యంత ప్రతిభా విశేషాలచేత వెలిగిపోతూ ఉండేవాడు.

ఆయనకు నిగమశర్మ జ్యేష్ఠ పుత్రుడు. సంప్రదాయ సిద్ధమైన సంతతిలో జన్మించి సకల నిగమ రహస్యాలూ తెలిసికోవడం వలన నిగమశర్మ అనే పేరు వచ్చింది. అతడు మన్మథునితో సరి అయిన సౌందర్యంకలవాడు. త్యాగశీలుడు. సమస్త జనులచేత సన్మానింపబడే విశుద్ధమైన ప్రవర్తన కలవాడు. కాంతిలో చంద్రునికి ఉజ్జా. అతనితో సంభాషించడం ఒక పెద్ద సంస్కారము.

అయితేనేమి ? దైవఘటనా వశంచేత అతని మనస్సు మూడవ పురుషార్థము -కామము-, నకే తిరిగిపోయినది. హోమాగ్నిని ఉష్ణాన ఊదడు కాని విరహజ్వరార్తి చే వెచ్చనూరుస్తాడు. ఆగమ వాదాలు ఔనుకాదనడుకాని విట వాదములు తీరుస్తాడు. శంఖములోని తీర్థము సేవించడు కాని యువతీమణుల అధరామృతాన్ని సేవిస్తాడు. శరీరం మీద పుణ్యచిహ్నాలు ఉంచుకొనడు కాని నఖక్షతాలు ఉంచుకోడానికి సిగ్గుపడడు. ధౌతపటావరణము, కలమాన్నభోజనము, చందనచర్చ, ప్రసూనదామములు, కపురంపు వీడ్యము, రత్నభూషణములు కలిగి నిత్యమూ పులుకడిగిన మంచిముత్యమువలె ఉంటాడు. వైదికాచారాలకి దూరమైన ప్రవర్తనచే వీట విహరిస్తూ నిగమశర్మ అనే నామధేయాన్ని నేతిబీరకాయ చేసి, సఖులూ, పరిహాసకులూ వెంట తిరుగుతూ ఉంటే, యువతీ జనులు కట్టివిడిచినబట్టలు కట్టుకుని నగరఘంటాపథాలలో నవ్వుతూ కేళీ విహారం చేస్తూ ఉండేవాడు.

తాత ముత్తాతలు తరతరాలనుంచి చీమలాగు కూడబెట్టిన ధనం ఉరగదష్టుని శరీరంలోని రక్తంలాగు ఇతని చేతినుండి జారిపోయింది. "పొందుపట్టుల అప్పులు పొడిచి" తనసొమ్ములూ, తల్లి వొంటిమీది బంగారమూ, తండ్రివద్ద పత్రాలూ, భూములూ, పుట్టలూ, అన్నీ అమ్మజూపాడు. ఇచ్ఛావిహార వర్తనుడైన ఇతనికి ఎంతకాలం ఇలా గడుస్తుంది ? "మితిగడచిన ఋణదాతలు, వెతపెట్టగ నూరు చొరక వెలివెలి దిరుగున్." ఇలా ఉండగా ఒకనాడు

"ఆ దుశ్శీలరతునియక్క యొత్తు శిక్షించెదనీ బాలిశునని తన" భర్తతో బాలురతో మాతృభవనానికి వచ్చింది.

అయిదు యోజనాల దూరంలో ఉన్న అత్తవారింటినుంచి పుట్టింటికి వచ్చిందా నిగమశర్మ అక్క. భర్తతో బిడ్డలతో కొంతకాలం అక్కడనే ఉంది. తమ్ముడు చేసిన ఘనకార్యాలన్నీ తిలకించింది. కొడుకు చెడు నడవడికి దుఃఖసాగరంలో సుడిబడే తల్లి దండ్రులకు తన వచన రచనా చమత్కారంతోనూ, అత్యంత సంతోషాన్ని కలిగించే ఉపచారాలతోనూ, కొంత దుఃఖోపశమనం చేసింది. గృహ దేవతారాధనమూ, అతిథులకు సంతర్పణలూ మళ్ళీ మొదలు పెట్టించింది. నష్టంకాగా మిగిలిన మూలవిత్తం తిరిగి జాగ్రత్తపెట్టింది. పశువులనూ, శిశువులనూ, దాసదాసీ జనాలనూ తనవారిగా చేసుకుంది. వారి కష్టాలు తొలగించింది. ఇంట్లో ఉన్న పుస్తక భాండాగారాన్ని తన భర్తకు ఒప్పజెప్పి, చెదలూ,

బూజులూ దులిపించి, శిథిలంకాకుండాను కట్టిపెట్టి ఉంచకుండాను, పురుగులు తినెయ్యకుండాను, పరహస్తగతం కాకుండానూ, ఇతర ఉపద్రవాలకు లోనుగాకుండానూ చేసి భద్రపరచింది. కూలిపోవుటకు సిద్ధంగా ఉన్న కొంప యధాపూర్వకంగా సంధానంచేయించి సంసారం మనోహరంగా నిర్వహించింది. తమ్ముని దుష్ప్రవర్తనకు లోనుగాకుండా మిగిలిన రాజానుగ్రహ దత్తములైన ఏకభోగ గ్రామములు స్వాధీనం చేసుకుని, తప్పిదారిన మడీ మట్రా, చేనూ చెట్లూ, ఉన్న పట్లుచూచి తనవారిని కాపు పెట్టింది.

గుట్టు ఇవ్వకుండా, బాధపడుతూనే, అత్తమామలకు చిత్తము వచ్చునట్లు భక్తి శ్రద్ధలతో అనేకపాట్లు బడుతూ సేవచేస్తున్న మరదలి సౌందర్యము అడవికాచినవెన్నెల అయినందుకు, అనివార్యంగా విజృంభించే ఆమె యౌవనారంభము వనకేళీపలాశదోహదమవుతున్నందుకు వగచి వగచి, కడుపు చుమ్మలుచుట్టి కన్నీరు మున్నీరుగా పొరలి పొరలి దుఃఖించింది.

ఇలా ఉండగా, ఒక రోజున ఎక్కడినుంచో చుక్క తెగి పడ్డట్టు ఆకస్మికంగా నిగమశర్మ ఇంటికి వచ్చాడు. అక్కగారిని చూచాడు. మనస్సులో కొంచం సంకోచించాడు. తిరిగి పోలేకపోయాడు. దగ్గరకువచ్చి అక్కకు నమస్కరించి తలవంచుకుని నిలబడ్డాడు. తమ్ముని చూచిందామె. మదోన్మత్త మత్తకామినీ దత్తంబులైన నఖాంకంబుల కతన కర్కశంబగు అతని శరీరము కౌగిలించుకొనుట కామె శంకించింది. ఆ దుర్విదగ్ధుని 'సీమంతపుం బెండ్లికొడుకవు' కమ్మని హేతుగర్భితంగా ఆశీర్వదించింది.

నిగమశర్మ అక్కడినుంచి పోడానికి ప్రయత్నించాడు. వినయసౌహార్దమార్దవ మధురములైన మాటలతో అతనిని ఆపుచేసి, చంద్రబింబంలా ప్రకాశిస్తున్న తన బిడ్డను, చిన్నవానిని, మేనల్లుణ్ణి ఇందమని చంకకిచ్చింది.

"ఎక్కడికిరా తమ్ముడూ! మీబావతోకలిసి భోజనం చేదువుగాని, నిమిషంలో వంటచేసేస్తాను ఉండు!" అని అతనిని నిలిపివేసి వెనుకనే నిలబడి ఉన్న మరదలికి కనుసైగ చేసింది.

ఎంతటి సౌభాగ్యం! వెంటనే ప్రాణేశ్వరుని పాదములు చల్లని నీటితోనూ వేడివేడి నిట్టూర్పులతోనూ కడిగిందామె. స్నానంచేయించి, తెల్లని బట్టలు కట్టుకోనిచ్చి, తలవెండ్రుకలలోని తడి లెస్సగా ఆర్చి, పువ్వులుచుట్టి, గంధంపూసి, అలంకరించింది అక్కయ్య. ఇలవేలుపు మాధవదేవునకు అర్చనచేసిన అఖిలాన్నాలతో మనోజ్ఞమైన భోజనము తల్లీ, తండ్రీ కొడుకూ తన భర్త, బిడ్డలూ అంతా కలిసి భుజించేలా వడ్డించింది.

నిగమశర్మకూడా సుష్టుపూర్తిగా తన కిష్టమైన వంటకాలతో భుజించాడు. సంతుష్ట మనస్కుడయాడు. భార్య తమలపాకులు చుట్టి ఇస్తూ ఉంటే మహాశిష్ఠుడులాగు అరుగుమీద చిరునవ్వునవ్వుతూ కూర్చున్నప్పుడు ఇంట్లో పనులన్నీ పూర్తిచేసుకుని "ఇంతలు నంతలు నగు తన సంతానము వెంటనంటి సందడి" చేస్తూ ఉంటే తమ్ముణ్ణి సమీపించి, అతని తలముడి విప్పి, అట్టలు కట్టిఉన్న తలవెండ్రుకలను గోళ్ళతోదువ్వి, అంట్లు తీర్చి, పేలు నొక్కి మెడ మన్ను నలిచింది. లేచి శుభ్రంగా చేతులు కడుగుకొని వచ్చి పద్మకర్ణికమీద కొలువున్న లక్ష్మీదేవిలాగ పీఠంమీద కూర్చుని కుడివైపునుంచి బిడ్డకు పాలిస్తూ తమ్మునితో

ప్రారంభించిన వేదపారమునకున్
ప్రత్యూహ మానంచునో
యేరా తమ్ముడ నన్ను జూడ చనుదే
వెన్నాళ్ళనో యుండి చ
క్షూరాజీవయుగమ్ము వాచె నినుగ
న్గోకున్కి మీబావయున్
నీరాకల్ మదిగోరు చంద్రు పొడుపున్
నీరాకరంబున్ బలెన్.

అని అంది. సర్వసంపదలూ, నిత్యశుద్ధీ, సద్గుణములూ కలిగిన తండ్రికి చంద్రునిలాంటి కుమారుడు కలిగిన చక్కగా ఉంటుంది. నీలాంటివాడు తప్పుదారిని నడిస్తే సాలగ్రామఖనిలో జాత్యల్పపాషాణాలు పుట్టినట్టుకాదా? నేనెలాగూ ఉండనుకదా! తక్కినవాళ్ళు చిన్నపిల్లలు. అగ్రజుడవైన నువ్వే ఇలా అయితే నీ ప్రాపుకోరే ఈ ముసలి తల్లి దండ్రులు ఎంతగా దుఃఖిస్తారు? బ్రహ్మదేవుడు మొదలు నీ తరందాకా విశుద్ధతరమైన వంశా

న్నయినా తలపెట్టావుకాదు. వయస్సుమీరిన ఈ తల్లి దండ్రులనైనా సంతోషపెట్టావుకాదు. అగ్నిసాక్షిగా పెండ్లాడిన ఈ ఇల్లాలిని ఏలుకున్నావుకాదు. ధర్మశాస్త్ర విత్తానికి నీకున్న ధనం చేర్చి కీర్తి గడించావుకాదు. నీ శీలము పిల్లిశీల మయింది. నీ చదువులు చిలకపలుకు లయాయి. తోడివాళ్ళు నవ్వుతూ ఉంటే ఏమిరా తమ్ముడూ ఇంత బేలవైపోయావు ? ఈ పాడు గుణం నీకెలా అబ్బింది ?" అని అతని దురాచరణములకు మనస్సు దహించుకుపోతూ ఉంటే దుఃఖం దిగమ్రింగు కుంటూ ఎలుగురాసిన గొంతుకతో ఎన్నో విధాల అతనిని మహాకోపంతో మందలించింది. తిరిగి అతనిని సామరస్యంతో పలుకరించి

పడపడ బారుచున్ వడకు
పట్టిన తల్లిని, దండ్రి, నేలలో
వెడలని తమ్మ గుర్రల, న
వీనకులాంగన, నోరులేని యీ
తోడుకుల, బంటుపెద విడ
ద్రోవక ప్రోవగనెంగు నీకిపా
ల్పడినది కర్ణనాదలనె
భారత సంహిత నిల్పచాడ్పునన్.

పడుతూలేస్తూ వాణికిపోయే ముసలి తలిదండ్రులూ, జ్ఞానమైనారాని చిన్న తమ్ములూ, నవయౌవనంలో ఉన్న భార్యా, ఈ సేవకులూ, సంసారం నీ తలమీదనే ఉన్నాయని తెలుసుకో!

నాయనా! 'నా తమ్ముణ్ణి సుజనులంతా బ్రహ్మదేవుని కంటె ఎక్కువగా పొగడుతూ ఉంటారు. అతను యజ్ఞం చేస్తూ ఉంటే ఆ వేదికమీద కూర్చునే మహా పూజ్యత నాకు కలుగుతుంది' అని పదిమందిలోనూ గర్వంగా చెప్పుకుంటూ ఉంటాను. అలాంటిది నువ్వు ఈవిధంగా సర్వగుణహీనుడవు అవడం నాకు తెలియదురా తమ్ముడూ!


నాదు సహోదరుండు సుజ
నస్తవనీయనయ ప్రసక్తి బ్ర
హ్మదుల మెచ్చడే నతని
యజ్ఞమునం గడు పూజ్యురాలనై
వేదియలంకరింతునని
పేవురిలోపల నాడుకొందు నీ
వెగ్గము లేక సర్వగుణ
హీనుడవౌట యెరుంగ తమ్ముడా!

సరే! ఇంట్లో ఉన్న సొమ్మంతా ఖర్చుపెట్టావు. కాని మూడు కారులలోనూ బంగారం పండే భూములు కూడా అమ్ముకుంటారా ? వెనక నీకు ఇంకెవ్వరూ లేరనుకున్నావా ? తమ్ముళ్ళు లేరా ? ఈవిధంగా కుల ధ్వంసం చెయ్యడం అర్థంగా ఉందా తండ్రీ నీకు ? నీ లోలత్వం ఇంతటితోకట్టిపెట్టు. వేశ్యాగృహాలకు వెళ్ళడం ఇంకనైనా మాను. ఆగృహాలు దుశ్శీలానికి ఆలవాలములు, "వారకాంతలదడవినవచ్చుగీడు"

విడు మికనైన నిట్టి యావి
వేకము, మానుక బుద్ధి పద్ధతిన్
నడువుము, నీకు గావలసె
నా? హరికౌస్తుభమైన తెచ్చెదన్
గడుసరి యచ్చకూళ్ళ పలు
గాకుల వీడుము, చేయి మీరు గా
నడచిన పూర్ణకాముడవు
నాయను జన్ముడ విట్లు సేయుదే!

ఈవిధంగా నిగమశర్మ అక్క తన సోదరునికి నయంగానూ, ప్రియంగానూ అతని మనసుకు నాటుకునే లాగు బుద్ధులు చెప్పింది. నిగమశర్మలో కొంత మార్పు వచ్చింది.

మానిపోయిన చదువులు మళ్ళీ చదవడం ప్రారంభించాడు. ఇదివరకటి స్నేహితులు ఎదురైతే తలవంచుకు తిరిగేవాడు. భార్యను ఆదరించడం మొదలుపెట్టాడు. గురువులను పూజించడం, అతిథి అభ్యాగతులను సత్కరించడం, పైరూ పచ్చా చూసుకోవడం మొదలైన పనులన్నీ ప్రారంభించాడు. తండ్రిగారి గావంచాకూడా తనే ఉదికేవాడు. తరువాత కథ ఎలా ఉండినప్పటికీ, అక్కయొక్క సహోదరప్రేమ, మాతృగృహాభిమానం, సాంప్రదాయాలని నిలబెట్టాలనే వాంఛ, గమనించదగ్గవి. వివాహం అయి అత్తింటికి వెళ్ళిన కాంతలు పుట్టింటి ఘనతలు నలుగురిలోనూ చెప్పుకోడానికి గర్విస్తారు. పాడుపడిన సంసారాన్ని సరిదిద్దడానికి ఆమె చూపిన చాకచక్యం, తమ్ముని మనసు మార్చడానికి ఆమెచూపిన సామర్థ్యమూ, హుందా, అధికారమూ, మన హైందవ గృహాలలోని జాతీయ జీవితమూ చక్కగా వ్యక్తపరచిన కవి ధన్యుడు.



పోటియె లే కుండినచోఁ
జేటగు నెందైన నంచుఁ జెప్పిన మాటన్
నాఁటికి నేఁటికి నాంధ్రులు
పాటింతురు లోక–హితము వలతురు సుమతీ !

ఎదిరించు నతఁడు లేమిని
మది కెది యగు నదియ చేయ మానం డెవఁడున్
బెదరక లోక హితమ్మును
గుదిరింపఁగఁ బోటి చేయఁగూడును సుమతీ !

ఎన్నికయందు జయమ్మం
గొన్నాతఁ డబద్ధ మాడఁగూడునె యెవ్వడున్?
పిన్నల–పెద్దల కోర్కెల
నన్నిటినిం దీర్పఁదలఁప న్యాయము సుమతీ !

పదవి లభించెడు దనుకన్
పదములఁ బడి, యది లభింపఁ బైఁ బడు కుమతిన్
అదనెఱిఁగి ప్రజాస్వామ్యము
వదిలింపఁగ వలెను వానిఁ బదవిని సుమతీ !

పన్నుల పెచ్చుం గూర్చి
విన్నయతఁడు ఖేదపడుట వెఱ్ఱితనమ్మే
పన్నులు తొలఁగినఁ గోరిన
యన్నింటికి నెవని యింట వ్యయ మగు? సుమతీ !


ఇది యగునా? మన దేశం
బుదరము నిండంఁగ దిండి యొసఁగని దకటా !
కుదురుగ నిల్వఁగ బీదకు
పదము స్థల మ్మిడఁగ జాలిపడదా? సుమతీ !

బంజరు భూమిన్ బీదలు
పుంజెగ నొనరించి, పంటపొలముగఁ జేయన్
గింజలు లంచాలకె సరి
గంజియె త్రాగుటకు మిగులఁ గలుగును సుమతీ !

"పెట్టినఁ బెండిలి యన్నము
పెట్టనిచో మూతి విఱిచి పిండం"బను ఆ
కట్టఁడిఁ దనియం బెట్టెడి
దిట్ట యెవఁడో ! ఎవనికేనిఁ దెలియునె? సుమతీ !

లంచము దిను ఉద్యోగుల
మంచము పట్టంగ నొడలు మర్దింపవలెన్
మంచితనమ్మం జూపిన
మించరె? పదసేవకొఱకు మిడుకరె? సుమతీ !

దొంగలు వేఱుగ నుందురె?
సంగతి కనిపెట్టి తీయఁజాలెడి దొరలే
దొంగల గురువులు; వారల
భంగమ్మొనరింప లే దుపాయము సుమతీ !



అణా పైసలకూ నయా పైసాలకూ మారకం నిష్పత్తి

మూడేళ్ళ కాలంలో పాత నాణెముల ఉపసంహారణ

1957 ఏప్రిల్ ఒకటవ తేదీన దశాంశపద్ధతి నాణెములు అమలులోకి వచ్చునప్పుడు ఒక అణాకు ఎన్ని నయా పైసలు వస్తాయో, ఒక నయాపైసా ఎన్ని పైసలకు సమానమో తెలుసుకోవడం సామాన్య మానవుడికి చాలా చిక్కు అవుతుంది. అయినా, పాత నాణెములు కూడా చాలాకాలం పాటు చెలామణిలో ఉంటాయి. గనుక కొత్త నాణెములకు అలవాటు పడడానికి ప్రజలకేమీ చిక్కు ఉండదు.

ప్రస్తుతం ఒకరూపాయి 192 పైసలకు, 64 కానులకూ సమానమయినట్లే, కొత్తపద్ధతి ప్రకారం రూపాయి 100 నయా పైసాలకు సమానమవుతుంది. ఇప్పటి నాణెములకూ కొత్త నాణెములకు ఉండేసామ్యం పూర్తిసామ్యం కాదు. కింది పట్టికను బట్టి వ్యక్తమవుతుంది.

నయాపైసాలు	ఇప్పటి నాణెములు.
1. నయా పైసా	1. కాని
2. నయాపైసాలు	2 కానులు
5 నయాపైసాలు	1 అణా
10 నయాపైసాలు	బేడ–రెండు అణాలు
నయా పైసా నాణెములు ………………………	
25 నయాపైసాలు	4 అణాలు
50 నయాపైసాలు	8 అణాలు
100 నయాపైసాలు ఒక రూపాయి	16 అణాలు– ఒక రూపాయి–

25, 50, 100 నయా పైసా నాణెములకు సరిగా సమానమైన నాణెములు ప్రస్తుతం చెలామణిలోఉన్నాయి. 25 నయాపైసాల నాణెం పావలా నాణెమునకూ 50 నయా పైసాల నాణెం అర్ధ రూపాయి నాణెమునకూ, 100 నయా పైసాల నాణెం ఒక రూపాయి - ఇప్పటి ఒక రూపాయి నాణెమునకూ సమానం.

1, 2, 5, 10 నయా పైసాల నాణెములకు మాత్రం సరిగా సమానమైన నాణెములు ప్రస్తుతం లేవు. అయితే యీ నాణెములు ఒక కానీ, అర్ధణా, అణా, బేడ నాణెముల స్థానంలో ప్రవేశ పెట్టబడతాయి.

1957 ఏప్రిల్ ఒకటవ తేదీన కొత్తనాణెములన్నిటినీ ప్రవేశ పెట్టరు. 1, 2, 5, 10 నయా పైసాలు మాత్రమే చెలామణిలోకి వస్తాయి. తక్కిన నాణెములు అంటే 25, 50 నయాపైసాల నాణెములూ, కొత్త రూపాయి–నూఱు నయాపైసాల నాణెమూ ఆ తరువాత ప్రవేశ పెట్టబడతాయి.

కొత్త నాణెములు చెలామణిలోకి వస్తున్న కొద్దీ పాత నాణెములను ఉపసంహరించడం జరుగుతుంది. మూడేళ్ళ కాలంలో కొత్త నాణెములను ప్రవేశ పెడుతూ, పాత నాణెములనూ పూర్తిగా ఉపసంహరించే కార్యక్రమం సంపూర్ణంకాగలదని అంచనా వేయబడింది. ఈ మూడేళ్ళ కాలంలోనూ నాణెములమారకం రేట్ల ననుసరించి తెలుసుకోవడం అవసర మవుతుంది.

నాణెముల గణితం :

నాణెముల మారకం రేట్లను గురించి పూర్తిగా ప్రజలకు తెలియచెప్పేందుకు గాను భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ నాణెముల గణిత దర్పణాలను రెండింటిని తయారు చేసింది. డబ్బుతో వ్యాపారం జరిగే అన్ని ప్రముఖ కేంద్రాలకూ యీ గణిత దర్పణాలు లభ్యం చేయబడతాయి. రూపాయి వరకూ గల నాణెముల మారకం రేట్లను యీ గణిత దర్పణాల వల్ల తెలుసుకోవచ్చును. రూపాయకు పై విలువగల కరెన్సీ నోట్లు యథాతథంగానే ఉంటాయి గనుక వాటి విషయంలో మారకం నిష్పత్తిని గురించిన ప్రసక్తేరాదు.

ఇందుతో జతపరచబడిన నాణెముల గణిత దర్పణం నెం. 2 పైస నుంచి రూపాయి వరకూ గల అన్ని నాణెముల మారకంవిలువనూ తెలియజేస్తూంది. 1957 ఏప్రిల్ 1. వ తేదినాటి కాతా మొత్తాలను కొత్త పద్ధతిలోకి మార్చడానికి ఇది ప్రధానంగాఉపకరిస్తుంది. ప్రజల దైనందిన క్రయ, విక్రయ వ్యవహారాల్లో నాణెముల గణిత

దర్పణం (నెం. 2) ఉపయోగిస్తుంది. దీని పేరే సులభ గణిత దర్పణం.

సులభ గణిత దర్పణం :

సులభ గణిత దర్పణం అణా కానులకూ, నయా పైసలకూ గల మారకం నిష్పత్తిని సూచిస్తుంది. సాధారణంగా దైనందిన క్రయ, విక్రయ వ్యాపారాలలో పైసలు ఉపయోగించ బడనందున యీ గణితదర్పణంలో పైసల మారకం నిష్పత్తి వివరాలు పొందుపరచబడలేదు. క్రింది ఉదాహరణను బట్టి సులభ గణిత దర్పణం నెం 2 ను ఉపయోగించే విధానం బోధకమవుతుంది.

5 అణాల 6 పైసలు ఎన్ని నయా పైసాలకు సమానమో తెలుసు కోవాలనుకోండి. సులభ గణిత దర్పణం నెం 2 లో అణాల వరుసలో అయిదూ, పైసల వరసలో ఆరు కలసేచోట ఎంత అంకె ఉంటే అన్ని నయా పైసలకు సమానం. ఆ రెండూకలసేచోట 34 నయా పైసలు కాబట్టి అయిదు అణాల ఆరుపైసలకు 34 నయా పైసా లన్న మాట. చూడుడు సులభ గణిత దర్పణం నెం 2-

వ్యాపారంలో నాణెములు ఇచ్చేటప్పుడే ఆయా నాణెముల మారకం నిష్పత్తిని తెలిపే యీ పట్టికను ఉపయోగించాలి. తదితర సందర్భాలలో మొత్తం మీద ఎంత యివ్వాలో తెలుసుకోవలసి వచ్చినప్పుడు ఆ మొత్తాన్ని రూపాయి అణా పైసలలో గుణించి అప్పుడు దానిని నయా పైసాలలోకి మార్చవలసి వుంది.

ఒక ఉదాహరణ చూడండి :

ఒక పెన్సిలు ధర అణన్నర చొప్పున ఒకరు 12 పెన్సిళ్ళు కొన్నారనుకోండి. అంగడివానికి తానీయవలసిన మొత్తాన్ని నయాపైసాలలో ఆయన ఇచ్చేటప్పుడు ఆయన యీయ వలసిన మొత్తాన్ని నయా పైసాలలోకి యీ విధంగా మార్చాలి.

ఒక పెన్సిలు ఖరీదు = $1\text{-}\frac{1}{2}$ లేక $\frac{3}{2}$

ఇప్పటి నాణెములలో 12 పెన్సిళ్ళ ఖరీదున $12 \times \frac{3}{2}$ 18 అణాలు.

అంటే ఒక రూపాయి రెండణాలు. రూపాయిని మార్చ నక్కరలేదు. ఇంక 2 అణాలకు ఎన్ని నయా పైసాలో చూడవలసి ఉంది. సులభ గణిత దర్పణం నెం. 2 లో అణాల వరుసలో 2 కెదురుగానూ, పైసల వరసలో 0 కు క్రిందుగానూ 12 ఉంది. అంటే రెండు అణాలకు 12 నయా పైసాలని తెలిసింది. అందుచేత కొత్తనాణెములలో 12 పెన్సిళ్ళ ధర ఒక రూపాయి 12 నయా పైసాలు.

గణిత దర్పణం నెం. 1. :

కాతా మొత్తాలను కొత్త పద్ధతిలోకి మార్చడానికే గణితదర్పణం నెం 1 ప్రధానంగా ఉద్దేశించబడింది. దీనిని ఉపయోగించడంలో కొన్ని సందర్భాలలో కొన్ని చిక్కులేర్పడవచ్చు. ఉదాహరణ చూడండి. 3 పాత పైసాలకు 2 నయాపైసాలు. అలాగే 4 పాత పైసలకు కూడా 2 నయాపైసాలే, చూడండి గణిత దర్పణం నెం. 1 డబ్బు చెల్లించేవాడు 2 నయాపైసాలు ఇవ్వవలసి వస్తే ఆయన 3 పాత పైసలను ఇస్తేనే సరిపోతుంది. 4 పాత పైసలను నివ్వనక్కరలేదు. ఎందువల్లనంటే 1955 భారత దేశపు నాణెముల సవరణ చట్టం 14-2-విభాగంలో పొందుపరచబడిన రమారమి లెక్కల ప్రకారం 3 పాత పైసలు 2 నయాపైసలకు సమానం.

ఇందువల్ల మొదట్లో కొంతనష్టం కలగవచ్చు. కొత్త నాణెములు చెలామణిలోకి వస్తున్న కొద్దీ యీ నష్టం క్రమేణా తగ్గిపోతుంది. పెద్దపెద్ద మొత్తాలు ఇచ్చినప్పుడు కూడా యీ నష్టశాతం తగ్గిపోతుంది. ఏమైనా నష్టం ఎంత అయినప్పటికీ, ఒకరికి నష్టమయితే, మరొకరికి లాభం వస్తుంది. పాత కొత్త నాణెములు చెలామణిలో ఉండే నడమంతర కాలం పూర్తి అయిన తరువాత, యింక యిలాంటి సమస్యలే ఉద్భవించవు.

గమనిక : ఇందుతో రెండు గణిత దర్పణములు కూడా జతపరచ బడినవి.

సులభ గణిత దర్పణం

అణా పైసలకూ, నయా పైసలకు మారకం నిష్పత్తి

అణాలు	పైసలు 0	3	6	9
0		2	3	5
1	6	8	9	11
2	12	14	16	17
3	19	20	22	23
4	25	27	28	30
5	31	33	34	36
6	37	39	41	42
7	44	45	47	48
8	50	52	53	55
9	56	58	59	61
10	62	64	66	67
11	69	70	72	73
12	75	77	78	80
13	81	83	84	86
14	87	89	91	92
15	94	95	97	98
16	100			

వచ్చే మాసములో దశాంశ పద్ధతి—కొలతలు తూనికల విషయము తెలియ పరచగలము. సం॥

సూక్ష్మంలో మోక్షం అద్దకములు

కుమారి. గిడుగు భారతి

సూక్ష్మంలో మోక్షం అనగా తక్కువలో ఎక్కువ ఫలము పొందటం. సామాన్యులు ఆశించేది తిండి, బట్ట. ఆరెండు సమకూరిన యింక లోటేలేదు. ఆ ప్రజలకు, ఆ దేశానికి. ఒక దేశముఔన్నత్యముతోను సిరిసంపదలతోను వర్ధిల్లాలంటే ఆ దేశముయొక్క సంఘ జీవనము. కళలు పరిశ్రమలు సాంస్కృతికముగా అభివృద్ధిచెందాలి. అనాది నుండి భారతదేశ పరిశ్రమలలో ఎక్కువ విశిష్టతను ప్రత్యేకతను పేరొందిన ఆనాటి 'డక్కాన్ మజ్లిన్లు' ఈ నాటి యంత్రాలు కూడా తయారు చేయలేవు.

పరిశ్రమలలో కెల్ల చేనేత పరిశ్రమ దాని ననుసరించి రంగువేయుట. చిత్ర విచిత్ర వర్ణములతో అలంకరణీయ మగు డిజైన్లును. చక్కగా నేర్పుతోను, వస్త్రములమీద తయారు చేయబడు చుండెడివి. ఆనాటి అద్దకపు సరకులు విరివిగా విదేశాలలో వాడబడుటచే ఎగుమతులు సాగు చుండెడివి. పర్షియా, జావా, చైనా, టర్కీ దేశములు మన అద్దకాలనే వాడుక చేయుచుండెడివారు.

ఈ అద్దకపు పనిని స్త్రీలే చేయుటకలరు. ఎందువలె నంటే వారు మిగుల నేర్పును, ఓర్పునువహించి చేస్తారు

పూర్వపు అద్దకాలకి, ప్రస్తుతపు అద్దకాలకి, పూర్వము వాడుకచేయు రంగులకి ప్రస్తుతమువాడుకచేయు రంగులకి చాలా తేడా వుంది.

పూర్వపు పద్ధతి అద్దకాలు : పర్షియా కలంకారీ, నీలి కలంకారీ, మామూలు కలంకారీ, మత సాంప్రదాయము లకు పనికివచ్చు కలంకారీ, పర్షియా కలంకారీ : ఈరకపు కలంకారీ పర్షియా దేశవాసుల అభిరుచులను బట్టి చేయ బడు చుండెడివి. యిప్పటిలో ఆ దేశములో అంతగావాడ నందున యివి యిప్పుడు తయారు చేయుటలేదు.

నీలికలంకారీ : ఈరకపు కలంకారీ అద్దకముల వలన దుప్పట్లు, కర్టన్లు, టేబుల్‌క్లాత్స్, మూల్తానా చీరెలు తయారు చేయవచ్చును. ప్రభుత్వపు భవనములలో. సభ లలో ఈ రకపు అద్దకములు గల వస్త్రములనే వాడిన యెడల కొన్ని వేలమందికి జీవనోపాధి కలుగుతుంది.

మామూలు కలంకారీ : ఈ రకపు దానితో తోపు చీరెలు, దుప్పట్లు చెంగావి చీరెలు. బాల బూటా చీరెలు. తయారు చేయవచ్చును. వీటిని ఆంధ్ర మదరాసు రాష్ట్ర ములలో ఎక్కువగా వాడుక చేస్తారు. వీటిని ప్రత్యేకంగా పూజామందిరాలలో వాడుక చేస్తారు.

రథోత్సవములలో రథములకికూడ ఈరకపు అద్దకపు వస్త్రాలనే వాడుక చేస్తారు.

పూర్వము వాడుకచేయు రంగుమూలికలు : చిరువేరు చిరంజిచెక్క, పటిక్కారం, కరక్కాయి, నీలిమందు. కరక్కాయపువ్వు, మద్దిచెక్క, మంజిష్ట మోదుగపువ్వు, పరంగిచెక్క, తంగేడు గింజలు, పిస్తాపప్పు. జముడు కాడలు, కుసుంబాపువ్వు. కపిల, జాబరం పువ్వులు, చెం దనపుచెక్క, రేవల చిన్ని, అన్నభేది.

మద్దిప తంగిపళ్లలతో — ఎరుపురంగు
కుసుంబా పువ్వులతో — గులాబిరంగు
మోదుగ పువ్వుతో — పసుపురంగు

కపిల లేక పున్నాగ పండ్ల పై పొడివల్ల నారింజ రంగు ఈ చందనపు చెక్క లేక రక్త చందనము వల్ల ఎరుపురంగును వేయవచ్చును.

అన్నిటికంటే స్త్రీలు విరామకాలములలో, ఎంతోసునా యాసంగా, అతి స్వల్పఖర్చుతో ఈ అద్దకాలని వేసుకో వచ్చును. ఈ అద్దకాలలో ఆరు పద్ధతులున్నాయి.

1. బ్లాకు ప్రింటింగ్.
2. బ్రష్ ప్రింటింగ్.
3. బాటిక్ పద్ధతి.
4. మైకా ప్రింటింగ్.
5. స్క్రీన్ ప్రింటింగ్
6. మిషన్ ప్రింటింగ్.

యిందులో మూడు పద్ధతులు స్త్రీలు తమ గృహాల్లో చేసుకోవచ్చును.

బ్లాక్ ప్రింటింగ్ చేసే విధానం గురించి ముందు తెలుసుకుందాం. దీనికి మనకు కావలసిన పరికరములు కొంతగా అవసరం అవుతాయి. 2 గ॥ పొడవు 2 అడు గుల వెడల్పు $1\frac{1}{2}$ అడుగు ఎత్తుగల సమమైన బల్ల, బల్ల

మీద పరచు కంబళీ, తెల్లనివస్త్రము. దీనికోసం సుమారు 30 రూ ఖర్చు చేయవలసి వుంటుంది. తర్వాత 1 అ॥ పొడవు 9. అం॥ వెడల్పు. 4 అం॥ లోతుగల రంగు తొట్టె దానిలో వెదురు పేళ్ళ ఫ్రేము అవసరం అవుతాయి.

' ముఖ్యంగా బ్లాకులు. యివి డిజైన్లను బట్టి ఒకొక్క డిజైనుకు మూడులేక నాలుగు రంగులు కలదైనట్లయితే 4 బ్లాకులు అవసరం. అంచులకు చీరె మధ్యభాగానికి డిజైన్లు చెక్కిన బ్లాకులు అవసరం అవుతాయి. రెండు డిజైన్లు బాడీకి (Body) కి రెండు డిజైన్లు మూలలవేయ డానికి తీసుకుంటే ఈ పనిని ఎంతో సులువుగా ఆరంభించవచ్చును. ఈ బ్లాకుల కోసం సుమారు 50 రూ వెచ్చించి నట్లయితే బ్లాకులు దొరుకుతాయి.

ఒక చీరెకు ఎరుపురంగు వేయాలంటే : ఎరుపురంగు 4 భాగాలు అందులో టర్కీరెడ్ఆయిల్ 1 భాగం కాస్టిక్ సోడా 1½ భాగం జిగురు 50 భాగాలు వీటి నన్నిటిని ముద్దగాచేసి మనం అద్దకము చేయవలసిన చీరెను, మెత్తని కుషన్ అమర్చిన బల్లమీద పరచి వెదురు పేళ్ళ ఫ్రేము పెట్టిన రంగు తొట్టెమీద రంగును బాగా కలిపి పొయ్యాలి. అప్పుడు మనకి కావలసి బ్లాకును అడుగుతొట్టె మీద అద్దిన బ్లాకునకు రంగు అంటుకున్న తర్వాత చీరె మీద బ్లాకు పెట్టి ఒకదెబ్బ కొట్టినట్లయితే ఆ డిజైను చీరె మీద పడుతుంది ఈ విధంగా చీరె నంతటిని (Guide points) ప్రింటుచేసి 24గం॥ వ్యవధినిచ్చిన తర్వాత ఒక బక్కెటు నీటిలో కొంచెం గంధకామ్లమును (Sulphuric Acid) వేసి కలిపి, అద్దకము చేసిన చీరెను అందులో తడిపినట్లయితే ఆ ప్రింటు ఎంతో బాగా కనపడుతుంది అప్పుడు ఆద్రావకము యొక్క వాసన లేకుండా సబ్బు నీళ్ళలో దానినితడిపి పని చెయ్యాలి. లేక పోతే బట్ట ముక్కలు ముక్కలుగా చిరిగి పోతుంది. ఈ విధంగా ఈ అద్దకాన్ని స్త్రీలు తమ గృహాల్లో తమ గృహపు పనులలాగే చేసుకోవచ్చును.

ఈ ప్రింటింగే కాకుండా బాటిక్ పద్ధతి. ఈ పద్ధతిలో మైనము కరగబెట్టి, తెల్లని చుక్కలు, లేక తెల్లని డిజైన్లు రంగు వస్త్రముమీద వేయుటకు చాలావీలుగాను, సులువుగాను, వుంటుంది. దీనికిఎక్కువగా ఖర్చుపెట్టనవసరము లేదు, మైనము లేక క్రొవ్వువత్తిని కరగబెట్టివస్త్రము మీద డిజైను భాగములో మైనమువేసి తరువాత రంగువేసినట్ల యితే మైనమున్న భాగము తెల్లనిడిజైను మిగతాభాగము రంగు ఏర్పడుతుంది. మిగతా రంగులు పూర్తిగ ఆ డిజైనులో పూర్తిచేయ వచ్చును.

ఒక చీరెకు మూడు రంగులు వేయాలంటే —.

అనిలన్ సాల్టు 4 భాగాలు

పొటాషియంక్లోరేటు 2 భాగాలు

మైలు తుత్తము 1 భాగము

జిగురు 50 భాగాలు

కలిపి మొదటి బ్లాకుతో అద్దకముచేసి దీనిని ఎండలో పెట్టిన నలుపు రంగుగా మారుతుంది.

మిగతా రంగులకు అనగా ఎరుపు పసుపు రంగులకు రేపిడ్ ఫాస్టు (Rapid fast) రంగులు 4 భాగాలు టర్కీ రెడ్ ఆయిల్ 1 భాగం జిగురు 50 భాగాలు పై రంగులను విడివిడిగా కలిపి విడివిడి బ్లాకులతో అద్దకము చేసి ఆరినతర్వాత ద్రావకపు నీటిలో పనిచేసిన ఎరుపు పసుపు రంగులు బాగా కనబడతాయి. తర్వాత సబ్బు నీటిలో పని చేసినట్లయితే అ రంగులు ఎప్పటికి పోకుండావుంటాయి

పై రంగులే కాకుండా నీలము ఆకుపచ్చ రంగులను వేయడానికి యిండిగోసోల్సు రంగులను వుపయోగించాలి

యిండిగో సోల్సు 4 భాగాలు.

గ్లెడోటు బి. 1 భాగము

సోడియం నైట్రేటు 1 భాగము

జిగురు 50 భాగాలు

కలిపి అద్దకముచేసి ద్రావకపు నీటిలో పనిచెయ్యాలి. అప్పుడు చీరెమీద ఆకుపచ్చ పసుపు రంగులు ఎంతో బాగా ఆకర్షణీయంగా కనబడతాయి.

ఈ అద్దకం చేయడంలోనే మరొకటి. స్త్రీలు అతి సులువుగా చేసుకోవచ్చును. అది బ్రష్ ప్రింటింగ్ (Brush printing) దీనికి ఒకటూత్ బ్రష్, దువ్వెన. బ్లాకు ప్రింటింగ్‌నకు కలిపినట్లే పల్చగా కలిపి రంగును వెడల్పయిన పళ్ళెము వంటి సాసర్‌లో పోసుకుని, ఆ రంగులో బ్రష్‌నుముంచి దువ్వెన సహాయముతో ముందు నుంచి వెనుకకు తట్టినట్లయితే చిన్నచిన్న చుక్కలుగా పరచిన వస్త్రముమీదపడతాయి. కాగితముతో కత్తిరించిన బొమ్మలు, లతలు మొ॥ డిజైనులు బట్టమీద అంటించి

బ్రష్‌తో ప్రింటుచేసిన ఆపనితనము చాలా బాగుంటుంది. దీనికి ప్రత్యేకముగా ఖర్చులేమి అవసరంలేదు.

మైకాప్రింటింగ్ : ఈ పనికూడా స్త్రీలకు ఎంతోవుత్సాహకరంగా వుంటుంది ఈ రకపు పద్ధతి ముదరరంగులు వేసిన వస్త్రములందు చిన్నచిన్న చదరపు పెట్టెవలెనుండి బ్లాకులు. ఆ బ్లాకుల అడుగు భాగమున చిత్రములు కోసిన రేకు, దానికి అతికించి వుంటుంది. దానిలో తెల్లని సీసపు పౌడరుగానీ, రోజను సహాయముతో ముద్దగాచేసి ఆ చిన్న బ్లాకులో వుంచి, పైనుంచి ఒకపలకగల, సరియైన కర్రచే పేస్టును బట్టమీద అద్దుచుపోవలెను.

ఆ అద్దిన ప్రింటు భాగము మీద మెత్తని గోల్డు పవుడరు గానీ, సిల్వర్ పవుడరుగానీ జల్లి, బ్రష్‌తో ఎక్కువగావున్నదితీసి, దానిమీద మెత్తని మైకాపవుడరును జల్లాలి తర్వాత అ బట్టని తడపకుండా గాలిలోఆరబెట్టి అద్దకము చేసిన భాగం కాకుండా, రెండోవైపు యిస్త్రీ చెయ్యాలి. అప్పుడు ఆ ప్రింటు నిగ నిగ లాడుతూ ఖరీదయిన బట్ట వలె కనిపిస్తుంది. దీనినే మైకా ప్రింటింగు లేక గోల్డు ప్రింటింగ్ అని అంటారు.

మిగతా స్క్రీన్‌ప్రింటింగ్‌లు మిషన్‌ప్రింటింగు చేయడానికి స్త్రీలకు ఏమాత్రము వుపకరించబడవు. ఎందు వల్లనంటే వీటికి ఎక్కువ ధనాన్ని ఖర్చుపెట్టి ఒక వ్యాపార వృత్తిగా పనిచేయవలసి వస్తుంది. అయితే రోజుకి కొన్ని వందలగజములబట్టని ప్రింటింగ్ చేయవచ్చును.

మనం అద్దకం చేయడానికి ముందు వస్త్రమును తయారు చేయు పాతపద్ధతి ఏదంటే, ముందు వస్త్రమును వుడకబెట్టి పిండి తీస్తారు. తర్వాత బియ్యపు గంజిలో కొంచెము వెదురు ఆకులువేసి, కాగేనీటిలో, బట్టనుముంచి తీస్తారు. ఆ తర్వాత నూనె, నీరు కలిపిన తొట్టెలో వుతికి ఆరబెడతారు. ఈ విధంగా రెండు మూడు వారాలు కూడా చేయడం అలవాటు.

అప్పుడు కొంచెం గంజిలో పటిక కలిపి వస్త్రమును ముంచితీస్తే మైనం పెట్టడం సులువుగా వుంటుంది.

ఈ మాదిరిగా తయారయిన బట్టను కర్ర సుత్తితో నలగగొట్టి మెత్తగా తయారు చేస్తారు. యిలా తయారు చేయడం మనదేశంలో లేదు. దీనికి మారుగా మేక ఎరువు, సున్నం కలిపిన నీటిలో నాల్గు రోజులు యిట్లు చేసిన తర్వాత కరక్కాయ చూర్ణం, గేదెపాలు, నీరు కలిపి కాచిన నీటిలో బట్టను వుతికి తీస్తారు. అప్పుడేలేత పసుపు రంగుగా తయారవుతుంది.

ఆ తర్వాత బట్టమీదప్రింటు చేసినట్లయితే ఆరంగులు పోకుండా వుంటాయి. ఈ అద్దకాలు. నూలు. వున్ని. సిల్కు, లినెన్ చీరెలమీద ప్రింటుచేసిన ఆ రకపు చీరెలు చెలామణీ అవుతాయి

కళలలో ఒకటై. చిత్రలేఖనముతో కూడిన ఈ అద్దకపు పరిశ్రమ స్త్రీలకు ఎంతేని. వుపకరించి వారి జీవనోపాధికి సహాయ పడుననుటకు సంశయములేదు.

గ్రామాలలో గల స్త్రీలు అక్కడి పూర్వపు పని, వారు మరల ఈ వృత్తిని అనుసరించి, తమ చిత్రకళానుభవమును. ఈ అద్దకములలో చొప్పించి, మేలు రకపు సరకులు, విదేశములలో చెలామణియైన అనేక మందికి జీవనోపాధి అవుతుంది.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)





స్వర్గీయ దేశిరాజు అలివేలు మంగతాయారమ్మగారు

ఆ. భాస్కరమ్మ

ఈమె సానబట్టని రత్నము, నివురు గప్పిన నిప్పు, నిరాడంబర జీవి, సేవాపరాయణి, భక్తిపరురాలు.

దావలూరి ఉమామహేశ్వర రావుగారి రెండవ కొమార్తె. చిన్న తనములోనే మంచి పేరు ప్రఖ్యాతులు గడించి అకాల మృత్యువువాతఁబడిన దేశిరాజు పెదబాపయ్యగారి భార్య. ఈమె 1892వ సంవత్సరములో జన్మించినది. 10 నెలల పసిబిడ్డగా నున్నప్పుడే తల్లిని గోల్పోయినది తల్లిలేకపోయినను అమ్మమ్మ గారియొక్క ఆదరణతో గూడిన పెంపకములోను, తరువాత వచ్చిన సవతితల్లి, అందరు సవతి తల్లులవలే సవతితల్లి ప్రేమ చూపకుండా తనబిడ్డల వలెనే ప్రేమతో చూచు చుండుటచేతను, అతి ప్రేమాస్పదులగు అన్నదమ్ములు, అక్కసెల్లెండ్ర మధ్యను ఆమె బాల్యదశ ఆనందకరముగా బాగానే జరిగిపోయింది.

1902వ సంవత్సరములో తనకు 10వయేట బాపయ్యగారితో కాకినాడలో అతివైభవముగా వివాహము జరిగినది ఈ బాపయ్యగారు శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారికి ప్రియశిష్యుఁడు. చిన్నతనము నుండియు ఉదార స్వభావము, ఉన్నతాశయములు గలవారు. సంఘసేవా పరాయణులు. తన కుటుంబమును, తన యత్తవారికుటుంబమును ఆదర్శ కుటుంబములుగా నుండునట్లు చేయవలయునని ఆయన యాశయము

వివాహము నాటికి ఆయన వయస్సు 20 సంవత్సరములు. బి.ఎ పరీక్షలో ఉత్తీర్ణులయి యుండిరి అతిబాల్యవివాహము లాయన కిష్టము లేకపోయినను తన భార్యను ఉన్నత విద్యావంతు రాలుగను, ఆదర్శ విదుషీ మణిగను, సంఘ సేవా పరాయణిగను, తీర్చి దిద్దవలె ననెడి యభిలాషతో 10 సంవత్సరముల బాలిక యైన తాయారమ్మగారిని పరిణయమయి అప్పటినుండియు ఆమెకు విద్య గరపనారంభించెను. తనభార్య యొక్క విద్యా విషయములో అమిత శ్రద్ధ వహించేవారు. ఆ రోజులలో అనగా ఒక యర్ధశతాబ్దము క్రిందట శ్రీ వీరేశలింగం పంతులుగారి వలెనే వీరు కూడా ఒక సాంఘిక విప్లవ వీరుఁడని చెప్పవచ్చు. భార్య పెద్దదయి భర్తతో కాపురము చేయుచున్నను, ఇద్దరు ముగ్గురు బిడ్డల తల్లియైనను పగలు భర్తతో మాట్లాడితే యెంతో తప్పుగానెంచి యాక్షేపించే రోజులవి. అట్టి రోజులలో పెండ్లియొక్క యుద్దేశము ప్రకారము పెండ్లి యింకను పూర్తికాలేదు. తన యింటికి కాపురమునకు రాలేదు. అట్టి బాల భార్యకు భర్త స్వయంగా విద్య గరపటం, తనతో కూడా ప్రతిదినము షికారు తీసుకొని వెళ్లి ప్రకృతిలోని అనేక విషయములను గురించి యామెకు బోధిస్తూ ఉండడం రాజమహేంద్రవరములోని ప్రజలకు చాలా వింతగా కనపడేది. చాలాఆశ్చర్యముగాను, ఆక్షేపణగాను చెప్పుకొంటూ ఉండేవారు. ఇంతేకాదు ఆయన చేసిన వింత కార్యాలు. ఆయన బ్రహ్మ మతాభిమాని యగుటచేత ఆమతము నవలంబించెను. వర్ణభేదమును పాటించకుండా అందరితో కలిసి భుజించు చుండెను, అందువలన సంఘ బహిష్కరణకు కూడా పాలుగావలసి వచ్చెను. అయినను వీటిని వేటినీ లెక్కసేయక తన ఉన్నతాశయాలు, విశాల భావాలతో తానొక ఆదర్శ పురుషుఁడుగా, తన భార్య యొక ఆదర్శ స్త్రీగా నుండవలయుననెడి గొప్ప సంకల్పముగల ఈ కార్యశూరుఁడు, సంఘమునుండి వచ్చే ఆక్షేపణలకు, ఆటంకములకు, బహిష్కారములకు వెరువని యీ విప్లవ వీరుఁడు తన అనురాగమున కాస్పదురాలైనభార్య తన నింకనూ చేరకముందే, తనకు 26 సంవత్సరములైనను నిండక పూర్వమే

15 సంవత్సరముల నవ యౌవన ప్రాయములో నున్న భార్యను వీడి స్వర్గమునకేగెను.

అట్టి ఆదర్శ పురుషుని, అనురాగ పూరితుడైన భర్తను గోల్పోయిన ఆబాలికయొక్క జీవితమెంత దుర్భరమైనదో అనుభవజ్ఞులకేకాని యితరులూహించుటకు శక్యముకాదు. బాపయ్యగారు చనిపోవు ముందర భార్యను పిలిచి మన మిరువురము ఊరక స్నేహితులవలే నుంటిమేగాని మన వివాహము పూర్తికాలేదు. మన మింకను భార్యాభర్తలము కాలేదు. పెండ్లియొక్క యుద్దేశము నెరవేరలేదు. నీవింక నూ కన్యవే. నీ జీవితమును పాడు చేసికోక, దుఃఖముల పాలుగాక తగిన వరుని జూచుకొని తిరిగి వివాహము చేసికోమని చెప్పారు.


"మందార మకరంద మాధుర్యమును గ్రోలుమధు పంబు బోవునే మదనములకు" అన్నట్లు అట్టి ఉత్తమోత్తమ పురుషునకు భార్యయైన బాలిక మరియొక సామాన్య పురుషుని చేపట్టి కష్టములను కొని తెచ్చుకుంటుందా ? ఒక వేళ భర్తయొక్క ఉద్దేశము ప్రకారము ఆయన కోరినట్లు చేయుద మన్ననూ ఆమె యెంత యోగ్యురాలైనా, ఎట్టి యున్నతాశయములు గలదైనా, ఎంత విద్యావతియైనా వివాహము పూర్తిగా జరుగక పోయినా ఆమె వితంతువే. ఆమెను ఎవరు చేసికొంటారు ? సంఘం వప్పుకొంటుందా?

ప్రేమాస్పదుఁడైన భర్త గతించినా కడుపులో పెట్టుకొని యాదరించే తల్లియైనా ఉంటే జీవిత మొక మాదిరిగా గడిచేది. తల్లి పసితనములోనే ఈమెను విడిచి పరలోక గతురాలైంది. మధురస్మృతులకు, అంతములేనికోరికలకు ఆలవాలమైన నవ యౌవన ప్రారంభములోనే అనేక ఆశయములు, ఆశలు కలిగించి అరచేతిలో స్వర్గమును చూపించిన ఆత్మీయుఁడగు భర్త తనను విడనాడి స్వర్గమున కేగెను. అడుగులోనే హంసపాద మన్నట్లు ఇక మన మంగ తాయారమ్మ గారికి సౌఖ్య ప్రదము, ఆనంద దాయకమునగు జీవిత యాత్రకు ప్రారంభములోనే తలవని తలంపుగా అంతరాయ మేర్పడినది. ఇక యీ మార్గ మింతటితో సరి. ఈజీవిత యాత్రకు మరియొక దారి యేదయినా యున్నదా ? భర్తయొక్క కోరిక ప్రకారము ఉన్నత విద్యావతియై ఆదర్శ ప్రాయమగు జీవితమును గడుపుతూ సంఘసేవ చేయుదమన్న అందు కంగీకరించే కుటుంబము కాదు వారిది పూర్వాచార పరాయణులు, ఛాందసులు నగు పెద్దలతో కూడిన కుటుంబము. భర్తయొక్క యాశయములలో దేనిని నెరవేర్చెదమన్నా నిస్సహాయురాలగు ఆమెకు సాధ్యము కాదు. ఇక యేమి చేయఁగలదా బాలిక ? తన పెద్దలయొక్క యిష్టానుసారము సంస్కృతము, తెలుఁగు భాషలలో మంచి ప్రావీణ్యమును సంపాదించి, భారత భాగవతాది పురాణములు, భగవద్గీత మొదలగు యుద్గ్రంథములను పఠించుతూ, ప్రతినిత్యము విష్ణుసహస్రనామములను పారాయణచేస్తో భక్తి తత్పరురాలై తండ్రిగారి యింటనేఉండి 40 సంవత్సరములవరకు కాలమును గడిపిరి.

ఈమె సంఘసేవ బయటికంతగా రాకున్నను బంధు వర్గములో ఎవరికే యవసరము వచ్చినను అతి ఆప్యాయముగా వెళ్లి ఆదుకొనేవారు. శుభ కార్యములలో, పెండ్లిండ్లలో ఆమె లేక పోతే శోభయే ఉండేది కాదు. ప్రతివారిని యెంతో ఆదరణతో ప్రేమతో పలకరించేవారు. ఇతరుల కెవరికైనా చీమామాత్రము బాధకలిగినా సహించలేని జాలిగుండె ఆమెది. ఆమె యొద్దకు వచ్చి తేలు మంత్రము, బెణుకు మంత్రము వేయించు కొననివారు లేరు.

ఈవిధముగా తన శక్తికొలది యితరులకు సహాయము చేస్తూ, సదా దైవచింతన తప్ప వేరు ధ్యానము లేకుండా అతి పవిత్రమైనట్టియు సేవాతత్పరమైనట్టియు జీవితమును గడుపుచుండిరి. ఇట్లుండ 1910వ సంవత్సరములో ఈమె అక్కగారైన శ్రీమతి మహాలక్ష్మమ్మ గారికి గూడ భర్తృవియోగము సంభవించినది. ఒకర్తికి యిరువురు తోడగుటచే కలిగిన దుఃఖోపశాంతికొరకు ఇరువురు కలసి బదరి కాశ్రమము మొదలు కన్యాకుమారి వరకుఁగల పుణ్య క్షేత్రముల నన్నిటినీ దర్శించిరి. కుటుంబములోని పదిమందిలో నున్న యెడల మనశ్శాంతి, స్థిరత కుదురుట కష్టమని అక్కచెల్లెండ్రిరువురు కలసి యొక చక్కని గృహమును నిర్మించు కొనిరి. అందు నివసిస్తూ పూజలు పునస్కారములు, దాన ధర్మములతోను, సద్గ్రంథ పఠనములతోను సత్కాల క్షేపము చేస్తూ 64 సంవత్సరములు జీవించి 1956 మే నెల 7వ తేదీని జీవిత యాత్రను ముగించి గమ్య స్థానమును జేరుకొన్న ధన్యజీవి.

భగవంతుఁడు ఈమె యాత్మకు శాంతిని ప్రసాదించుగాక ! ఆమె అక్కగారైన మహాలక్ష్మమ్మ గారికిని, తక్కిన వారి యాత్మ బంధువులకును హృదయ పూర్వకమైన మాసాను భూతిని తెలుపు చున్నాము.



రాజకీయాలు

శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

జనరల్ ఎన్నికలు

దేశం మొత్తంమీద వచ్చే ఫిబ్రవరి మాసారంభంలో జరప నుద్దేశించిన ఎన్నికలకుగాను అన్ని రాష్ట్రాలలోను ఎన్నికల సన్నాహాలు రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో చురుకుగా జరిపించబడుతున్నాయి. ఒక్క ఆంధ్ర రాష్ట్రం మినహా అన్ని రాష్ట్రాలలోను జనరల్ ఎన్నికలు జరగ వలసివుంది. ఆంధ్ర రాష్ట్రంలో 1955 మార్చిలో జనరల్ ఎన్నికలు జరిగినవి. అక్టోబర్ 1 నాటికి ఆంధ్ర తెలంగాణా విలీనీకరణ ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్ నూతన రాష్ట్రావతరణతో కొత్త ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీకి ఫిబ్రవరిలో తెలంగాణా ప్రతినిధులను మాత్రమే ఎన్నుకోవలసివుంది. ఇండియా ఎలెక్షన్ కమిషనర్ అన్ని రాష్ట్రాలలోను ఈ సందర్భంలో పర్యటించి అక్కడి ప్రభుత్వాధికారులతో సంప్రతింపులు జరుపుతున్నారు.

హైదరాబాద్‌లో ప్రెసిడెంట్ ప్రసాద్

ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ జూన్ 23 న హైదరాబాద్‌కు స్పెషల్ రైలులో వెళ్ళారు. హైదరాబాద్ రాజప్రముఖ్, ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు స్వాగతమిచ్చారు. ముఖ్యంగా విశ్రాంతి తీసుకొనడం నిమిత్తమే హైదరాబాదు వెళ్ళిన రాష్ట్రపతి బోలారంలో 'రాష్ట్రపతి నిలయం'లో వున్నారు.

కొత్త నౌకావాణిజ్య సంస్థ

పాశ్చాత్య దేశాలతో వర్తక వ్యాపారాలను సాగించే నిమిత్తం ఇండియా ప్రభుత్వం పేరిట వెస్టర్న్ షిప్పింగ్ కార్పొరేషన్ అనే కొత్త నౌకావాణిజ్య సంస్థ. పదికోట్ల రూపాయల మూలధనంతో జూన్ 22 వ తేదీని బొంబాయిలో రిజిస్టర్ చెయ్యబడింది. ఇండియా, మలయా, ఆఫ్రికా, దూరప్రాచ్య దేశాలతో ప్రభుత్వం యింతకుముందు ఈస్టర్న్ షిప్పింగ్ కార్పొరేషన్ స్థాపించింది.

తాతా కంపెనీ విస్తరణ

జెమ్‌షెడ్‌పూర్‌లోని తాతా ఉక్కు కంపెనీవారి ఫ్యాక్టరీలలో ఉత్పత్తిని పదిలక్షల టన్నులనుంచి 20 లక్షల టన్నులవరకు హెచ్చించడానికి వీలుగా ప్రపంచం బ్యాంకి ఏడున్నరకోట్ల డాలర్లు అప్పుగా యివ్వడానికి సంబంధించిన ఒడంబడికపై జులై మొదటివారంలో సంతకాలు జరగగలవని ఆ కంపెనీ వైస్-చైర్మన్ శ్రీ జె. డి. చోక్సి జూన్ 24 వ తేదీని బొంబాయినుంచి ప్రకటన చేశారు.

ఏర్పాటు గొప్పదేకాని తవ్వెడుబియ్యం అణా అప్పు సాపాతగా పరిణమించకుండా వుండాలి.

నాగజాతి వారి దుండగాలు

నాగపర్వత ప్రాంతంలో నాగజాతి దుండగుల చర్యలు మితిమీరుతున్నవని, ఆ ప్రాంతంలో ముఖ్యపట్టణమైన కోహిమాలో తాత్కాలికంగా ముట్టడి పరిస్థితి ఏర్పడ్డదనీ తెలుస్తున్నది.

వెనక హైదరాబాద్‌లో రజాకార్లపై తీసుకొన్నట్టి 'పోలీసు యాక్షన్'తోగాని నాగపర్వత ప్రాంతంలోని కల్లోలపరిస్థితి చల్లబడి, చక్కబడేటట్లు తోచదు.

ప్రాజెక్టుల నిర్మాణానికి కార్పొరేషన్

దేశంలో ప్రాజెక్టుల నిర్మాణానికిగాను నేషనల్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ పేరిట రెండుకోట్ల రూపాయల పెట్టుబడితో ఒకసంస్థను నెలకొల్పడానికి ఇండియా ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి సంబంధించిన వివరాలను

కేంద్రంలోని ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖాధికారులు సిద్ధంచేస్తున్నారని తెలుస్తున్నది.

అభివృద్ధిసాధన కృషిలో మరొకమెట్టు ఎక్కుతున్నా మన్నమాట.

కొత్త రాష్ట్రాల అవతరణ

కొత్త రాష్ట్రాల అవతరణ నవంబర్ మొదటి తేదీనాటికి తథ్యమని ఇండియా హోం మంత్రి పండిట్ గోవింద వల్లభపంత్ జూన్ 25 న నైనిటాల్‌లో పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రకటించారు.

నాగార్జునసాగర్ శిక్షణ కేంద్రం

నాగార్జునసాగర్ వద్ద భూమి త్రవ్వకాలకు ఉపయోగించే భారీ యంత్రాల శిక్షణ కేంద్రానికి జూన్ 27 వ తేదీని ఇండియా ప్రభుత్వ ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ జైసుఖ్ లాల్ హాతీ ప్రారంభోత్సవం జరిపారు. ఈ ప్రారంభోత్సవ సమావేశానికి హైదరాబాద్ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు అధ్యక్షత వహించారు.

దేశంలో ప్రారంభించబడిన యిటువంటి శిక్షణ కేంద్రాలలో యిది రెండవది. మొదటిది గత నవంబర్‌లో కోటావద్ద చాంబల్ ప్రాజెక్టువద్ద స్థాపించబడ్డది. మరి రెండు శిక్షణ కేంద్రాల ఏర్పాటులకు ఇండియా ప్రభుత్వం యోచిస్తూవుంది. అమెరికా సాంకేతిక సహాయ సంస్థ సహకారంతో సాలీనా 40 మంది వంతున ఈ కేంద్రాలలో మెకానిక్కులకు, ఆపరేటర్లకు యిద్దరు అమెరికన్ నిపుణులు ఏడాదిపాటు శిక్షణ యిస్తారు.

బ్రహ్మాండమైన నదీలోయ ప్రాజెక్టుల నిర్మాణానికి ఇండియా ప్రభుత్వం పూనుకొన్న సందర్భంలో యిటువంటి శిక్షణ కేంద్రాల అవసరం ఎంతైనా కలదని శ్రీ హాతీ అన్నారు.

ఆంధ్ర పితామహునికి సన్మానం

ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ జూలై అయిదవ తేదీని హైదరాబాద్ మాజీ మేయర్ 'ఆంధ్ర పితామహ' శ్రీ మాడపాటి హనుమంతరావు గారికి లోగడ భారత ప్రభుత్వం బహూకరించిన 'పద్మభూషణ' పతకాన్ని అక్కడి రాష్ట్రపతి నిలయంలో జరిగిన విందు సందర్భంగా లాంఛనంగా అందజేశారు.

దేశంలో వరదల బీభత్సం

జూలై మొదటివారంలో సౌరాష్ట్రలో ధారాపాతంగా కురిసిన వర్షాల ఫలితంగా రైళ్ళ రాకపోకలు నిలిచిపోయినట్లు జూలై 5 వ తేదీని రాజ్‌కోటనుంచి వచ్చిన వార్తలు తెలుపుతున్నాయి. ఉప్లేటా, పోర్బందర్, మోర్వీ, జాంనగర్ ప్రాంతాలు జలమయమై లక్షలాది ప్రజలకు నిలవ నీడలేకుండాపోయింది.

ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఘజియాబాద్ సబ్ డివిజన్‌లోని 35 గ్రామాలు యమున ఉపనది హిండోన్ నది వరదలకు మునిగిపోయాయి.

ఇదే సమయంలో బీహార్‌లోని భాగ్‌మతి నది పొంగి 107 గ్రామాలు మునిగిపోయాయని, 11,000 యకరాలు పంట నష్టం కావడమేగాక అనేకచోట్ల యిళ్ళు కూలిపోయాయని పాట్నా వార్త.

బ్రహ్మపుత్రా నది వరదలవల్ల అస్సాంలోని గోల్‌పారా, గారోకొండాల జిల్లాలకు, కామరూప్ జిల్లాలోని ఏలాన్ బరీపట్టణానికి ప్రమాదం ఏర్పడ్డట్లు షిల్లాంగ్ వార్త.

ఈ ప్రకృతి విపర్యయాలు మానవుడు అధిగమించడానికి అతీతమైనవి. వాటికి తలవొగ్గడం తప్పితే చెయ్యదగినదేమీలేదు. బాధితులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పడడం ఒక్కటే మార్గం.

మహర్షి జన్మదినోత్సవం

మహర్షి బులుసు సాంబమూర్తిగారి 71 వ జన్మదినోత్సవం జులై ఆరవ తేదీని కాకినాడ టౌన్‌హాలులో మహా వైభవోపేతంగా జరపబడింది. ఈ జన్మదినోత్సవ సమావేశానికి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. ఆంధ్ర ప్లానింగ్ మంత్రి శ్రీ కళా వెంకటరావుగారు సాంబమూర్తిగారి చిత్రపటం ఆవిష్కరించారు. ఇండియా పార్లమెంటు స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగారు ఉపన్యసిస్తూ స్వార్థచింతలేని సేవాసక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి మూర్తీభవించినవని, ఆయనవంటి మహాపురుషులను తాము అరుదుగా చూడగలమని జోహారు లర్పించారు. శ్రీ సాంబమూర్తిగారికి 17 వేల రూపాయల నిధి సమర్పించబడింది.

పశ్చిమ బెంగాల్‌లో హర్తాళ్

బీహార్‌లోని బెంగాలీ ప్రాంతాలన్నిటిని పశ్చిమ బెంగాల్‌లో విలీనం చెయ్యాలన్న ఆందోళనను పురస్కరించుకొని రాష్ట్రం అంతటా జులై ఏడవ తేదీని హర్తాళ్ జరగడంతో వాణిజ్య సంస్థలలో, బ్యాంకులలో పని నిలిచిపోయింది. ప్రదర్శకులు రైలుమార్గాలలో బైఠాయించడంతో రైళ్ళ రాకపోకలు స్తంభించిపోయాయి. 17 సంఘటనలు జరిగాయి - 44 మందికి పైగా అరెస్టు చెయ్యబడ్డారు. 11 గంటలకుపిదపగాని పరిస్థితి చక్కబడలేదు.

హైదరాబాద్‌లో గాంధీభవన్

హైదరాబాద్ ప్రభుత్వం దానమిచ్చిన అయిదు యకరాల భూమిలో, అయిదున్నర లక్షల రూపాయల ఖర్చుతో హైదరాబాద్‌లో నిర్మించబడిన 'గాంధీభవన్'కు ప్రెసిడెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ జులై ఎనిమిదవ తేదీని ప్రారంభోత్సవం జరిపారు. భారత ప్రజలు గాంధీజీ సిద్ధాంతాలపట్ల విశ్వాసం కోల్పోవరాదని, ఆయన మనకు అప్పగించిన కార్యభారాన్ని నిర్వర్తించడంలో తిరుగులేని కృషి చెయ్యాలని ఉద్బోధించారు. ఈ భవనంలో గాంధేయ సంస్థలు, గాంధిజీ సిద్ధాంతాల గ్రంధాలయ, పరిశోధనాలయాలు వుంటాయి.

ఆంధ్ర ప్రదేశ్ భవనాలు

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ సందర్భంగా హైదరాబాద్ సికిందరాబాద్‌లలో ఆఫీసుల భవనాలు, ఉద్యోగుల వసతిగృహాలు మున్నగువాటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయల అప్పు మంజూరుచేసినట్లు ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు జులై 13 న ప్రకటించారు.

హరిజన సంక్షేమానికి సంస్థ

నిమ్నజాతి సంక్షేమాభ్యుదయాలపట్ల ఆసక్తిగల పార్లమెంటు సభ్యులు, తదితర ప్రజాసేవకులు ఆ కార్యక్రమాలలో పాల్గొనడానికి వీలుగా నూతన కేంద్ర హరిజన సంక్షేమ సంఘాన్ని (సెంట్రల్ హరిజన వెల్ఫేర్ బోర్డ్‌ను) ఏర్పాటు చెయ్యటానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది.

ఆంధ్ర ప్రదేశ్ నామకరణ

ఇండియా పార్లమెంటు జాయింటు సెలెక్టు కమిటి ఆంధ్ర తెలంగాణాల విలీనీకరణతో ఏర్పడే విశాలాంధ్రకు 'ఆంధ్ర ప్రదేశ్' అనే పేరుపెట్టాలని, హైకోర్టును హైదరాబాద్‌కే మార్చాలని తన నివేదికలో సిఫారసు చేసింది. ఈ నివేదికను జూలై 16 వ తేదీని హోంమంత్రి శ్రీ పంత్ లోకసభకు సమర్పించారు. సెలెక్టు కమిటీ చేసిన సూచనలలో బొంబాయి భవితవ్యంపై ప్రధాని నెహ్రూ వెలువరించిన అభిప్రాయాలనే ధ్రువపరిచింది.

ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీలో యిప్పటి సభ్యుల సభ్యత్వాన్ని వచ్చే జనరల్ ఎన్నికల తర్వాత అయిదు సంవత్సరాలవరకు (1962 వరకు) పొడిగించాలని, కొత్త ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లి కొత్త రాష్ట్రాల తాత్కాలిక అసెంబ్లీలతోపాటు స్పీకర్‌ను, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవాలనీకూడా సెలెక్టు కమిటీ సిఫారసు చేసింది.

కొత్త ఋణం

ఇండియా ప్రభుత్వం మూడు రకాలుగా కోరిన కొత్త ఋణం 150 కోట్ల రూపాయలు వసూలైనదని జూలై 18 న ప్రకటించబడ్డది.

సాంఘిక విద్యా పరిశోధనకు కొత్త సంస్థ

జులై 17 వ తేదీని న్యూఢిల్లీలో కేంద్ర సాంఘిక విద్య సలహాసంఘం స్థాయీ సంఘం సమావేశమైన సందర్భంలో ఇండియా ప్రభుత్వం విద్యాశాఖ సలహాదారు శ్రీ సయీదిన్ ప్రసంగిస్తూ సాంఘిక విద్యకు చెందిన వివిధ రంగాలలో పరిశోధనల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం త్వరలో జాతీయ ప్రాతిపదిక విద్యా కేంద్రాన్ని నెలకొల్పగలదని అన్నారు.

గుజరాత్‌లో భూకంపం

జులై 22 న గుజరాత్‌లో భూకంపం సంభవించింది. రాజకోటనుంచి బొంబాయివరకు గల పెక్కుచోట్ల సంభవించిన ఈ భూకంపం మూలంగా కచ్ ప్రాంతంలోని అంజార్ పట్టణంలో నూరు మందికి పైగా మరణించారు. 254 మంది గాయపడ్డారు. 30 గ్రామాలకు తీరని నష్టం వాటిల్లింది. 2000 ఇళ్ళు కూలిపోయాయి. అనేక మంది ప్రజలు నిరాశ్రయులై అల్లాడుతున్నారు. ఆస్తి నష్టం కోటిరూపాయలకు మించగలదనుకొంటున్నాం. బొంబాయినుంచి సహాయం హుటాహుటిని అందజేయబడుతూవుంది.

ప్రధాని నెహ్రూ స్వదేశాగమనం

లండన్‌లో జరిగిన కామన్వెల్త్ ప్రధానుల సభకు వెళ్ళిన ప్రధాని పండిట్ నెహ్రూ ఐర్లండ్, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, యూగోస్లావియా, ఈజిప్టు లెబనాన్, సిరియాలను దర్శించి అక్కడి నాయకులతో ముఖ్యమైన సమావేశాలు జరిపినమీదట జులై 23 వ తేదీని ఢిల్లీకి తిరిగివచ్చారు. ప్రెసిడెంట్ ప్రసాద్, డాక్టర్ రాధాకృష్ణన్, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ డేబర్, మంత్రులు, విదేశ రాయబారులు ప్రజలు ఆయనకు విమానాశ్రయంలో ఘనమైన స్వాగతమిచ్చారు. తన పర్యటన విశేషాలను పార్లమెంటులో వివరించగలనని పండిట్ నెహ్రూ అన్నారు.

శ్రీ చింతామణి దేశ్‌ముఖ్ రాజీనామా

ఇండియా ప్రభుత్వ ఆర్థికమంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్ రాజీనామాను ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ ఆమోదించారు. ప్రధాని నెహ్రూయే ఈ శాఖనుకూడా నిర్వహిస్తారట. శ్రీ దేశ్‌ముఖ్ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీనుంచికూడా రాజీనామా చేశారట.

ఆయన జులై 24 ఉదయం ప్రెసిడెంట్ ప్రసాద్‌ను కలుసుకొన్నారు. తన రాజీనామా కారణాలను వివరిస్తూ లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తామన్నారు. బొంబాయి భవితవ్య సమస్యపై ఏర్పడ్డ విభేదాలే శ్రీ దేశ్‌ముఖ్ రాజీనామాకు కారణం. ఈ రాజీనామా పార్లమెంట్ లాబీవర్గాలవారి కందరకు విచారం కలిగించింది. ఆయన ముందు ఏమిచేసేదీ యింకా తెలియలేదు కాని రాజకీయ వర్గాలలో ఆయన రాజకీయాలనుంచి విరమించవచ్చునసే అభిప్రాయం వ్యాపించివుంది.

శ్రీ దేశ్‌ముఖ్ ఆరు సంవత్సరాలుగా ఆర్థికమంత్రిగా వుండి భీమాకంపెనీల జాతీయకరణ, ఇంపీరియల్ బ్యాంకు జాతీయకరణవంటి పెక్కు ఘనకార్యాలు సాధించి, తొలి పంచవర్ష ప్రణాళిక దిగ్విజయానికి, సోషలిస్టు సమాజ వ్యవస్థాస్థాపనకు అపార కృషిచేశారు.

సంక్షేమం



'సిస్టర్'

దినచర్య

మిస్ విమలా ఆనంద్ సంఘ సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన దేశ సేవిక. ప్రత్యేక శిక్షణ పొందడం ఉపయుక్తమని గుర్తించి ఢిల్లీలోని సోషల్ వర్క్ కళాశాలలో ఎం. ఏ. డిగ్రీ పొందినది. ఇప్పుడు లేడీ హార్డింజి ఆసుపత్రిలో రోగులకు సేవ చేస్తూ ఆనందానుభూతి నొందుతున్నది.

ఆసుపత్రి ఉపశమనం కలిగించగలదు. విచార నైరాశ్యాలనూ సంఘటించగలదు ఏమైనప్పటికీ అది ఒక చిన్న ప్రపంచం. అక్కడకు వచ్చేవారు అనేక మంది. తరచుగా వారు బాధపడుతూ, తమ జీవితాలలో విషమఘట్టాలను గడుపుతూవుంటారు.

ఆసుపత్రులలో వుంటూ భావి అంధకార బంధురంగా కనిపిస్తున్న సమయంలోనే అక్కడి సంఘసేవిక తారసిల్లుతుంది. రోగుల కష్ట నిష్ఠూరాలను సానుభూతితో గమనిస్తుంది. మన చిక్కులు మనోవ్యధ సంజనితాలో, మనస్తత్వానికి సంబంధించినవో, లేక శారీరక రుగ్మతకు, శారీరిక మానసికోద్వేగాలకు ఎంతవరకు సంబంధించినవో తెలుసుకొంటుంది. ఆర్థికంగా మన చిక్కులను గ్రహిస్తుంది మనం ఎదుర్కొంటున్న సంధిగ్ధ పరిస్థితిని తొలగించడానికి యత్నించి, సహాయ పడుతుంది.

ఈ కార్యభారాన్ని శ్రీ విమలా ఆనంద్ యిప్పటికి నాలుగు సంవత్సరాలుగా జయప్రదంగా లేడీ హార్డింజ్ ఆసుపత్రిలో నిర్వహిస్తూవుంది ఆమె ఆ ఆసుపత్రిలో సంఘ సేవిక. రోగుల సమస్యల పరిశీలనలో చూపే ఆసక్తి, ఆసుపత్రి సిబ్బందితో నెరపే సహకారం, తనకు తారసపడే ప్రతీరోగి పునరావాస కల్పనలో ఆమె వహించే శ్రద్ధ ఆమెను అందరికీ స్నేహాభిమాన భాజనురాలిని కావించాయి.

ఆసుపత్రిలో రోగులకు సేవచేసే ఈ సంఘసేవిక యింజక్షనులు చేయించుకొనడం సక్రమంగా రాని రోగులను, చికిత్సానంతరం పరీక్ష చేయించుకొనడానికి సక్రమంగా రాని రోగులను ఆమె వెంటాడి తీసుకు రావలసివస్తూ వుంటుంది. ఏ చిక్కుల వల్లనో, మనస్తాపం వల్లనో చికిత్సపట్ల అంత ఎక్కువ సుముఖత్వం వహించని రోగుల పరిస్థితులను, వారి సాధక బాధకాలను ఆమె పరిశీలిస్తుంది. తమ మనోవ్యధలను వోకార్చుకొనడానికి వీలుగా ఆమె రోగులకు సలహాలిస్తూ తోడ్పడుతూ వుంటుంది. అయితే ఒక్కొకపుడు మందు సేవించడానికి గాని, శస్త్ర చికిత్స పొందడానికి గాని నిరాకరించే రోగుల విషయం ఆమె శక్తి యుక్తులకు విషమపరీక్షగా పరిణమిస్తూ వుంటుంది. అటువంటి రోగుల విషయంలో వారి బంధువుల సహకారం పొందడం అవసరమౌతుంది. వారి యిళ్ళకు తరచుగా వెళ్ళి- ఆ కుటుంబం జీవిత పరిస్థితులను పరిశీలించి ఆ రోగుల వ్యక్తిత్వాన్ని గురించి, సాంఘిక పరిస్థితులను గురించి ఒక నివేదిక వ్రాసి వైద్యునికి అందజేస్తుంది.

శ్రీ విమలా ఆనంద్ కార్యక్రమం ఆసుపత్రి నర్స్ కొత్తగా ఆసుపత్రిలో చేర్చుకొనబడిన రోగి లక్షణాలను ఆమెతో చర్చించడంతోనూ, అక్కడ అంతకుముందే వున్న రోగి విషయంలో యింకా మరికొన్ని వివరాలను తెలుసుకోవలసిన ఆవశ్యకతనుగురించి చర్చించడంతోనూ ప్రారంభమౌతుంది. అది ఎటువంటి సందర్భమైనప్పటికీ ఆమెకు నర్సు సహకారం లభిస్తుంది. కోరిన వివరాలను సంతోషంతో చెబుతుంది. దీనికి వెంబడినే అటువంటి రోగులకు వైద్య చికిత్సతోపాటు వారికి మానసిక వ్యధలనుంచి ఉపశమనం కలిగించవలసిన అవసరాన్ని గురించి డాక్టర్లతో చర్చిస్తుంది. ఈ విధంగా చర్చిస్తున్న సమయంలోనే మిస్ ఆనంద్ తమ చిక్కులను తొలగించడానికి చేసే యత్నాలపట్ల విశ్వాసం కలిగివున్న పాత రోగి తన కష్టాలను గురించి చెప్పుకొనడానికి వస్తాడు. లేదా మరొక రోగి పాలడబ్బా కావాలంటాడు. అట్టికోరికలను ఆమె వెంటనే మన్నిస్తుంది. పాలపంపిణీ ఆమె నిత్య కార్యక్రమంలో ఒక భాగం.

ఆ చిన్నపిల్ల నాజ్మాకు నడవడానికి ఊతగా రెండు కర్రలనివ్వడమా, లేదా చక్రాలమర్చబడిన ఒక కుర్చీ నివ్వడమా, అది ఎప్పుడు యివ్వడం అనే నిర్ణయం చేసేది మిస్ ఆనంద్. ఆమె రోగి యింటికివెళ్ళి, అక్కడి పరిస్థితులను పరిశీలించిన మీదటనే తన నిర్ణయం చేస్తుంది. నాజ్మా జనం రద్దీగా వున్న ప్రాంతంలోనే

నివసిస్తుంది కనక అక్కడ చక్రాల కుర్చీకి తగిన స్థలం, అవకాశం లేనందున చంక కర్రలను యివ్వడమే యుక్తమని నిర్ణయిస్తుంది. ఆసుపత్రి సంక్షేమ సంఘం వాటికి కావలసిన డబ్బును అప్పుడే మంజూరు చేసింది. మిస్ ఆనంద్ తప్పనిసరిగా రోగుల యిళ్ళకు తరచు వెళ్ళి అక్కడి పరిస్థితులను గమనిస్తూ వుంటుంది.

రోగుల మనస్సులను అన్యథాయత్తం చెయ్యడంవల్ల స్వాస్థ్యం త్వరలో చిక్కగలదనే సంగతి అందరకు తెలిసినదే. ఇదికూడా చికిత్సలో ఒక భాగమే. దీనికి తగిన కార్యక్రమాలను నిర్ణయించడంలో మిస్ ఆనంద్ తోడ్పడుతూ వుంటుంది.

క్షయ వ్యాధితో బాధపడుతూ ఒక్కతై పోయిన జీరాకు ఎవరూ లేరు. తన క్షేమం కోరేది వృద్ధుడైన మేనమామ మాత్రమేనని ఆమె చెప్పింది. లేసు కుట్టుకొనడానికి ఆమెకు అవకాశం కలిగించబడినపుడు ఆమె ఎంతో సుఖంగా కనిపించింది. ఇదే విధంగా ప్రతిరోగిని కలుసుకొని, మాట్లాడేది కొన్ని నిమిషాలపాటే అయినప్పటికీ వారు ఆమెతో తమ అవసరాలను గురించి మనసిచ్చి చెప్పివేస్తూ వుంటారు. వారి ఆదరాభిమానాలను ఆమె అంత ఎక్కువగా చూరగొన్నది.

ఆసుపత్రులలోని సంఘ సేవికకు మరీ ఎక్కువ సమస్యగాతోచే సందర్భం ప్రసవానికి వచ్చే గర్భవతుల విషయంలో ఎదురౌతూ వుంటుంది. అదయినా కుటుంబ నియంత్రణాన్ని గురించి సలహా యివ్వవలసిన సందర్భాలలోనే. కుటుంబ నియంత్రణమంటే ఏమిటో తెలియనివారు, ఆమాటనే అసలు విననివారు అనేకమంది స్త్రీలుంటారు.

నర్సు అటువంటి కేసు వచ్చినపుడు ఆ గర్భవతిని గురించి నోట్సు వ్రాస్తున్న సమయంలో— "నీకు మగ పిల్లలున్నారు, ఆడపిల్లలున్నారు, ఇక వీరి అభివృద్ధి పెంపును గురించి మాత్రమే నువ్వు ఎక్కువగా శ్రద్ధ వహించడం అవసరంకాదా ?" అని ఆమె ఒక సూచన చేస్తుంది మెల్లగా.

ఈ విషయంలో ఎక్కువగా వివరాలు కోరినవారివిషయం కుటుంబనియంత్రణశాఖకు తెలియజేయబడుతుంది.

అందరం సుఖజీవనాన్నే కోరుకొంటామనే సత్యాన్ని గుర్తించినపుడు సలహాలు, సహాయం, మార్గదర్శకత్వం బహుస్వల్పమైన విషయాలు మాత్రమే. అయితే అనేకమంది జీవితాలలో— తమ పనిపాటలపట్ల ఆసక్తి, తమకష్టాలను అధిగమించాలనే సంకల్పం సడలిపోవడం,



తమ ఆశలు వమ్మై నిరాశకలగడం ఎప్పుడో ఒకప్పుడు సంభవిస్తూనే వుంటుంది. బ్లాకౌట్ సమయాలలో కూడా ఆసుపత్రులలో రోగులు నిరాశను —మృత్యుప్రమాద భీతిని ఎదుర్కొంటూ వున్నప్పుడు కూడా అక్కడ తల్లి మాదిరిగా, సోదరిలా, మార్గదర్శిగా అన్నీ మూర్తీభవించినవారు ఒక్కరు చల్లనిమాట చెప్పేవారు వున్నారని తెలుసుకోవడం సంతోషాన్ని సంతృప్తిని కూడా కలిగిస్తుంది.

—రతన్ ప్రభా రాయ్.

హాస్పిటల్స్‌లో సంఘసేవ

'నీరా కార్వే'

"నిజం కల్పనకంటె చిత్రమైన" దంటారు. ఈ మాటలలోని సత్యం సంఘ సేవకుల విషయంలో అక్షరాలా అనుభవానికి వస్తూవుంటుంది. భిన్న భావాలు అనుభూతులు, కష్ట నిష్ఠూరాలు అనుభవించే వ్యక్తులతో పనిచెయ్యడం చాలా ఆసక్తి కలిగిస్తుంది. అటువంటి పనివల్ల పుస్తకాలద్వారా నేర్చుకొనగలిగే దానికంటె మనం ఎంతో ఎక్కువగా నేర్చుకొనడానికి అవకాశం వుంటుంది.

ఏ ఆసుపత్రిలోనైనా వైద్యచికిత్సకు జతగా సాంఘిక శాఖను ఏర్పాటు చెయ్యడం విచిత్రమైన అనుభవాన్ని కలిగిస్తుంది. సంఘ సేవకులకు అనేక విధాల సేవచేసే అవకాశం కలుగుతుంది ఏమీ లేకుండానే ప్రారంభించి, ఒక కొత్త శాఖను ఏర్పాటు చెయ్యడంద్వారా కొత్త పంథాలలో సేవ చెయ్యడంవల్ల నిర్మాణాత్మకము, సృజనాత్మకము అయిన కృషిని కొనసాగించిన తృప్తి కలుగుతుంది.

వైద్యంలో సాంఘిక సేవ అంటే రోగి అస్వస్థతకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారణమైన పరిస్థితులను కూడా తెలిసికొని వ్యవహరించవలసివుంటుంది. వ్యాధి లక్షణాలను నిర్ణయించేటప్పుడు సంఘ సేవకునూకొనే ఈ వైద్యులు రోగి సాంఘిక, శారీరక, మానసిక వ్యాధులను గ్రహించి చికిత్స చెయ్యవలసివుంటుంది. ఇటువంటి చికిత్సకు నిర్దేశించబడే ఆసుపత్రి స్థాపించే చోట రోగుల అవసరాలు, అక్కడలభించే సౌకర్యాలు, సాధన సంపత్తులపైనే సేవచేసే అవకాశాలు ఆధార పడివుంటాయి. ఈ సంఘ సేవకులు డాక్టరులతోన్నూ, యితర పనివారితోను పూర్తిగా సహకారం నెరపు కొంటూనే తమ ధర్మాలను నిర్వహించుకోవడం చాలా ముఖ్యం. ఎవరితో కలిసి పనిచెయ్యవలసివుంటుందో వారి సహకారం పైనకూడా ఈ రంగంలోని సంఘ సేవకుల కృషి ఫలితం ఆధారపడివుంటుంది. ఇండియాలో ఈ శాఖ కొత్తగా ప్రవేశపెట్టబడ్డది కాగా సంఘసేవిక సహాయం ఏవిధంగా వుపయోగించుకొనవలసినది చాలా మందికి తెలియకపోవచ్చు కనుక ముందు రోగులను ఆమె వద్దకు తీసుకువెళ్ళడానికి చాలా మంది యిష్టపడక పోవచ్చు. ఈ పరిస్థితులలో సంఘసేవికలు, డాక్టరులు వారి అవసరాన్ని గుర్తించి వారి సహాయాన్ని కోరేవరకు స్వతంత్రంగా తమ కృషిని కొనసాగించుకుంటూ పోవడమే యుక్తం.

స్వతంత్ర కృషి సందర్భంగా రోగులకు వినోదం కలిగించే ఏర్పాట్లు కూడా జరగాలి.

"సిస్టర్! నాకు యిక్కడ కాలం గడవడం చాలా కష్టంగా వుంది. అస్తమానం నా రోగాన్ని గురించి నా కుటుంబాన్ని గురించి తాపత్రయపడక తప్పడంలేదు. గడియారంవంక చూస్తే నేను క్రిందటిసారి చూసిన తర్వాత కొలది నిమిషాలు మాత్రమే గడిచినట్లు కనిపిస్తోంది. ఆసుపత్రిలోవుండే రోగులకే ఈ చిక్కు తెలుస్తుంది" అని ఒకామె నేను నాకృషి ప్రారంభించగానే అంది. చాలా మంది రోగులకు యిదే అనుభవం కలిగి వుంటుంది. రోగులకు కాలం కులాసాగా గడవడానికి తగిన ఏర్పాట్లు చెయ్యడం ఆసుపత్రులలో సంఘ సేవా కార్యక్రమంలో ముఖ్య భాగంగా పేర్కొనవచ్చు. రోగులు చదువగలిగినవారైతే ఒక లైబ్రరీ ఏర్పాటు చెయ్యవచ్చు, ఆ లైబ్రరీలో వుండే పుస్తకాలు తేలికగా వుండే కథలు, నవలలు, హాస్యరసాత్మక రచనలు అయి వుండాలి. రోగులు దైనిక పత్రికలు, వార, మాస పత్రికలు పగటిపూట ఏ సమయంలోనైనా చదువుకోడానికి ఒక పఠన మందిరాన్ని ఆసుపత్రిలోనే ఏర్పాటు చెయ్యవచ్చు. ఆసుపత్రిలోనే ఒక గదిలో ఏర్పాటుచేసే వినోద కార్యక్రమాలు దూరశ్రవణ యంత్రాలద్వారా రోగులందరికీ వినిపించే ఏర్పాటు చెయ్యవచ్చు. అయితే యిటువంటిదానికి తగిన సాధనసంపత్తిని, ఉచితంగా వినోదం కలిగించడానికి యిష్టపడే కళాకారులను సమకూర్చుకొనడానికి వ్యవధి అవసరమౌతూ వుంటుంది. ఇదే విధంగా భజనలు, ఫిలిం ప్రదర్శనాలు కూడా రోగులకు కాలక్షేపం కావడానికి ఏర్పాటుచెయ్యవచ్చు.

ఆసుపత్రులలో వుండే పెద్దలకంటె పిల్లలకు ప్రొద్దుపోక చాలా కష్టంగా వుంటుంది. పిల్లలకు తగిన పుస్తకాలతో ఒక లైబ్రరీ ఏర్పాటు చెయ్యడం ఎంతో ఉపకరిస్తుంది.

హాస్పిటల్స్‌లో సంఘ సేవ



విదేశాలలోవలె మనదేశంలో కమ్యూనిటీ చెస్ట్లులేవు కనక వీటికి కావలసిన ద్రవ్యం సమకూర్చడానికి వ్యక్తిగత ప్రయత్నాలే జరగవలసివుంది. అయితే మన దేశంలో ప్రజల సంపాదన వారి అవసరాలకే చాలీ చాలకుండా వుండడంవల్ల యిక దానధర్మాలకు మిగిలేది ఏమీవుండదు. ఎవరైనా కొందరు విరాళాలిచ్చేవారు వుంటారు. అటువంటివారిని కలుసుకొని, కొంత మొత్తం సేకరించుకోవచ్చు. తాము చదువుకొనడానికి ఆసుపత్రులలో పని చేసేవారు కొనుక్కొని, లేక చందాకట్టి తెప్పించుకొనే పత్రికలను తాము చదువుకొన్న తర్వాత లైబ్రరీకి యిచ్చే ఏర్పాటు ఉపయుక్తమైనది. కొందరు రోగులకు మందులు ఉచితంగా ఏర్పాటుకూడా చెయ్యవచ్చు. పెక్కుమంది రోగులకు యింకా అనేక విధాలుగా సేవచేసే అవకాశాలున్నాయి. ఆసుపత్రిలోని వార్డులలో తిరుగుతూ రోగులతో సంప్రతిస్తూవుంటే వారి సమస్యలు అనేకం తెలియవస్తాయి. డబ్బుద్వారా గాక యితరత్రా పరిష్కరించడానికి వీలున్న సమస్యలవి. అటువంటి సందర్భాలు కొన్నిటిని యీ దిగువను ఉదహరిస్తాను.

"ఎం అనే అమ్మాయి వుంది. ఆమె వయస్సు తొమ్మిదేళ్ళు. ఆమె వ్యాధి పీడిత కాగా తలిదండ్రులు తమ గ్రామంనుంచి తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో వుండడానికి ఆపిల్లకు భయం. ఇంటికి వెళ్ళిపోదామనే ఎప్పుడూ ఏడుస్తూ వుంటుంది. ఆమె జబ్బు తీవ్రమైనదైనప్పటికీ తలిదండ్రులు తీసుకుపోతారు. డాక్టరులకు గాని, నర్సులకు గాని అలా తీసుకుపోవడం ప్రమాదకరమని తలిదండ్రులకు నచ్చచెప్పడానికి తీరిక వుండదు. ఇటువంటి సందర్భంలోనే సంఘసేవిక ఆ వ్యాధి తీవ్రతను తలిదండ్రులకు విశదీకరించి, ఎటువంటి చికిత్స అవసరమో చెప్పి చికిత్స పూర్తిచేసుకొని వెళ్ళవలసినదిగా బోధించగలదు.

'ఓ' అనే ఆమె పరిచారికగా జీవితకాలమంతా వెళ్ళబుచ్చింది. ఆమె యిప్పుడు వృద్ధురాలు. రోగ పీడిత. యజమాని అలక్ష్యంగా వదిలివేశాడు. బంధువులూ వదిలివేశారు. ఆసుపత్రి నుంచి తన్ను విడుదలచేసిన పిదప తనకు వీధులలో తిరగడమే గత్యంతరం కాకుండా తనతో ఎవరైనా అప్పుడప్పుడైనా మాట్లాడి, తన క్షేమాన్ని తెలుసుకొంటూ తను వృద్ధాప్యంలో కాలం వెళ్ళబుచ్చ గలగడానికి ఏమార్గమైనా సూచించాలని కోరుకొంటుంది.

'ఎల్' అనే రోగిని ఆమె భర్త చావగొట్టాడు. ఆమె కంటికి దెబ్బతగిలింది. ఆమెకు కావలసిన చికిత్స జరుగుతూవున్నప్పటికీ ఆమె మనోవ్యథ తగ్గడానికి ఆమె కష్టాలను విని భవిష్యత్తును గురించి తగిన సలహా యివ్వడం ద్వారా తోడ్పడవచ్చు.

'వి' అనే రోగి క్షయవ్యాధితో బాధపడుతూవుంది. ఆరు మాసాలకుపైగా ఆమె ఆసుపత్రిలో వుండవలసివుంది. ఆమె భర్త ఫ్యాక్టరీలో పనివాడు. అతడు పనికి వెడితే ముగ్గురు పిల్లల్ని చూసే దిక్కులేదు. ఈ తాపత్రయం ఆ రోగిని మరింత కలవరపెడుతూవుంది. సంఘసేవిక- ఆ ముగ్గురి పిల్లల్ని తల్లి ఆరోగ్యం కోల్కొని తిరిగివచ్చేవరకు ఏ ఆశ్రమంలోనైనా చేర్పించవలసినదిగా తండ్రికినచ్చచెప్పి తగు ఏర్పాటుచెయ్యవచ్చు.

హాస్పిటల్స్‌లో సంఘసేవ

'వై' ది ప్రసూతి కేసు. ఆమె ఆసుపత్రి నుంచి విడుదల చెయ్యబడడానికి సిద్ధంగా వుంది. పెక్కు సంవత్సరాలక్రితమే ఆమెను భర్త వదిలివేశాడు. ఆమె తలిదండ్రులతో కలిసి నివసిస్తూవుంది. ఆమెను ఆ తర్వాత ఎవరో వంచన చేశారు. ఇప్పుడు తలిదండ్రులు ఆమెను తమకింకా వున్న బిడ్డల శ్రేయస్సుకు మంచిది కాదనే భావంతో పరిగ్రహించడానికి నిరాకరిస్తున్నారు. ఆమెకు స్వతంత్రంగా జీవనోపాధి కల్పించుకొనేశక్తి సామర్థ్యాలు లేవు ఆమెకు తగిన ఆశ్రయం, పోషణ జరిగే మార్గం చూపవలసివుంది.

'ఇ' అనే ఆమెకు ఒళ్ళంతా విపరీతంగా కాలిపోయింది. ఆమె బాధ దుర్భరంగావుంది. ఆమెకు చికిత్స అంత త్వరలో తేలేదికాదు. చాలా కాలం పట్టేటట్లుంది. బహుశా శస్త్రచికిత్సకూడా చెయ్యవలసిన అవసరం కలగవచ్చు ననుకొంటున్నారు. ఈ పరిస్థితిలోనే ఆమెకు తగిన మనోనిబ్బరం కలగడానికి వీలుగా ధైర్యం కలిగించడం అవసరం.

ఈ కేసులన్నీ అంత ఎక్కువగా సాధనసంపత్తి లేకుండా వ్యక్తిగతంగా రోగులకు ఏవిధంగా సహాయం చెయ్యడానికి వీలున్నదీ సూచిస్తాయి. వ్యక్తిగతంగాచేసే ఈ సేవను "రికార్డు" చెయ్యవచ్చు. ఆసుపత్రి పెద్దదైనప్పుడు అందరు రోగులకు సేవ చెయ్యడం సంభవం కాదు. ఆసుపత్రిలో ఒక్కొక శాఖ విషయంలోనే-పరిమితంగా కొన్ని కేసులకే దృష్టిని కేంద్రీకరించవచ్చు.


ప్రారంభంలో సంఘసేవిక వచ్చినపుడు "మీరు చెయ్యబోయే పని ఏమిటి? ఈ పనికి రోజంతా పనిచేసే ఉద్యోగిని ఒకరిని నెల జీతం మీద నియమించడం అవసరమా?" అని ప్రశ్నించేవారు కూడా వుంటారు. అటువంటి ప్రశ్నల నెదుర్కొన్నపుడు తగిన సమాధానమివ్వడానికి కూడా సంఘసేవికలు సిద్ధంగా వుండాలి.

ఏదైనా ఒక సేవకు తగిన కార్యక్రమం ప్రారంభించడం సులభమే కాని దానిని కొనసాగించడం కష్టసాధ్యమౌతూ వుంటుంది. ఉదాహరణకు పిల్లలకు వినోద కేంద్రం ఏర్పాటు చెయ్యడం అంత కష్టం కాకపోవచ్చు. కాని ఆ వస్తువులు సేకరించడం, అవి పగిలిపోతే మరామత్తు చేయించడం- కొత్త కొత్త వినోద విధానాలను నిర్ణయిస్తూ వుండడం సులభంకాదు.

కొన్ని సందర్భాలలో ఏ ఏర్పాటునైనా చెయ్యదలచినపుడు దానికి తగిన సాధన సంపత్తి లభించడంలో- లేదా మంజూరు కావడంలో విలంబన జరగవచ్చు. సహాయం చేసేవారు లేకపోవచ్చు. తగిన గది లేకపోవచ్చు. ఇటువంటి పరిమితులు అనివార్యమని భావించే సంఘ సేవిక తన కృషిని కొనసాగించాలి.

రోగులను కలుసుకొన్నపుడు వారు ఆత్రతో తమకివ్వబడుతున్న ఆహారాన్ని గురించి ఫిర్యాదు చెయ్యవచ్చు. ఆసుపత్రి నౌకరులు, పనివారు తమ సౌకర్యాల విషయంలో శ్రద్ధ వహించడం లేదని చెప్పవచ్చు. ఆ ఫిర్యాదులలో సక్రమమైన వాటిని అధికారులకు తెలియజేసి, ఆ యిబ్బందులను తొలగిస్తూ, ఆసుపత్రి పనివారి చిక్కులను కూడా రోగులకు వివరించడం సేవికకు విధి విహితమౌతూ వుంటుంది.

ఆసుపత్రులలో సంఘ సేవిక చెయ్యదగు పనులు యివి అని పరిమితంగా నిర్దేశించడానికి వీలులేదు. అన్ని రంగాలలోను సాంఘిక సేవ ఎంత అవసరమో, ఎంత ప్రయోజనకరమో అదేవిధంగా ఆసుపత్రులలో రోగుల విషయంలో కూడా సంఘసేవ ఈనాడు అంత అవసరమౌతున్నది.



స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు ద్రవ్యసహాయము - వాటి కృషి

శ్రీ డి. పాల్‌చౌదురి

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన వారందరిలోను ఎవరూ ఎప్పుడూ వేయని ఒక ముఖ్యమైన— అత్యంత సంగతమైన ప్రశ్న వేసిన ప్రముఖురాలు కలదు. ఆమె ఇండియాలోని స్వీడన్ మంత్రి మదాం ఆల్వామిర్డల్. 1956 జనవరిలో కేంద్ర సంఘ సంక్షేమ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని దర్శించి నపుడు కేంద్రం నుంచి ద్రవ్యసహాయం స్వీకరించిన పిమ్మట గణనీయ మార్పు లేమిజరిగాయి ? జరిగివుంటే ఆ మార్పు లేవిధంగా ఏరంగంలో ఎంతవరకు జరిగాయి? ఆ అభివృద్ధిని గ్రహించడానికి అనుసరిస్తున్న మార్గా లేమిటి ? అని ఆమె ప్రశ్నించింది. నిజానికి ఇండియాలో సంఘ సంక్షేమం పట్ల ఆసక్తిగల అనేకమంది ప్రజలు పాఠకులు కూడా ఈ ప్రశ్న వేస్తారు.

స్వచ్ఛంద సంక్షేమ సంస్థలు తాము అంతకుముందు చేస్తూ వచ్చిన కృషిని అభివృద్ధిచేసి, ఇంకా ఉన్నత ప్రమాణాలలో దానిని కొనసాగించడానికి వీలుగా కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ స్థాపించబడినదాదిగా గ్రాంటుల రూపంలో సహాయం చేస్తున్న సంగతి అందరికి తెలిసి నట్టిదే. కేంద్ర సంస్థనుంచి సహాయం స్వీకరించిన, సంస్థల కృషి ఏ ప్రమాణంలో కొనసాగుతున్నదీ, ఆ సంస్థలు ఏమి సాధిస్తున్నదీ క్రమబద్ధమైన పద్ధతిలో తెలుసుకొంటూ వుండడం అవసరం. ఈ ప్రశ్నకు సమాధానాన్ని యింత ఈ విధంగా జరిగిందని అంకెల ద్వారా చెప్పడానికి అప్పుడే అవకాశం లేకపోయినప్పటికీ యిది చాలా ముఖ్యమైన విషయం కనక దీనిని గురించి కొంత భోగట్టా యివ్వడం అవసరమౌతున్నది.

కేంద్ర సంస్థనుంచి పొందుతున్న సహాయాన్ని స్వచ్ఛంద సంక్షేమ సంస్థలు తాము సాగిస్తున్న కృషిని ఇతోధికంగా పెంపొందించుకొనడానికి, తమ కృషిని మరింత విశిష్టంగా కొనసాగించడానికి ఉపయోగిస్తున్నవి. అగతికులైన బాలబాలికలకు, వితంతువులకు, మనో వైకల్యంగాని అంగవైకల్యంగాని పొందిన బిడ్డలకు ఆశ్రయమిచ్చి సంరక్షించే సంస్థలకు మరికొందరిని చేర్చుకొని సంరక్షించడానికి వీలుగా ఆర్థిక సహాయం చెయ్యబడుతూవుంది. వసతి, సిబ్బంది, సాధన సంపత్తి యంత్రపరికరాలుకల సంస్థలకు ఇంకా ఎక్కువమందిని చేర్చుకొనడానికి వీలుగా ద్రవ్యసహాయం చెయ్యబడుతూ వుంది. అటువంటి సంస్థలకు కేంద్ర సంక్షేమ సంస్థచేస్తూ వచ్చిన సహాయం ఈవిధంగా ఎక్కువమందిని చేర్చు కొని, అభివృద్ధి సాధించడానికి తగిన అవకాశ మిస్తూవుంది.

తమ సంక్షేమ కార్యకలాపాలను ఇంకా విస్తరించు కొనగోరే కొన్ని సంస్థలకు కొన్ని సందర్భాలలో వసతి సౌకర్యం పెంపొందించుకోవలసిన అవసరం ఏర్పడుతూ వుంది. 1954 నవంబరు నుంచి అటువంటి వసతి విస్తరణ సౌకర్యం కోరే సంస్థలకు అదనపు నిర్మాణ వ్యయంక్రింద మాచింగ్ పద్ధతిని 15,000 రూపాయల వరకు ఏరాశాలిస్తున్నది. ఈ ద్రవ్యంతో కొత్త కట్టడా లను నిర్మించుకొన్న సంస్థలు కొత్తగా మరికొందరిని చేర్చుకొనడమో, కొత్తశాఖలను ఏర్పాటుచేసుకొనడమో జరుగుతూవుంది.

కొత్తగా ఎవరిని చేర్చుకొనే శక్తిలేని కొన్ని సంస్థ లకు తాము అంతకు ముందు చేస్తున్న కృషినే అభివృద్ధి చేసుకోవలసిన అవసరాన్ని ఎదుర్కొంటున్నవి. ఈ అభివృద్ధి అనేక మార్గాలద్వారా సాధించుకొనడానికి అవకాశం వుంది. సుశిక్షితులైన సిబ్బందిని నియమించు కొనడం, అవసరమైన యంత్ర పరికరాలు సమకూర్చు కొనడం, వసతిని విస్తరించుకొనడం, రాకపోకలకు సౌకర్యాలను కలిగించడం మున్నగునవి అన్నీ అభివృద్ధి సాధనకు మార్గాలే. ఉదాహరణకు ప్రైమరీ పాఠశాల

వ్యాధి గ్రస్తులకు సేవ

ఫ్రెడా బేడీ

ఈ మాటలు అమోఘమైనవి. వీటిలోనే ఒక చిన్న ప్రపంచం యిమిడివుంది. వ్యాధిగ్రస్తుల, నిరుద్యోగుల, దుఃఖపీడితుల ప్రపంచమిది. సంఘం నుంచి బహిష్కరింపబడినవారు, పొట్టకోసం కష్టపడి సతమతమయ్యేవారు, రోగనివృత్తికై బాధపడేవారు, తమకుటుంబాలతో రోజుగడవడానికై తాపత్రయపడేవారు వుండేప్రపంచమిది.

సంఘసేవా సక్తులైన వారి బీటు ఆసుపత్రులలోని ఔట్ పేషెంట్స్ శాఖా, వార్డులలోని. మహిళా సేవికలు స్త్రీల, బిడ్డల సమస్యలను, పురుషులు మగవారి సమస్యలను చూస్తూవుంటారు. కొన్ని సమయాలలో వీరికి యితర సమస్యలుకూడా ఎదురౌతూ వుంటాయి. ఆ పనే అటువంటిది.

ఆరోగ్యం కోల్కొనడానికి మీకు మామూలుగా పట్టే వ్యవధికంటె ఎక్కువ ఆలస్యమౌతున్నదే? దానికి ఏదో కారణం వుండాలి. ఆ కారణం ఏదో కనుగొనే భారం సంఘ సేవకునిపైనే పెడదాం. అది ఏదైనా కుటుంబానికి సంబంధించిన చిక్కు అయివుండాలి. లేదా మనోవ్యథ అయివుండాలి. అది ఏదో ఆ సంఘ సేవిక-లేక సేవకుడు కనుగొనగలరు. ఆవార్డులో బాధపడు తున్న వ్యక్తి విశ్వాసాన్ని చూరగొని ఆవ్యధకు గల కారణం తెలుసుకోగలరు.

శాంతి రేపే యింటికి వెళ్ళిపోవలసివుంది. అయితే ఆమె వ్రాసిన కార్డుకి ఇంకా జవాబు రాలేదు. ఆసుపత్రి తలుపులు తెరిచిన పిదప తాను ఎలాగ వెళ్ళడం? ఆమెవద్ద బస్సు ఛార్జీకి డబ్బులు వున్నవో లేవో డాక్టర్లు తెలుసుకోడానికి, తాపత్రయం పెట్టుకొనడానికి వారు పెద్దలయ్యే. నర్సులకు క్షణకాలం తీరిక వుండదయ్యే. ఇక ఆ సమయానికి ఆదుకొనగలవారెవరు? సంఘ సేవకులు.

ఔట్ పేషెంటు డిపార్టుమెంటువారికి కూడా సమస్యలున్నాయి. సుఖవ్యాధులకు ఇంజక్షనులు తీసుకొంటున్న యువతి ఈ మధ్య సక్రమంగా రావడంలేదు. అలా రాకపోవడంవల్ల యింతవరకు చేస్తున్న కృషి అంతా నిష్ఫలమైపోగలదు. ఆమెకు బస్సుమీద రావడానికి డబ్బులు లేవా? విచారంతో తిరిగి క్రుంగిపోతున్నదా? బద్ధకిస్తున్నదా? ఆసంగతే సంఘసేవకులు కనుక్కొంటారు. బహుశా ఆమె బిడ్డకు సుస్తీగా వుందేమో? ఆ బిడ్డను వదిలి రావడానికి వీలులేక పోతున్నదేమో. అటువంటి పరిస్థితికి తగిన మార్గం కనుక్కొనగలిగినదీ సంఘసేవకులే. రోగులకు చదువుకొనడానికి తగిన 'మంచి' పుస్తకాలను సేకరించడం— అస్వస్థతలో పడివున్న బిడ్డలకు తగిన ఆటలను-వినోదాన్ని ఏర్పాటు చెయ్యడం, దృష్టి సరిగా ఆనని వృద్ధులకు వారికి రోజు గడవడం కోసం తగిన వృత్తులు సూచించడం— రోగగ్రసితులైన విద్యార్థులకు ఉత్సాహం కలిగిస్తూవుండడం వ్యాధి నివృత్తికి పిదప అతడు మరీ ఎక్కువగా తాపత్రయపడకుండా చూస్తూవుండడం -ఇదంతా సంఘ సేవకుల పనే.

వైద్యవృత్తిలో వుంటూ సంఘసేవ చెయ్యగోరే యువతికి మందులతోను మాత్రలతోను మాత్రమేగాక ప్రేమ, ఆదరాభిమానాలు, సానుభూతి, ఆత్మవిశ్వాసాలతో రోగ నివృత్తికి పూనుకోవడం ఉత్తమ లక్ష్యం. సాంకేతికంగా ఆమె వైద్యవృత్తిని శిక్షణ పొందివున్నా-రోగపీడితమైన మానవ కోటిని సేవించాలన్న ఉత్కృష్ట లక్ష్యం, దానినే ఆమె తన జీవిత కర్తవ్యంగా పెట్టుకొంటేగాని నెరవేరదు. ఆమె అందరిలోను ఏకాత్మనే చూడాలి. అందరు ఏవిధంగా పుట్టుక, బాధ, అనారోగ్యం మరణాలకు గురి అవుతూవుంటారో గమనించాలి. తన తన కార్యనిర్వహణలో అచంచల ధైర్యవిశ్వాసాలతో వర్తించాలి.

ఇంకా చెప్పాలంటే ఆమెకు కొంచెం తాత్త్విక సిద్ధాంతాలుకూడా తెలిసివుండాలి.

రాష్ట్రాల వార్తలు

చెంగల్పట్టు జిల్లా తిరుమణిలోని సెంట్రల్ లెప్రసీ టీచింగ్ అండు రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ యొక్క 1955 సం॥రపు వార్షిక నివేదికనుబట్టి ఆసుపత్రిలోనే ఉండి వైద్యం పొందుతున్నవారు 1,464గురు, పైనుండి వచ్చి వైద్య సహాయం పొందుతున్నవారు 13,524 గురున్నూ, వీరుగాక, 4043 గ్గురు సలహాకోసమైతేనేమి, పుండ్లు మాన్పుకొనుట కైతేనేమి అప్పుడప్పుడు పరీక్షచేయించుకొనుటకేమి వచ్చియున్నారు. సూక్ష్మ క్రిమి వ్యాధుల పరీక్షలు ఆయేట 9,489 జరిగెను.

*　　*　　*

1955-56 సంవత్సరములో ఆలిండియా బ్లైండ్ రిలీఫ్ సొసైటీ వారిచేత, లజపతి నగరంలోని మోడల్ ఐ హాస్పిటలులో 27000 మంది రోగులుకండ్లకు వైద్య సహాయం పొందారు. బిజ్మసాన్, చిరాగ్-ఢిల్లీ, మదన్ పూర్, బహాదర్ ఘర్, అటల్, చిదర్ పూర్, కోడర్మా, మెహ్రూలీ కార్నాల్ పట్టణాలలో స్వల్పకాల మకాం లలో చికిత్స చేశారుకూడా.

*　　*　　*

సెంటు జాన్ అంబ్యులెన్సు అసోసియేషన్ వారి వార్షిక నివేదిక ననుసరించి ప్రథమ చికిత్స, నర్సు మొదలైన వృత్తులలో శిక్షణపొందినవారు 1911 సం॥లో 6000 మంది వుంటే, 1955 లో 1,00 000 మందికి పెరిగినారని పేర్కొనబడ్డది. 81,000 మంది అసోసియేషన్ తరఫున ట్రెయినింగ్ సర్టిఫికెట్లు పొందారని కూడ పేర్కొనబడ్డది.

*　　*　　*

ఈ సంవత్సరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు అపూర్వమైన వరదలచేత బాధపడినవారికి ప్రత్యేకమైన సహాయం చేశారు.

పాలు, బట్టలు, మందులు, క్రిమి సంహారకాలూ, మొదలైన ఇతర సామగ్రులు వరద బాధితులకు సప్లయి చేశారని నివేదికలో తెలియపర్చారు. సొసైటీ హెడ్ క్వార్టర్సు నుండిమే 36 లక్షల రూపాయల విలువగల సరఫరాలు జరిగాయి. ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, మాతా శిశు గృహాలు, స్కూళ్ళు, అనాథ శరణాలయాలు మున్నగు సంస్థలు 230 టికి సహాయం జరిగింది.

*　　*　　*

అఖిల భారత మహిళా సమ్మేళనమువారు, శ్రీమతులు సరోజనీనాయుడు, మార్గరెట్ కజిన్స్‌ల యొక్క అపార భారత మహిళా సేవ జ్ఞాపక చిహ్నంగా ఏదైన తగినది స్థాపించుటకు తీర్మానించారు. ప్రజలనుండి సేకరించబడిన చందాలతో ఒక భవనము సరోజినీ నాయుడుపేరున నిర్మిస్తారు. "సరోజినీ నాయుడు హౌస్" అనే ఈ భవనం స్త్రీలకు ప్రత్యేక కార్యకలాపాల కేంద్రమై యుంటుంది.

"సరోజినీ నాయుడు హౌస్" నందలి గ్రంథాలయము కజిన్సు సతి పేరిట వెలుస్తుంది. ఇందు అన్ని స్త్రీలవాఙ్మయగ్రంథములు, స్త్రీ సంస్థలకు సంబంధించిన గ్రంథములు ముఖ్యముగా భారత స్త్రీల కార్యకలాపాలనుండి వెలువడిన గ్రంథములే ఇందు సేకరించబడతాయి.

చందాలు అఖిల భారత మహిళా సమ్మేళన సభా అధ్యక్షురాలి పేరిట, న్యూఢిల్లీకి పంపవలెను.

*　　*　　*

ప్రభుత్వంచే రెండవ పంచవర్ష ప్రణాళికలో నిర్ణయించబడిన నాలుగు శిశు ఆరోగ్య కేంద్రములలో ఒక దానిని హైదరాబాదులోని నిలూఫర్ స్త్రీల-శిశు వైద్యశాలకు అనుబంధంగా కలుపుటకు నిశ్చయించారు. ఈ కేంద్రములలోడాక్టర్లకూ, నర్సులకూ, శిశు విద్యయందూ, శిశు సంక్షేమమునందూ శిక్షణ ఈయబడును.

*　　*　　*

ఒక పత్రిక ఆధారంగా సేకరించిన విషయమేమంటే రాణీఖేట్ నివాసి శ్రీమతి వైయన్ ఐటన్ మొన్న జనవరిలో ఆమె మరణసమయమున వీలునామాలో తనపేరున బ్యాంకులో ఉన్న ఎక్కౌంటు మొత్తమును రాణీఖేట్ ఆల్మోరా అండ్ నైనిటాల్ పేదల నివారణ నిధికిగాను యు. పి. గవర్నరుకు స్వాధీన పరచవలసినదిగా వ్రాసియున్నారు. ఆమె బ్యాంకు ఎక్కౌంటు మొత్తము రు 1176-5-1 ఉన్నట్లూ, ఈ సొమ్మును యావత్తూ ఆమె కోరిన విధంగానే వినియోగించేటట్లూ సంకల్పించారు.

ANDHRA MAHILA SABHA
NURSING HOME

REPORT FOR JUNE 1956

MATERNITY WARD

No. of Patients admitted for Deliveries	106
„ „ Surgical cases treated	2
„ „ Medical cases treated	19
„ „ Gyneac. and Abortions	27
„ „ Ante-natal	39
„ „ Post Natal	3
„ „ normal deliveries	96
„ „ abnormal deliveries	10
„ „ babies	101
Grand total	297

IN-PATIENT MATERNITY

No of patients Delivered		106
„ „ normal Deliveries		96
„ „ abnormal Deliveries		
Twins	0	
Breach	1	
forceps	9	10
Total		106

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	130
„ „ Medical cases	737
„ „ Ante-natal cases	233
„ „ Post-natal cases	92
„ „ Gyneacological cases	124
„ „ E.E.N.T cases	49
Total No. of New patients	1365
Total No of Old patients	178[illegible]
Grand Total	3151

NURSES' TRAINING CENTRE

Out of 60 candidates undergoing the auxiliary training 30 will be completing their course in July 1956. 30 candidates sponsored by the Central Social Welfare Board have been taken in this year and have started their training The Andhra Government have promised to sponsor 30 more candidates.

Mrs LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs A C KRISHNA RAO
Administrative Secretary

Dr M PAVANA BAI
Medical Superintendent



కన్నీట తడిసిన ఉత్తరం

(శ్యామలా ఇంద్రాణి)

శ్రీ దేవీ విద్యాలయాన్నీ, దాని నిర్వాహకురాలు అన్నపూర్ణనూ, ఆసేతు హిమాచల పర్యంతమూ ఎరగని వారుండరు... అన్నపూర్ణ బి.ఏ. ఎల్.టి. తన యావత్తు జీవితం అనాథ బాలికల సేవలోనే గడిపిందంటే అతిశయోక్తి ఏమీలేదు.

శాంతి రూపొంది మనఎదుట నిలచిందేమో ననిపించేది ఆమె రూపం. చూడగానే వ్యథిత హృదయాలు చల్లబడతాయా అన్నట్లనిపించే సుందర విగ్రహం ఆమెది. ఆమె బాలవితంతువు. ఆమె దురదృష్టమే వేలాది నిర్భాగ్య బాలికలకు అదృష్ట హేతువైంది.

విద్యాలయపు ఆవరణలో, సాయంత్రపు నీ రెండలో, ఆమె చల్లగాలికై తిరుగు తూండగా ప్రక్క ఇంటి పెండ్లి పందిట్లో, నయనార్ నాదస్వరవాద్యం సన్నగా ఆమెచెవిలో పడింది.... ఆ సన్నాయి పలికే మధుర స్వరాలాపన ఆమెకు గత పలుసంవత్సరములకు వెనుకటి మధురానుభూతుల్ని జ్ఞాపకానికి తెచ్చింది. వెంటనే నిశ్చల సముద్రం అలల తాకిడికి అల్లకల్లోలమైనట్లు, ఆమె గంభీరవదనం భావ తరంగాలతో వికలమై పోయింది. అలలు మళ్లిపోగానే యిసుకలోని కెరటాల నీటితో నిండిన చిన్నగోతులవలె ఆమె విశాల నయనాలు అశ్రు జలపూరితా లయేయి.

ఎదురుగా సహాయ ఉపాధ్యాయిని సావిత్రిని చూచి అన్నపూర్ణ తన కన్నీరు తుడుచుకొని కుశల మడిగింది. అప్పుడు సావిత్రి "ఈరోజు క్లాసులో ఒక సందిగ్ధావస్థలో పడ్డానమ్మా! లాంగ్వేజ్ పాఠంలో, ప్రేమవల్లనే ఈ ప్రపంచం నిలచి యుందని" ఒక మాటవచ్చింది. అంతే ఏమి టంది ఆ అకతాయి పిల్ల సరూ.... అప్పుడర్థమయింది. నాచిన్న తనంలో మా టీచర్స్ ఎంత సతమత మయేవారో మాతో. అయినా అన్ని విధాలా సౌభాగ్యవతులైన పిల్లలకయితే అది విడమర్చి చెప్పవచ్చుగాని. ఈ లాంటి భగ్న జీవుల ముందు ఏమని చెప్పనమ్మా ప్రేమను గూర్చి..." చటుక్కున ఆగి పోయింది సావిత్రి అన్నపూర్ణ కూడా అలాంటి భగ్న జీవేనని గుర్తుకొచ్చి. "ఏం ఆగి

పోయావు" అంది అన్న పూర్ణ. "ఇంతకీ ఏదో ఆ కవి తనకు తోచిందేదో వ్రాశాడు గాని, నిజంగా ప్రేమకు అంత శక్తి ఉందంటే నాకు నమ్మకం లేదమ్మా" అంది సావిత్రి.

"మరి శ్రీనివాస రావుకు ఈసంగతి వ్రాయమంటావా"- అంది అన్న పూర్ణ. శ్రీనివాసరావునే కొద్ది రోజుల్లో సావిత్రి వివాహం చేసుకో బోతోంది... "ఏమోనమ్మా! నేను మొదట ఆవిధంగానే యోచించాను, కాని జీవితాంతం వరకూ ఈ అనాథ బాలికల సేవలోనే గడపేయా లని పిస్తోంది." అంది సావిత్రి... మొదట డబ్బు సంపాదించే ఆసక్తి తోనే అక్కడ చేరిన సావిత్రి, అన్న పూర్ణ సాహచర్యంతో పూర్తిగా మారిపోయింది....

"నిజం చెప్పాలంటే అందరూ పెద్దగా చెప్పుకునే ఈ విద్యాలయం ప్రేమపునాదిగానే ఉద్భవించిందనే చెప్పాలి" అన్నది అన్నపూర్ణ ఎక్కడో ఆలోచిస్తూ—

అదేమిటో నాకర్థంకాలేదు- వివరంగా చెప్పండి" అంది సావిత్రి. అయితే విను సావధానంగా—

"ఎదిరింటి పెండ్లి పందిట్లోని నాదస్వరం నీకు విన పడుతూందికదూ. ఆ వాద్య స్వరాలు నన్ను ఎన్నో ఏళ్ల వెనుకకు తీసికొనిపోయి అశ్రువులు రాల్పించినవంటే నీవు నమ్మతావా ? నీరాక నన్ను ఊహా స్వప్నాల్లోంచి మేల్కొలిపింది."

"ఆసంఘటన మీకతి చిన్నవయసులో జరిగిఉంటుందే: ఇంకా జ్ఞాపకముందా?" అంది సావిత్రి.

"వివాహం నాకు అతి బాల్య దశలోనే జరిగిపోయింది. దాన్ని గూర్చి కాదు నేను చెప్ప బోయేది.. మా పిన్ని కూతురు పెళ్లి విషయం గూర్చి- అప్పటికి నాకు 16 ఏళ్లు నాకన్న 4 ఏళ్లు చిన్నది ఆ అమ్మాయి. నాకీ దుర్విధి ప్రాప్తించిన దగ్గరనుంచి పిన్ని యింట్లోనే సామాన్యంగా ఉంటూ వచ్చేను. అసంతృప్తితో నిండిన నాభగ్న జీవితాన్ని మరపింప చేయాలనేమో, ఆయింట్లో వాళ్లంతా నాయిష్ట ప్రకారం చేసేదే వాడుకై పోయింది. పెళ్లి ఏర్పాట్లన్నీ నేను చెప్పి నట్లే జరిగేయి.

పెళ్లి వారు వచ్చి విడిదిలో దిగారు. వివాహానికి ముందుతంతులేవో జరిగేవేళ అది. ఆసమయంలో పెళ్లి కూతురి బంగారు జడపూవు కిందపడేట్లుగా వుంటే సవరి ద్దామని ఆమె వెనుకగా కూర్చున్నాను. జడబిళ్ల సవరించి, ఇకలేచి పోదామనుకుంటూ తలఎత్తి పెళ్లికొడుకు వైపు చూసేను. ఆపక్కనే ఉన్న రెండుకళ్లు నన్ను రెప్ప వాల్చకుండా చూస్తూండటం చూసేను. ఆచూపులు నా హృదయాంత రాళంలోకి చొచ్చుకు పోయాయి. ఒళ్లు కంపించి పోయింది. ఏదో తెలియని బాధ. మనసులో ఎన్నడూ ఎరుగని భావాలూ ఉదయించేయి. మళ్లీ మళ్లీ ఆ కళ్లనే చూడాలనే వాంఛ ప్రబలమైంది. రెండు మూడు సార్లు అప్రయత్నంగానే ఆకళ్లను చూసేను. అకస్మాత్తుగా చూడలేదు ఆ కళ్లు నన్ను అనిపించింది. నేను చూసి నప్పుడల్లా ఆకళ్లు నాకొరకే వెతుకుతూన్నట్లు నిశ్చయమైంది.

అంబుజం వివాహం మాట అటుంచి నా మనస్సులో ఏదో ఒక దృఢ నిశ్చయం ఏర్పడింది.

రెండో రోజు కూడ గడచిపోయింది. నామనస్సు ఉండ బట్టలేదు. వారిని గురించి కొన్ని వివరాలు సేకరించాను. పెళ్లి కొడుక్కి దగ్గర బంధువు. రాజధానికే ఫస్టుగా ఆ సంవత్సరమే బి, ఏ. పాసయేరనీ-పెద్ద కట్నాలతో పిల్లలు సిద్ధంగా ఉన్నారనీ కూడ తెలిసింది. అబ్బా! నాకంత అదృష్టమా అనిపించింది. ఏ లక్షాధికారి బిడ్డకో ప్రాప్తించే వారు నాకై ప్రాకు లాడుతున్నారా? నన్ను ప్రేమిస్తున్నారా? ఇంత గొప్పస్థితిపరుని ప్రేమకా పాత్ర మవుత ఈ పేదరాలు అని నామనసు ఆశా నిరాశల మధ్య ఊగిస లాడింది.

ఈ రోజులాగే ఆ నాడు కూడా పౌర్ణమి. నీలాకాశంలో నిండు చంద్రుడు విహరిస్తున్నాడు విలాసంగా తన పదహారు కళలనూ వెదజల్లుతూ. ఇలాటివి ఎన్నో పున్నమి రాత్రులు నా పదహారేళ్ల జీవితంలో సునాయాసంగా గడచి పోయేయి కాని ప్రత్యేకంగా ఆ పున్నమి నిశి అంతకు ముందెన్నడూ లేనంత హాయి గొల్పుతూంది. వెన్నెలలోని చల్లదనం భరించలేనంతగా ఉంది. మనస్సు ఎన్నడూ ఎరుగని తీయ తీయని అనుభూతుల్ని పొందింది. తెలియని బాధననుభవించేను-మల్లె పూలలో అంత సువాసన ఉన్నదని ఆ నాడు తెలుసుకున్నాను. సంగీతంలోని మాధుర్యం ఏవేవో లోకాలకు తీసుకుని పోయేట్లు తోచింది-

నేను కూడ అందరిలా అలంకరించు కొంటే ఏమి తప్పు అనిపించింది. నాలుగో రోజు మగపెళ్లి వారి

విడిదికి వెళ్లినప్పుడు ఆయన సంఘసంస్కరణను గూర్చి స్త్రీ పునర్వివాహంపై ఏదో తీవ్రంగా చర్చిస్తున్నట్లు విన్నాను-ఆయన కంఠంలో ఉత్సాహం, మాటల్లో విచక్షణత, వాదంలో సంస్కారం ఉన్నట్లు భావించాను. అప్పుడే ఎవరో "అన్నపూర్ణని చేసుకో చూద్దాం"- అనటం కూడా విన్నానేమో తెలియదు సరిగ్గా.

ఆ రోజు ఏపనీ సరిగాచేయ్యలేక పోయాను. ఇంట్లో వాళ్లందరకూ తలనొప్పి సాకుచెప్పి ఓ మూలగదిలో పడుకున్నాను. అయినా ఆయన గూర్చే ఎడతెరపిలేని ఆలోచనలు రాసాగాయి. ఆయన మాటలే నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయా అనిపించేది. మరునాడు పెళ్లి కొడుకు తల్లికి ఏదో సుస్తీగా ఉందంటే ఆ పని కావాలనే నా మీద వేసుకొని వాళ్లింటికి వెళ్ళాను ఆయన కనుపించక పోతారా అనే ధైర్యంతో, ఓసారి ఆయన్ని చూడాలనే ఆశతో—అనుకున్నట్లే అయింది ఆయన ఎదురుగానే ఉన్నారు. నేనెంత భయ పడ్డానో! అంతకు ముందెన్నడూ, ఆ తరువాతకూడా, అంతభయం ఎరగను "ఎవరి కొరకు " అన్నారు వారు. " వియ్యపురాలి గారికి— " ఆ తరువాత మాటే రాలేదు. వణకి పోతున్నాను-అప్పుడు వారేంచేశారో తెలుసా-? తటాలున నాచేయి పుచ్చుకుని నా చేతిలో ఒక కాగితపు మడత ఉంచి, నా చేతిని వారే మూసిపెట్టి వెళ్లి పోయేరు.

నేను లోనికివెళ్లి వియ్యపురాలిని చూచానో ఏంచేశానో నాకే తెలియదు-ఇంటికి వెళ్లి మూల గదిలో చాప మీద పడి కళ్ళు పోయేలా ఏడ్చాను—అంతే. ఆతరువాత యీనాటి వరకు వారు మళ్లీ నా కంట పడలేదు ... నా జీవితంలో ఆ నాలుగు రోజులే—! నా ఆనందానికి ఆదీ అంతమూ కూడా ఆ నాలుగు రోజులే!

తీయని కోరికలూ, తెలియని అనుభూతులూ, తరగని ఆనందమూ, తీరని బాధలూ అన్నీ ఆ నాలుగు రోజుల్లోనే."

సావిత్రికి అర్థంకాక, —

" ఏమిటమ్మా ! ఏంజరిగింది. ఆ జాబులో ఏమని వ్రాసేరు ?" అంది. అన్నపూర్ణ ముఖం వెల వెల బారింది. నెమ్మదిగా,

" ఆ జాబు ఆ నాడు చదువుకునే అదృష్టం నాకు లేక పోయింది. ఆ జాబే నాకు అక్షరాభ్యాసం చేయించింది. ఆ జాబే నన్నీస్థితికి తీసుకు వచ్చింది. సరిగా ఒక ఏడాదికి తరువాతనే ఆ జాబును చదవగలిగాను. "

" ఏమమ్మా ! పోనీ ఎవరిచేతైనా చదివించ లేక పోయారా ? అందులో ఏమని ఉంది."

" ఆ జాబు నా చేతిలో పడిన రోజు నాకు ఓనమాలు కూడ రావు ఆ కాగితాన్ని కన్నీటితో తడిపేది తప్పిస్తే నాకేమీ చేత కాలేదు సావిత్రీ! ఆ కారణంగానే నేను పట్టుదలతో చదివి ఒక ఏడాదికి జాబు చదివే సామర్థ్యాన్ని సంపాదించాను. అందులో " నీకు నన్ను పెళ్లి చేసుకుందామని యిష్టం ఉన్నట్లయితే నలుగు సమయంలోనో ఊరేగింపు వేళలోనో ఒక మల్లెపూవును చేతిలో ఉంచుకొని నాకు కనిపించు" అని ఉంది. నేను ఏడుస్తూ ఓ మూలపడి ఉండటం వలన తను నా మనస్సుకు అనవసరంగా కష్టం కల్గించానేమో ననే బాధతో ఇంత నా కంట పడలేదు నాటికీ నేటికీ ..కాని నాకు ఆ కాగితం లోని విషయాలు అర్థం చేసుకొనేపాటి అక్షర జ్ఞానం లేదని ఎలా ఊహించ గలరు వారు ?

ఆ తరువాతనే నేను దీక్షతో చదివి పరీక్షలు పాసు అయి నావంటి అదృష్ట హీనులకేదైన సేవ చేయ గల నేమో నని, నా చేతనయినంత వరకు ఈ విద్యాలయం నడుపు తున్నాను. సావిత్రీ! ఇప్పుడేనా నాతో ఏకీభవిస్తావా ? సర్వమూ ప్రేమమీదనే ఆధారపడి ఉందని" అని కధముగించింది అన్నపూర్ణ. ప్రవాహంగా వెలికి వచ్చే కన్నీటిని తుడుచు కుంటూ, సావిత్రి " ఎంత విషాదగాధ ఇమిడి ఉందమ్మా ఈ విద్యాలయ భవనం వెనుక " అంది.

నయనార్ నాదస్వరంలో సంగీత ప్రవాహమే కాక, దుఃఖాన్నే వెల్లువగా చూడగలిగారు సావిత్రీ అన్నపూర్ణా కూడా ఆ నాడు.

—కల్కి రచన ఆధారంగా.



గణిత దర్పణం నెం. 1

అణా పైసలకూ, నయాపైసలకు మారకం నిష్పత్తి

1 పైస		1నయాపైస
2 పైసలు		1
3		2నయాపైసలు
4		2
5		3
6		3
7		4
8		4
9		5
10		5
11		6
1 అణా		6
1	1 పైస	7
1	2 పైసలు	7
1	3	8
1	4	8
1	5	9
1	6	9
1	7	10
1	8	10
1	9	11
1	10	11
1	11	12
రెండు అణాలు		12
2అణాల	1 పైస	13
2	2	14
2	3	14
2	4	15
2	5	15
2	6	16
2	7	16
2	8	17
2	9	17

2అణాల	10 పైసలు	18నయాపైసలు
2	11	18
మూడు అణాలు		19
3అణాల	1 పైస	19
3	2	20
3	3	20
3	4	21
3	5	21
3	6	22
3	7	22
3	8	23
3	9	23
3	10	23
3	11	24
4 అణాలు		25
4 అణాల	1 పైస	26
4	2	26
4	3	27
4	4	27
4	5	28
4	6	28
4	7	29
4	8	29
4	9	30
4	10	30
4	11	31
5 అణాలు		31
5అణాల	1 పైస	32
5	2	32
5	3	33
5	4	33
5	5	34
5	6	34

5అణాల	7 పైసలు	35 నయాపైసలు
5	8	35
5	9	36
5	10	36
5	11	37
6 అణాలు		37
6అణాల	1 పైస	38
6	2	39
6	3	39
6	4	40
6	5	40
6	6	41
6	7	41
6	8	42
6	9	42
6	10	43
6	11	43
7 అణాలు		44
7అణాల	1 పైస	44
7	2	45
7	3	45
7	4	46
7	5	46
7	6	47
7	7	47
7	8	48
7	9	48
7	10	49
7	11	49
8 అణాలు		50
8అణాల	1 పైస	51
8	2	51
8	3	52

8అణాల	4 పైసలు	52నయాపైసలు
8	5	53
8	6	53
8	7	54
8	8	54
8	9	55
8	10	55
8	11	56
9 అణాలు		56
9అణాల	1 పైస	57
9	2	57
9	3	58
9	4	58
9	5	59
9	6	59
9	7	60
9	8	60
9	9	61
9	10	61
9	11	62
10 అణాలు		62
10అణాల	1 పైస	63
10	2	64
10	3	64
10	4	65
10	5	65
10	6	66
10	7	66
10	8	67
10	9	67
10	10	68
10	11	68
11 అణాలు		69 నయాపైసలు
11అణాల	1 పైస	69
11	2	70
11	3	70
11	4	71
11	5	71
11	6	72
11	7	72
11	8	73
11	9	73
11	10	74
11	11	74
12 అణాలు		75
12అణాల	1 పైస	76
12	2	76
12	3	77
12	4	77
12	5	78
12	6	78
12	7	79
12	8	79
12	9	80
12	10	80
12	11	81
13 అణాలు		81
13అణాల	1 పైస	82
13	2	82
13	3	83
13	4	83
13	5	84
13	6	84
13అణాల	7 పైసలు	85నయాపైసలు
13	8	85
13	9	86
13	10	86
13	11	87
14 అణాలు		87
14అణాల	1 పైస	88
14	2	89
14	3	89
14	4	90
14	5	90
14	6	91
14	7	91
14	8	92
14	9	92
14	10	93
14	11	93
15 అణాలు		94
15అణాల	1 పైస	94
15	2	95
15	3	95
15	4	96
15	5	96
15	6	97
15	7	97
15	8	98
15	9	98
15	10	99
15	11	99
16 అణాలు		
1 రూపాయి		100

మానవేశ్వరి

శ్రీ ఎల్. కె. దుర్గాచార్యులు

ఓ చెలి! నిన్నుగన్న తరినొక్క సమస్య బరిష్కరింపగా
దోచెను, యింటిదిద్దుకొని. దున్నెడిదాదిగ పంటనింటిలో
దాచెడి కార్యమౌవరకు దాల్మిని భర్తకునర్ధదేహమై
యాచకబాధ దీర్చెదవు, యైనయభేచ్ఛను సంచరింతువే?

పిల్లల యల్లరి మాన్పును
ఇల్లును శుభ్రంబుజేయు నింపుగ పాకం
బెల్లయు గూర్చును; భర్తకు
నుల్లాసము బెంచు: పత్నియోర్పెంతటిదో!

జరుగక జేయుచుంటివొకొ! జవ్వని; నీవునుకాపురంబు; వే
మరునిను మద్యపానమున మాటలమాలియు జావగొట్టినన్
కరుణను నీరుబోయుచు సుఖంబుగనీయెడి జేర్చి భర్తకు
శరణమునిత్తువే; మగువ; శాశ్వతమైనది ప్రేమనీయెడన్॥

మహిళ మంచిదైన మగవాడెయబలుడై
దాసుడగును లేదు మోసమిందు
పూటసుఖముకొరకు పొరపాటు జేయుచో
దీర్ఘ జీవితంబు తెచ్చుబాధ!

ప్రాణముపైన మక్కువ యపారముధాత్రిని జీవజాతికా
త్రాణను నిల్పనెన్ని పరితాపము లందెదరోయనన్, నం
శ్రేణియెరుంగు నట్టిదియుసీ తమమానమువీడ నొచ్చి. పూ
బోణులె వీరపత్నులయిపోయిరి దూకుచుఘోరజ్వాలలన్.

లక్ష్మీ ప్రొడక్షన్సువారి "ఇలవేల్పు"

లక్ష్మీ ప్రొడక్షన్సువారి ఇలవేల్పు శనివారము 30 వ జూను పారగన్ టాకీసులో ఉదయము 9 గంటలకు పత్రికా విలేఖరులకు ప్రత్యక్షమైంది.

అంజలి, జమున, పద్మిని, నాగేశ్వరరావు, గుమ్మడి. రేలంగి తారలతో, ప్రసాద్ పర్యవేక్షణతో, యోగానంద్ డైరక్షనుతో తయారైన చిత్రము.

కథ నూతనం త్రికోణముగాక షట్కోణాకారమైనది. కొత్త ఫక్కీలో కథ చాలా బాగానే వున్నది. నటీ నటకు లందరు చాలా బాగా నటించారనే చెప్పాలి. పాటలు ఓ మాదిరిగా వున్నాయి. ఫోటోగ్రఫీ ఫరవాలేదు కాని ఎందు చేతనో చిత్రము చప్పబడింది. రేలంగి "గయ్యాళి గంప" నాటక తతంగము అనవసరము. దానిని తగ్గించినట్లయితే వినోదమెక్కువై వెగటు కాకుండా వుండి వుండేది. అమ్మకు పాఠము తన వివాహముతోనే ఆరంభించితే అట్లాగే భార్యకు భర్తమీద అనుమానము ఇంకాకొంచెము నాజూకుగా సున్నితంగా స్ఫురింప జేస్తే క్లయిమాక్సు బాగా అందుకొని కథ చాలా రసవత్తరముగా వుండి వుండేదేమో.

మొత్తానికి ఇలవేల్పు ప్రత్యక్షమై ప్రజలకు ఆనందము చేకూర్చినదేగాని భక్తులకు వరము లివ్వలేదు.

కూచిపూడివారి సంగీత నాట్యాభినయ విశిష్టత

శ్రీ పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ

శ్రీ కూచిపూడివారి సంగీత నాట్యాభినయ కళాకౌశలము లనుపమానములు. వారిసంగీతపద్ధతులందేమి, నాట్యాభినయ పద్ధతులందేమి ప్రత్యేకమైన విశిష్టత నందియుండిరి. యీ రెంటి సమ్మేళనమే కూచిపూడి వారి అపూర్వ సాంప్రదాయము. అది యింకొకరి కలవడ జేసి కొనవలయునన్న వారల శుశ్రూష నొందనిచో. ఫలితార్థమును బొందజాలరు.

అసలు సంగీతము పూర్వకాలమున. కూచిపూడిగ్రామమందలి "హరివంశీయులగు రామయ్య"గారు ప్రసాదించిన క్రమపద్ధతి ననుసరించియే. దక్షిణదేశమందు నేటికిని ప్రచారమందున్నదనియు, అదియే మరల యిప్పటి రూపమున కూచిపూడి వారికి వచ్చినదనియు తెలియనగును.

తదుపరి మధ్యకాలమున వారి విశిష్టత నెట్లు పెంపు జేసికొనగలిగిరో తెలిసికొనుటకు ఒక యితిహాసమును గైకొందము. ఏమన? శ్రీ త్యాగరాజస్వామి వారి శిష్యులలో నొక ప్రముఖ గాయకుడు మచిలీ పట్టణమున (అదియే నేటి బందరు) సంగీత సభ చేయుచుండగా అందలి రాగాలాపన ప్రయోగము లేయే రాగలక్షణముల ననుసరించి యున్నవో సరిగా నిర్ణయింపజాలక, అచ్చటి పండిత ప్రముఖులు మరురోజునకూడ ఏతత్ గాయకుని కచ్చేరి చేయవలసినదిగ ప్రార్థించి కొంతమంది, కూచిపూడి వాస్తవ్యులైన శ్రీ యేలేశ్వరపు వెంకట్రామయ్య 'రిని గొంపోవుటకైరాగా, వారు జొన్న చేనిలో మంచె _మండి, చేత వడిశెల త్రిప్పుచు, కాపలా గాయుచున్న వారినిగాంచి, వృత్తాంత మంతయు సవిస్తరముగ దెల్పి వెంట దోడ్కొని పోయినట్లును, మరల నచ్చట జరుపబడుచున్న సంగీత కచ్చేరి యందు దేవగాంధారి రాగము నాలపింతునని నుడివి ఆరభిరాగ లక్షణము ననుసరించి పాడుచున్నటుల దోప శ్రీ వెంకట్రామయ్యగారు, దేవగాందారిరాగ ప్రయోగములకు, ఆరభి రాగము యొక్క ప్రయోగములకు గల తారతమ్యముల విపులీకరింపుచు, ముక్కు పొడుముకాయతో వీణియపై ప్రదర్శించి కూచిపూడి గౌరవము నినుమడింప జేసిరని తెలియనగును.

ఆ గ్రామ మందున శ్రీ త్యాగరాజస్వామివార్ల ఆరాధన మహోత్సవములుకూడ నత్యంత వైభవోపేతముగ ప్రతివత్సరమందును జరుప బడుచున్నవి. మొత్తము మీద నాపురజను లెల్లరు కొలదిగనో, గొప్పగనో, సంగీతము నాలపింప గలిగియుందు రనుటలో అతిశయోక్తి లేదు. కొంతమంది సంగీతము నందు చక్కని ప్రావీణ్యతనంది జీవించు చున్నవారలు. కావుననే "కూచిపూడిలో కుక్క మొరిగిననూ సంగీత సాంప్రదాయ పద్ధతి ననుసరించి యుండుననెడిసామ్యము జగత్ప్రసిద్ధమై వెలయుచున్నది.

ఇక నాట్యాభినయ పద్ధతులగూర్చి తెలిసి కొందము. కూచిపూడివారు "భరతముని నాట్యశాస్త్ర పద్ధతుల తు, చ. తప్పక ఆచరించిరనుటలో సందేహ మిసుమంతయు లేదు. ఎట్లన? అసంయుత సంయుత హస్తములందుననూ, స్థాయీ సంచార భావములందుననూ, కరచాలన పదవిన్యాసములందుననూ, గ్రీవాభేద దృష్టిభేదములందునను, నవరసాలంకార శోభితములై వెలయు చున్నవి. మొత్తముమీద నాట్యాభినయవిశిష్టతారీతులన్నియు వారలయందు మూర్తీభవించి, జనులకు ఐహికాముష్మిక ఫలప్రాప్తి నొసంగుచున్నవి. ఇట్టి అత్యుత్తమములైన కళారాధకులగుట వలననే పూర్వమందలి మహారాజులు సైతము వారి అభినయ రీతుల కచ్చెరువంది అనేక బహుమతులను బిరుదులను ఒసంగి సన్మానించి యున్నారు.

ఉ:— హైదరాబాద్ సంస్థానాధి పతులగు నిజాం నవాబు (ఇప్పటి రాజ ప్రముఖుల తాత ముత్తాతలు)గారు కూచిపూడి బ్రాహ్మణులకు ఆగ్రామమును అగ్రహారముగా వంశపారంపర్య అనుభవించునట్లు పారితోషికముగ నిచ్చియున్నారు, ఆ మహాపోషకుల చల్లనిచూపు వలననే, కడుపునందలి చల్ల కదలకుండునట్లు, ఆనాటి వంశీయులు కళారాధకులై తరించియుండిరి.

ఇప్పటికి వారివారి సంతానము లభివృద్ధియైన కొలది పంపిణీవిభాగములలో ఆస్థులు తరిగి "$\frac{1}{2}$" యకరము 1. యకరమునకుమించి యిప్పటివారికి యుండుటలేదు. కాని "వారలయందద్భుతమగు కళాసంపద వెల్లివిరియుచున్నది. కళాపోషణ సరిగా జరుగనంత కాలము వారు నివురుగప్పిన నిప్పువలెనే యుండవలసి వచ్చును. కళోపాసన, కళాపోషణ జరుగనియెడల దేశము తేజో విరాజితమై వెలుగొంద జాలదు. పాశ్చాత్య దేశము లన్నియు పై

లలితకళా సంప్రదాయముల విరివిగ పోషింపుచున్న విషయమెల్లరకు విదితమే మానవునికి ముఖ్యమగు తిండి, బట్ట." తదుపరి అపూర్వమగు యీ లలిత కళలయొక్క వెలుగును బట్టియే ప్రజలలో సహకారము విజృంభించి, సత్వర పరిణామము నొంది తరించగలరు. కళోపాసన చేయువారి హృదయము లతినిర్మలములు. వారు కఠోర వాక్యముల విననొల్లరు. బాధల కిసుమంతయు నోర్వజాలరు.


ప్రజలు నేటి రాజకీయములలో బడి పరస్పర ద్వేష బద్ధులై యీర్ష్యా సంద్రమందు దరిగానక యున్న కారణముచే, వారల కమృతోప మానమగు నా కళాసముదాయ మందెద్దియైన శాఖచేతి కందినయెడల, నడి సంద్రమందు కొట్టుకొని పోవుచున్న ప్రాణికి దైవనిర్దేశకమగు నేదియైన ఆధారము దొరికిన, దానివలన నొడ్డుకు జేరి అమ్మయ్యా! యిప్పటికి బ్రతికిబయట పడగల్గితి నని ఆనందించు నటులనే పై లలితకళా సంప్రదాయములానందదాయకములై ఐహికాముష్మిక ఫలప్రాప్తి నొసంగగలవనుటలో సందేహ మేమియులేదు. ఇందుచే నిరుద్యోగ సమస్యకూడ కొంతవరకు బాపుకొన వీలగును. నిస్సంశయము.

ఇట్టి అత్యుత్తమమైన కళలను, కళారాధకులను ఆదరించి, పరమోత్కృష్టమైన వీట్లను ప్రజల కందుబాటు నందుండునట్లును, ముఖ్యముగ ప్రతివిద్యార్థి విద్యార్థినుల ప్రాథమిక, మాధ్యమికోన్నత, కళాశాలలలో అందుబాటు యందుండునట్లు చేయుచు యింకనూ కొన్ని "లలిత కళాశాలల" నెలకొల్పి, పై విద్యాంశముల పోషించుకొనుట, తద్వారా దేశమునందు కళాసంపద వెల్లి విరియ జేయింపించుటకై ప్రభుత్వమువారు సత్వర చర్యలగైకొన గలరని వినయపూర్వకముగ కోరుచున్నాను. ఆ గ్రామమందు శ్రీ సిద్ధేంద్రస్వాములవారి వర్ధంత్యుత్సవములును గూడ విరివిగ జరుపబడుచున్నవి.

లోగడ కొలదికాలము క్రితము నుండియు అమాత్య శేఖరు లందరును, కూచిపూడి గ్రామ కళాసంపదను, గురుతించియుండు టెల్లరకు ముదావహము. యీ కారణమున "కళాక్షేత్రమైన కూచిపూడి గ్రామమునకు అత్యున్నతమైన కీర్తి రానున్నదనియు కావుననే రాష్ట్ర ప్రభుత్వములు కేంద్రప్రభుత్వము కూడ కూచిపూడి కళాసీమను గురుతించి యుండుటను బట్టిచూడ అత్యుత్తమమైన భవిష్యత్తుచే నా గ్రామము విలసిల్లగలదనియు, ముక్కోటి ఆంధ్రుల చిరకాలవాంఛ కొనసాగి ఆనందించు తరుణము సమీపించనున్నదనియు నమ్ముచున్నాము.

ఇక కూచిపూడి సాంప్రదాయ రక్షణకై తగు చర్యల సత్వరమే గైకొన వలసినదిగను ఆ గ్రామ మందున కళాశాల (సంస్కృత, సంగీత, నాట్య, గృహపరి శ్రమలు) నొకదానిని నెలకొల్పవలసినదిగ శ్రీ ప్రభుత్వము వారిని, కళా పోషకులను, విద్వత్ప్రముఖులను, ముక్కోటి యాంధ్రులను కోరుకొనుచున్నాము. ఆ గ్రామమునుమారు నలుబది గ్రామముల మధ్యనున్న గొప్ప ప్రయాణ కేంద్రము, పుణ్యక్షేత్రము. ఆ గ్రామ పరిసరములు కూడ (దివితాలూకా) మిక్కిలి చరిత్ర ప్రసిద్ధములై విలసిల్లుచునే యున్నవిషయ మెల్లరకు సువిదితమే.

కళాశాల స్థాపనకై సత్వరమే కార్య రూపము ఫలించునట్లాశీర్వదింప గోరుచున్నాను. "కళ కలకాలము వర్ధిల్లాలి. జైహింద్."



ప్రేమ సమాజం - విశాఖపట్టణం

నూతన మందిరానికి ప్రారంభోత్సవం.

విశాఖపట్టణం, ప్రేమసమాజాశ్రమంలోని పశ్చిమ భాగ మందిరానికి 24–6–56 ని ఆంధ్రరాష్ట్ర గవర్నర్ శ్రీ సి. యం. త్రివేది ప్రారంభోత్సవం చేశారు. ప్రేమసమాజం 1930 లో స్థాపితమై అనాథులు, వికలాంగులు, వెనుక పడిన జాతులు మున్నగు వారి సంక్షేమార్థం, సేవ చేస్తోంది. దాదాపు 24 యేళ్లవరకు. ప్రభుత్వ సహాయం లేక కేవలం ప్రజా సహాయంతోనే యీ సంస్థ దినాదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఇప్పుడీ సమాజానికి సుమారు $2\frac{1}{2}$ లక్షల రూపాయిల విలువ చేసేపెద్ద ఆశ్రమభవనం, కొంత భూవసతి, వివిధ చరాస్తులు ప్రజలవల్లే చేకూరినవి. అనేకమైన తటస్థ సేవలు కాక ఆశ్రమంలో 40 మంది బాల బాలికలతో ఒక అర్ఫ నేజ్, 30 పడకలతో అనాథ శరణాలయం, విద్యా వ్యాపనార్థం బేసిక్ స్కూలు, వికలాంగులకు భోజన కేంద్రం, 40 మంది కుష్ఠరోగులకు ప్రత్యేకంగా శరణాలయం మున్నగునవి నిర్వహించ బడుతున్నవి. అచ్చుపని, కుట్టు, అల్లిక కార్పెంట్రీ మున్నగు పరిశ్రమలు కూడ వున్నాయి. గతయేడు యీ పరిశ్రమలకును, అర్ఫ నేజ్ నిర్వహణ నిమిత్తము కేంద్ర సంక్షేమ సంస్థ ప్రేమ సమాజానికి రూ ·9, 000 లు. గ్రాంటు యిచ్చింది. ప్రారంభోత్సవం జరిగిన మందిరం, తుమ్సర్ నివాసి రాయ్సాహెబ్ శేఠ్ శ్రీ గోపికిసన్‌జీ అగర్వాల్ యిచ్చిన 11, 00 1 లతో నిర్మితమైంది. గవర్నర్. త్రివేదిగారు శ్రీ శేఠ్‌గారి చిత్రపటాన్ని కూడ ఆవిష్కరించారు. పై మందిరానికి అనుకొనివున్న గదులు శ్రీ దవేజర్‌రాణీ సాహేబా ఆఫ్ గంగ్‌పూర్, యిచ్చిన రూ 2, 500–లు, శ్రీ కొల్లూరు సూకయ్యగారి వెంకట రత్నంగారిచ్చిన రూ 2, 500–లు, కేంద్ర ప్రభుత్వం, స్థానికాభివృద్ధి ప్రణాళిక కిందయిచ్చిన రూ 16, 000 లతోను కట్ట బడినవి. గవర్నరుగారికి ప్రేమ సమాజం అధ్యక్షులు శ్రీ కే.యస్.దత్ స్వాగతపత్రంసమర్పించారు.

ఉత్సవానికి వందలాది పుర ప్రముఖులు హాజరయ్యారు. శ్రీ శేఠ్ గోపికిసన్ గారి కుమారులు, రవి శంకర్జీ అగర్వాల్ కుంజ్ బిహారీజీ అగర్వాల్ ప్రత్యేకంగా తుమ్సర్ నుండి విచ్చేశారు. నూతన మందిరంలో విద్యుద్దీపాలకు గాను శ్రీ రవిశంకర్‌జీ రూ 1001 లు, సమాజ పోషణలోవున్న కుష్ఠ రోగుల సహాయార్థం స్థానిక అడ్వకేటు, శ్రీ సి హెచ్, మోజెస్ రూ 50 లు విరాళాలిచ్చారు,

గ్రంథ సమీక్ష

ఉత్తమ స్త్రీల కథలు - ఉపనిషత్ స్త్రీల కథలు

గ్రంధకర్త్రి : పండిత జూలూరి తులశమ్మ

వేదములందు ఉపనిషత్తులందు పేర్కొన బడిన మహిళల మాహాత్మ్యమును విశదీకరించు ఈకథల పుస్తకములను పండిత జూలూరి తులశమ్మగారు రచించారు. పాశ్చాత్య విద్యా ప్రాబల్యమున సంక్రమించిన నాగరికతా వ్యామోహములో కొట్టుకొని పోవు మన ఆంధ్ర నారీ మణులకు ఈ రెండు పుస్తకములు కరదీపికల వంటివని చెప్పుటకు సందేహములేదు. ఏమందురా? శిష్టసాంప్రదాయముల స్వరూప స్వభావముల నేమఱచియున్న నేటి మన మహిళా లోకమునకు ఈ రెండు పొత్తములును, జ్ఞానోదయమును కలిగించి, సమస్త విషయము లందును సమర్థులమై మెలగు ధీశక్తిని పునఃప్రతిష్ట చేయుననుట యతిశయోక్తి కానేరదు.

సతీత్రయ చరిత్రము

ఆస్థానకవి : శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు.


ఇందు ముగ్గురు పతివ్రతల కథలు పద్యములతో వివరింపబడినవి. వీరు శతాధిక గ్రంధ కర్తలు. "సక్కుబాయి, మీరాబాయి, అహల్యాబాయి." అను ముగ్గురు భక్తురాండ్ర కథలను హృద్యమముగా వర్ణించుచు నారీ లోకమునకు మూడు రత్న భూషణములను అందించి యున్నారు.

ద్రా మో ద రీ య ము

"అనంతం"

ఈ కావ్యము రచించినవారు అనంతం. వీరి పూర్తి పేరు ఏలూరిపాటి అనంతరామయ్య. ఇది వ్యాజస్తుతిపరమైన శతక కృతి. హాస్యరసమైనను పద్యములు రసాప్లుతములై పరితల నానందింప జేయుచున్నవి. మా ఆంధ్ర మహిళ తన పండ్రెండవ వార్షిక ప్రత్యేక సంచికలో కొన్ని పద్యములు కూడ ప్రకటించియున్నది.

జి. సుందరీ శంకరం.



"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

ఆగస్టు 1956


ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
•	•	•	1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	•

8. మొహరం, 15. స్వతంత్ర దినోత్సవం, 21. శ్రావణపూర్ణిమ, 29. శ్రీ కృష్ణజయంతి.

ANDHRA MAHILA SABHA
MYLAPORE : : MADRAS 4.

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A., at the Andhra Mahila Press, Mylapore, Madras 4.

మీ క్రొత్త నాణ్యాలను గురించి తెలుసుకోనండి



ఇప్పటిలో మీరు మీడబ్బును రూపాయలు, అణాలు, పైసాలని లెక్క పెట్టుతున్నారు. మీ సౌలభ్యం కొరకనే భారత ప్రభుత్వంవారు 1957-వ సం॥ ఏప్రిల్ 1-వ తేదీ లగాయతు దశమాంశ నాణ్యాలను ప్రవేశ పెట్టాలని తీర్మానించుకున్నారు.

ఈ క్రొత్త నాణ్యపద్ధతి చొప్పున మీ రూపాయికి 100 నయా పైసాల విలువగలదు. మొత్తం ఏడు రకాల నాణ్యాలు వాడుకలో ఉంటాయి :—

100 నయా పైసలు ... (ఒక రూపాయి)
50 నయా పైసలు ... (అర్ధ రూపాయి)
25 నయా పైసలు ... (కాలు రూపాయి)
10 నయా పైసలు ... (రూపాయిలో 1/10 భాగము)
5 నయా పైసలు ... (రూపాయిలో 1/20 భాగము)
2 నయా పైసలు ... (రూపాయిలో 1/50 భాగము)
1 నయా పైసా ... (రూపాయిలో 1/100 భాగము)

గమనింపదగిన విషయాలు

- రూపాయి చెలామణీ నాణ్యంగా వుంటుంది. దాని విలువలో లాభ నష్టము లేవీ ఉండవు.
- పాత నాణ్య పద్ధతినుండి కొత్త పద్ధతికి మార్పు సందర్భంలో, ఈ మార్పు సావకాశంగా, క్రమక్రమంగానే జరుగుతుంది. కనీసం మూడు సం॥ వరకైనా పాత నాణ్యాలూ, కొత్త నాణ్యాలూ చెలామణీలో వుంటాయి.
- ఈ మూడు సం॥ కాలంలో లావాదేవీలు పాతనాణ్యాలతో నైనా, కొత్త నాణ్యాలతోనైనా లేక ఈ రెండు పద్ధతులలోనూ జరుగుతూ వుంటాయి



DA-56/32